నిపుణ Guide to Excellence

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA



ఎడతెగని హైడ్రామా

తమిళనాట తొలగని అనిశ్చితి

116 మంది సంతకాలతో గవర్నర్‌కు విజయ్ లేఖ!

మెజారిటీ చూపితేనే ప్రమాణంపై గవర్నర్ ఆర్లేకర్ ప్రకటన

> 7

శనివారం SATURDAY 9.5.2026 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 15 || సంచిక (Issue): 334 || వెల (Price) రూ.6.50 | సప్తమి

శనివారం, సూర్యోదయం: 5-46, సూర్యాస్తమయం: 6-39. శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం వసంత రుతువు వైశాఖ మాసం కృష్ణ పక్షం తిథి: సప్తమి పగలు 2-04 వరకు, తదుపరి అష్టమి. నక్షత్రం: శ్రవణం రాత్రి 11-24 వరకు. వర్జ్యం: రాత్రి 3-38 నుంచి తెల్లవారుజామున 5-20 వరకు. రాహుకాలం: ఉదయం 9-00 నుంచి ఉదయం 10-36 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 5-47 నుంచి ఉదయం 6-38 వరకు. అమృతకాలం: పగలు 12-06 నుంచి పగలు 1-50 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

కాంగ్రెస్ పాలనలో కట్టు తప్పిన క్రైమ్ రేటు

గాడితప్పిన లా & ఆర్డర్

2024లో రాష్ట్రంలో మొత్తం నమోదైన నేరాలు **2,17,976**

2023తో పోల్చితే పెరిగిన క్రైంరేటు **18.7%**

నేరాల రేటు (లక్ష జనాభాకు)

418.9 దేశంలో

568.9 రాష్ట్రంలో

భయంకర నేరాల్లో పెరుగుల **172%**

2023తో పోలిస్తే 2024లో డ్రగ్స్ కేసుల పెరుగుదల **100%**

2023లో 1,464 కేసులు నమోదు కాగా.. 2025 నాటికి 2,734

49% 2024లో రాష్ట్రంలో పెరిగిన సైబర్ నేరాలు

2025లో హత్యలు **781**

లైంగికదాడి కేసులు **2,549**



- యథేచ్ఛగా లూటీలు.. నడిరోడ్డుపై హత్యలు.. కాల్పులు
- నేరాలకు కేరాఫ్ గా తెలంగాణ.. 18.7% పెరిగిన క్రైమ్
- నేటికీ నిందితుల ఆచూకీ దొరుకని కరీంనగర్ నగల దోపిడీ
- తాజాగా రిటైర్డ్ ఐపీఎస్ భార్యను చంపిన నేపాలీ గ్యాంగ్
- చిలకలగూడలో కత్తులతో పొడిచి యువకుడి హత్య
- నాగర్‌కర్నూల్ జిల్లాలో బాలికపై ఆరునెలలుగా లైంగికదాడి
- రాష్ట్రంలో శాంతిభద్రతలపై చేతులెత్తేసిన రేవంత్ సర్కార్
- భయంకరమైన నేరాల్లో 172 శాతం పెరుగుదల నమోదు
- సైబర్ నేరాల్లో దేశంలోనే నంబర్‌వన్ స్థానానికి తెలంగాణ
- అడ్డూఅదుపూ లేని డ్రగ్స్ వినియోగం.. ఎన్సీఆర్బీ నివేదిక వెల్లడి

> 2

పాలన గాడి తప్పింది. ప్రభుత్వం చేతులెత్తేసింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు రక్తమోడుతున్నాయి. నియంత్రించాల్సిన పోలీసులు రాజకీయ వేధింపుల్లో పావులుగా మారి అక్రమ కేసులు మెడకు చుట్టే పనుల్లో తలమునకలై ఉన్నారు. సోషల్ మీడియా పోస్టుల మీద నిఘా పెట్టి.. లా అండ్ ఆర్డర్‌ను గాలికొదిలేశారు. ఫలితంగా కరడుగట్టిన అంతర్రాష్ట్ర ముఠాలు పేట్రేగిపోతున్నాయి. నడిరోడ్డుపై కత్తులతో నరికిచంపుకోవడాలు నిత్యకృత్యమయ్యాయి. రాష్ట్రంలో భయంకరమైన నేరాలు 172శాతం పెరిగాయని, జాతీయ సగటు రేటు కన్నా తెలంగాణలోనే నేరాలు అధికమని జాతీయ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ)-2024 నివేదిక స్పష్టంచేసింది. అన్నట్టు మన రాష్ట్ర హోంశాఖ మంత్రి ఎవరో తెలుసా..? ఇంకెవరు.. సీఎం రేవంతే!



జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లో హత్య జరిగినచోట వివరాలు సేకరిస్తున్న పోలీసులు; (ఇన్‌సెట్లో) ముందురోజు రెక్కీ నిర్వహిస్తున్న నిందితులు

రిటైర్డ్ ఐపీఎస్ భార్య దారుణహత్య

- నేపాలీ గ్యాంగ్ ఘాతుకం.. భారీగా నగదు, ఆభరణాలు చోరీ
- రెండ్రోజులపాటు రెక్కీ నిర్వహించి హతమార్చిన నిందితులు

> 3

రాష్ట్రంలో నేరాలు పెరిగినయ్



- మత్తుకు బానిసవుతున్న యువత
- వరంగల్‌లో మరీ దారుణం, తన్నుకోవడాలు, కొట్టుకోవడాలే
- హైదరాబాద్‌లో ఆగని బైక్ రేసింగ్
- మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు

> 2

సర్కార్ విఫలం

- పోలీసుల చేతగానితనంతోనే బీఆర్ఎస్ నేతలపై దాడులు
- డీజీపీకి బీఆర్ఎస్ వినతిపత్రం
- రేవంత్ పాలనలో దిగజారిన శాంతి భద్రతలు: కేటీఆర్

> 3

ధాన్యం కొనండి బాంచెన్

పంట కొనుగోళ్లు చేపట్టాలంటూ కాళ్లపై పడి రైతుల వేడుకోలు



'వానలు పడ్తున్నయ్. వడ్లు ఎక్కడ తడుస్తయోనని భయమైతున్నది.. మీ కాల్మొక్త సారూ.. వడ్లు కొనండి..' అంటూ మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య కాళ్లపై పడి వేడుకుంటున్న హాజీపూర్ మండలం కర్నమామిడికి చెందిన రైతు బొడ్డు మధుకర్



ప్రభుత్వం వడ్లు, మక్కలు కొనాలని కోరుతూ నిర్మల్ జిల్లా రాజురా గ్రామ రైతులు శుక్రవారం అర్లి ఎక్స్‌రోడ్డు వద్ద రాస్తారోకో చేశారు. వెంటనే పంటలను కొనాలంటూ.. లోకేశ్వరం తహసీల్దార్ సూర్యా రావు కాళ్లు మొక్కుతున్న రైతులు

కాంగ్రెస్ వెన్నుపోట్లు కూటమికి బీటలు

- ఒక్కో రాష్ట్రంలో ఒక్కో రకంగా హస్తం అవకాశవాదం
- మిత్రద్రోహంతో దూరమవుతున్న 'ఇండియా' పార్టీలు!
- పదవుల కోసం డీఎంకేతో 55 ఏండ్ల దోస్తీకి కాంగ్రెస్ గుడ్‌బై
- మోసగాళ్లతో ఉండలేమని కూటమి నుంచి డీఎంకే ఎగ్జిట్
- పార్లమెంట్‌లో మరో చోట సీట్ల కోసం స్పీకర్‌కు విజ్ఞప్తి
- తమిళనాడులో కాంగ్రెస్ నేతలను కొట్టిన డీఎంకే నేతలు
- వెన్నుపోటు వైఖరిపై ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ ధ్వజం
- కష్టాల్లో మిత్రులను విడిచిపెట్టే వాళ్లం కాదని చురకలు

భుజంపై చెయ్యేసినట్టే కనపడుతూనే.. వెన్నుపోటు పొడవడం! అవకాశం దొరికితే వారిని అధికారానికి దూరం చేయడం! ఓడినచోట సహచరులకు చెయ్యిచ్చి మిత్రద్రోహానికి పాల్పడటం! ఇది ఇండియా కూటమి పట్ల కాంగ్రెస్ అనుసరిస్తున్న కుటిల నీతి! తమిళనాడు తాజా పరిణామాలతో ఇది మరోసారి సుస్పష్టమైంది. అఖిలేశ్, తేజస్వీ, ఉద్ధవ్, కేజ్రీవాల్ ఇప్పటికే కాంగ్రెస్ అవకాశవాద రాజకీయాలకు బాధితులుగా మిగిలిపోగా.. ఇప్పుడు మమత, స్టాలిన్‌లకు తత్వం బోధపడుతున్నది! > 7



రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం భూక్యాతండాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కరచాలనం చేస్తున్న గిరిజన మహిళలు

కాంగ్రెస్ దరిద్రం మనకెందుకు?

దేశమంతా వదిలించుకుంటుంటే తెలంగాణ నెత్తిన రుద్దుకున్నది

- రెండున్నరేండ్లలో రైతులు, విద్యార్థులు ఆగమైండ్రు
- రైతు డిక్లరేషన్ ఏమైంది? రెండులక్షల ఉద్యోగాలేవి?
- ఏడాదిన్నర ఓపిక పట్టండి.. కేసీఆర్ సీఎం అయితడు
- త్వరలో బీఆర్ఎస్ సభ్యత్వాలు పూర్తిచేసి, కొత్త కమిటీలు
- ప్రజా సమస్యలపై కొట్లాడే యువతకు ప్రాధాన్యమిస్తం
- వీర్నపల్లికి కేంద్రమంత్రి బండి చేసిందేమున్నది?: కేటీఆర్

> 6



అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

మహబూబాబాద్ జిల్లా మేఖ్యాతండాలో విషాదం > 6

పొరపాటున కూలగొట్టినం.. మళ్లీ కట్టుకోండి!



- సామాన్యుడితో ఆటలాడుకుంటున్న హైడ్రా అధికారులు
- 2024లో సున్నంచెరువు పరిధిలో భవనం కూల్చివేత
- ఇప్పుడు బఫర్, ఎఫ్టీఎల్ పరిధిలోకి రాదంటూ మెసేజ్
- మళ్లీ భవనం కట్టుకుంటే అభ్యంతరం లేదన్న అధికారులు
- నష్టంపై ప్రశ్నిస్తే కోర్టును ఆశ్రయించాలంటూ ఉచిత సలహా
- ఫ్రెండ్ కోసం అలైన్‌మెంట్ మార్చిన ఓ హైడ్రా ఉన్నతాధికారి

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 8 (నమస్తే తెలంగాణ): సామాన్యులతో హైడ్రా ఎలా ఆడుకుంటున్నదో ఇదే ప్రత్యక్ష ఉదాహరణ. అడ్డూ అదుపులేని అధికారాలను చూసుకొని, గుడ్డెద్దు చేలో పడ్డట్టు చెరువుల చుట్టూ ఉన్న నిర్మాణాలపై బుల్డోజర్లతో హైడ్రా విరుచుకుపడుతున్న సంగతి తెలిసిందే. తరతరాలుగా నివాసం ఉంటున్నామని చెప్తున్నా, ప్రభుత్వం అన్నిరకాల అనుమతులు ఇచ్చిన తర్వాతే ఇండ్లు కట్టుకొన్నామని మొత్తుకుంటున్నా చెవికెక్కించుకోకుండా ధ్వంసరచన కొనసాగిస్తున్నది. పైగా కూల్చేసిన చోట ఫెన్సింగ్ వేస్తూ, 'రూ.వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని పరిరక్షించాం' అంటూ గొప్పలు చెప్పుకొంటున్నది. కానీ హైదరాబాద్ సియేట్ కాలనీలోని సున్నంచెరువు వద్ద హైడ్రా అసలు రూపం బయటపడింది. ఓవైపు సరైన వివరాలు సేకరించకుండానే నిర్మాణాలను కూల్చివేయగా, మరోవైపు తమ స్నేహితుడి కోసం హైడ్రా ఉన్నతాధికారి ఒకరు ప్లాన్‌నే మార్చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సున్నంచెరువు సమీపంలోని సర్వేనంబర్లు 12,13లో హైడ్రా 2024 సెప్టెంబర్‌లో > 6వ పేజీలో

ఇంటర్ విద్యకు మంగళం

- పీవీ తెచ్చిన సంస్కరణకు కాంగ్రెస్ తూట్లు
- బోర్డు రద్దు దిశగా సర్కార్ అడుగులు
- ఆర్డినెన్స్ తెచ్చేందుకు వేగంగా కసరత్తు

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): సంస్కరణలకు ఆద్యుడు.. తెలంగాణ తేజం పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన ఇంటర్ విద్యను కాలగర్భంలో కలిపేందుకు కాంగ్రెస్ సర్కార్ రెడీ అయ్యింది. దేశానికే ఆదర్శం, సక్సెస్‌కు చిరునామా అయిన ఇంటర్ విద్యను రద్దు చేయనున్నది. ఈ దిశలో సర్కార్ ఆగమేఘాల మీద కసరత్తు చేస్తున్నది. ఆర్డినెన్స్ > 9వ పేజీలో

5,001 స్కూళ్లలో సింగిల్ టీచర్

- 2,245 స్కూళ్లలో జీరో ఎన్‌రోల్‌మెంట్ > 9
- రాష్ట్రంలో దిగజారుతున్న బడుల పరిస్థితి
- నీతి ఆయోగ్ నివేదికలో విస్తుపోయే వాస్తవాలు

కొడంగల్‌కే సాగునీరు



> 8

- కొడంగల్ సభలో తేల్చిచెప్పిన సీఎం రేవంత్
- ఇదే జిల్లాలోని వికారాబాద్, తాండూర్, పరిగి నియోజకవర్గాలకు మొండిచెయ్యి
- 8 లక్షల ఎకరాలకు నీరందించే..90 శాతం పూర్తయిన పాలమూరు ప్రాజెక్టుపై వివక్ష
- కాంగ్రెస్ వచ్చాక పైసా ఖర్చుచేయని వైనం
- సర్కార్ తీరుపై జిల్లా రైతాంగం అసంతృప్తి

మహారాష్ట్ర ఒప్పుకొంటేనే తమ్మిడిహట్టి బరాజ్


- బీజేపీ కేంద్రమంత్రులు, ఎంపీలు మహారాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి ఒప్పించాలన్న మంత్రులు
- నానా హడావుడి చేసి చివరకు బీజేపీతో ముడి

కుమ్రం భీం ఆసిఫాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ) : మహారాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకొంటేనే తమ్మిడిహట్టి వద్ద బరాజ్ నిర్మిస్తామని రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. శుక్రవారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం తమ్మిడిహట్టి గ్రామ శివారులోని ప్రాణహిత నదిపై బరాజ్ నిర్మించే ప్రాంతాన్ని, 2008లో వైఎస్ఆర్ ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణ కోసం వేసిన పైలాన్‌ను > 8వ పేజీలో

నేరాలు ఘోరాలు

కాంగ్రెస్ పాలనలో.. కట్టుతప్పిన క్రైం రేట్

నడిరోడ్లపైనే తెగనరుకుతూ హత్యలు



- నగరం నడిగడ్డపై రిటైర్డ్ ఐపీఎస్ భార్య హత్య
- పట్టపగలే కాల్పులు జరిపి విచ్చలవిడి దోపిడీలు
- ప్రతిపక్షనేతలు, వాహనాలపై పెరిగిన దాడులు
- అడ్డూ అదుపు లేకుండా డ్రగ్స్ వినియోగం.
- నడిరోడ్లపైనే గంజాయి తాగుతున్న యువత
- ఉడ్తా తెలంగాణగా మారుతున్నదని ఆందోళన

- దక్షిణాదిలోనే నేరసామ్రాజ్య రాష్ట్రంగా తెలంగాణ
- సైబర్ నేరాల్లో దేశంలోనే నంబర్ 1 స్థానానికి
- అదుపుతప్పిన శాంతిభద్రతలపై చేతులెత్తేసిన సర్కార్

రాష్ట్రం సిద్ధించిన తర్వాత.. శాంతి భద్రతలతో పరిఢవిల్లిన తెలంగాణ.. నేడు నేరాలకు అడ్డాగా మారింది. ఎటుచూసినా దోపిడీలు, దొంగతనాలు, హత్యలు, లైంగికదాడులతో భయానక పరిస్థితులు నెలకొన్నాయి. బీఆర్ఎస్ హయాంలో శాంతిభద్రతల్లో అగ్రగామిగా ఉన్న తెలంగాణ ఇప్పుడు అశాంతి, అభద్రతతో కొట్టుమిట్టాడుతున్నది. ప్రజాపాలన అంటూ అధికారం చేపట్టిన కాంగ్రెస్.. పాలనపై పట్టు కోల్పోవడంతో తెలంగాణ అల్లకల్లోలంగా మారింది.

15 రోజులుగా జరుగుతున్న దారుణాలతో రాష్ట్రమంతా కలవరపడుతున్నది. కొద్ది రోజులుగా చోటుచేసుకుంటున్న హత్యలు, దోపిడీలు, భౌతిక దాడులు నేరగాళ్ల తెగింపును బట్టబయలు చేస్తున్నాయి. రద్దీగా ఉండే రోడ్లపై పట్టపగలే హత్యలు జరుగడం శాంతిభద్రతల వైఫల్యానికి నిదర్శంగా నిలుస్తున్నాయి.

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఏకంగా ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు నివాసం ఉండే ప్రాంతంలోనే జరిగిన హత్య రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. గురువారం రాత్రి సికింద్రాబాద్ చిలకలగూడలో 23 ఏండ్ల బీటెక్ విద్యార్థిని నడి రోడ్డుపై దుండగులు కత్తులతో పొడిచి చంపారు. పోలీసుల పటిష్ట నిఘా లేకపోవడంతో దొంగలు కొద్దిరోజులుగా పేట్రేగిపోతున్నారు.

ఇటీవల కరీంనగర్‌లోని నగల షాపులో దోపిడీ ముఠా నలుగురు సిబ్బందిపై తుపాకులతో కాల్పులు జరిపి దాదాపు కిలో బంగారం ఎత్తుకుపోయింది. అప్పట్లో హైదరాబాద్‌లోనూ పట్టపగలే చందానగర్ నగల దుకాణంలో జరిగిన దోపిడీ, ఏటీఎం ధ్వంసం లాంటి ఘటనలు సంచలనం సృష్టించాయి. మరోవైపు రాష్ట్రంలో రాజకీయ వైషమ్యాలు పెరిగి భౌతికదాడులకూ దారితీస్తున్నాయి. గురువారం కరీంనగర్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ ఆఫీస్‌పై బీజేపీ కార్యకర్తలు దాడి చేసి ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వాహనాన్ని ధ్వంసం చేస్తున్నా పోలీసులు చేష్టలుడిగి చూస్తూ ఉండటం తీవ్ర విమర్శలకు దారితీసింది. రాష్ట్రంలో క్రైమ్ రేట్ పెరిగిందని, యువత మత్తుకు బానిసగా మరుతున్నదని స్వయంగా రాష్ట్ర మంత్రి కొండా సురేఖ వెల్లడించడం కాంగ్రెస్ సర్కార్ పనితీరుకు అద్దం పడుతున్నది.

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన దశాబ్దంలో భౌగోళికంగా, ఆర్థికంగా ఎంతో పురోగతి సాధించినా, శాంతిభద్రతలను అదుపులో పెట్టినా.. రెండున్నరేండ్లుగా రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ ఒక క్లిష్టమైన సవాలుగా మారింది. రాజధాని హైదరాబాద్‌లోని సంపన్న ప్రాంతాల నుంచి మారుమూల జిల్లాల వరకు వరుసగా జరుగుతున్న హత్యలు, పగటిపూట దోపిడీలు, మహిళలు, చిన్నారులపై పెరుగుతున్న లైంగికదాడులు సామాన్య ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రత్యేకించి పారిశ్రామికంగా, సాంకేతికంగా దూసుకుపోతున్న రాష్ట్రంలో నేరాల రేటు జాతీయ సగటు కంటే ఎక్కువగా ఉండటం గమనార్హం.

ఎన్సీఆర్బీ నివేదిక ప్రకారం, తెలంగాణలో నేరాల నమోదు రేటు పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు కంటే ఎక్కువగా ఉన్నది. 2024లో తెలంగాణలో మొత్తం 2,17,976 కాగ్నిజబుల్ నేరాలు (ఐపీసీ, బీఎన్ఎస్, ఎస్ఎల్ఎల్ కలిపి) నమోదయ్యాయి. 2023లో నమోదైన 1,83,644 కేసులతో పోలిస్తే ఇది 18.7% పెరుగుదలను సూచిస్తున్నది. రాష్ట్రంలో ప్రతి లక్ష జనాభాకూ నేరాల రేటు 568.9గా ఉన్నది. ఇది జాతీయ సగటు 418.9 కంటే చాలా ఎక్కువ. కేరళ, గుజరాత్, తమిళనాడు వంటి రాష్ట్రాలు మాత్రమే తెలంగాణ కంటే ఎక్కువ నేరాల రేటును కలిగి ఉన్నాయి. అయితే, ఉత్తరప్రదేశ్ (296.6), కర్ణాటక (290.6) వంటి పెద్ద రాష్ట్రాలతో పోల్చితే తెలంగాణలో నేరాల నమోదు గణనీయంగా ఎక్కువ ఉండటం గమనార్హం.

సికింద్రాబాద్‌లో బీటెక్ విద్యార్థి దారుణ హత్య

మే 7న రాత్రి సికింద్రాబాద్‌లోని చిలకలగూడలో 23 ఏండ్ల బీటెక్ విద్యార్థి యవన్ హత్యకు గురయ్యాడు. జవహర్ నగర్‌కు చెందిన యవన్ తన స్నేహితులతో కలిసి క్రికెట్ మ్యాచ్ చూస్తుండగా, బైక్‌లపై వచ్చిన నలుగురు వ్యక్తులు ఇంట్లోకి చొరబడి కత్తులతో దాడి చేశారు. బాధితుడు తప్పించుకోవడానికి రోడ్డుపై పరుగెత్తినా నిందితులు వెంటాడి మరీ మెడ, తల భాగాల్లో పొడిచి చంపారు. ఈ హత్య వెనుక ప్రేమ వ్యవహారం, అమ్మాయి కుటుంబ సభ్యుల పాత్ర ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. పట్టపగలే, జనం చూస్తుండగానే ఇలాంటి దాడులు జరుగడం సమాజంలో పెరుగుతున్న నేర ప్రవృత్తికి అద్దం పడుతున్నది. బాధితుడి కుటుంబ సభ్యులు సీతాఫల్‌మండిలోని యువతి ఇంటి ఎదుట ఆందోళన చేపట్టడంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొన్నది. ఈ వరుస ఘటనలతో పోలీసులంటే నేరస్తుల్లో భయం ఏమాత్రం లేదని అర్థమవుతున్నది.

రాజకీయ హింస, ప్రతిపక్ష నేతలపై దాడులు

రాష్ట్రంలో రాజకీయ వైషమ్యాలు కూడా శాంతిభద్రతల సమస్యగా మారుతున్నాయి. గురువారం కరీంనగర్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు ఆఫీసుపై బీజేపీ కార్యకర్తలు దాడి చేయడం ఉద్రిక్తతకు దారితీసింది. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఈ దాడులు జరిగాయి. కౌశిక్‌రెడ్డి వాహనాన్ని పోలీసుల ఎదుటే ధ్వంసం చేశారు. ప్రతిపక్ష నేతల ఇండ్లపై దాడులు చేస్తున్నా.. వారి వాహనాలను ధ్వంసం చేస్తున్నా.. కొన్ని చోట్ల భౌతిక దాడులకు తెగబడుతున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు.

ఆయుధాలతో దోపిడీలు..

నేరగాళ్లు ఇప్పుడు కేవలం చిన్న దొంగతనాలకే పరిమితం కాకుండా, భారీ స్థాయిలో ఆయుధాలతో దోపిడీలకు పాల్పడుతున్నారు. మే 3న కరీంనగర్‌లోని పీఎంజే జ్యువెల్లరీ షాపులో జరిగిన సాయుధ దోపిడీ ఇందుకు నిదర్శనం. ఐదుగురు సభ్యుల ముఠా కస్టమర్ల వేషంలో షాపులోకి ప్రవేశించి, తుపాకులతో సిబ్బందిని బెదిరించి కాల్పులు జరిపింది. ఈ కాల్పుల్లో సేల్స్ మేనేజర్, మరో ముగ్గురు ఉద్యోగులు గాయపడ్డారు. సుమారు కిలో బంగారాన్ని దోచుకున్న ఈ ముఠా, ముందస్తుగా ధర్మపురి, పెద్దపల్లి ప్రాంతాల్లోని లాడ్జీల్లో బస చేసి రెక్కీ నిర్వహించినట్టు పోలీసుల విచారణలో తేలింది. నిందితులు తాము భవన నిర్మాణ కార్మికులమని నమ్మించి ఐడెంటిటీ కార్డులు సమర్పించి లాడ్జీల్లో గదులు తీసుకున్నారు. వీరు ఎలాంటి మాస్కులు కూడా ధరించకుండా, ఎలాంటి భయం లేకుండా దర్జాగా కాల్పులు జరిపారంటే.. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ, పోలీసుశాఖ వైఫల్యమే. కాగా, నిందితులు గుజరాత్ నుంచి దేశాన్ని విడిచిపోయినట్టుగా పోలీసు వర్గాలు చెప్తున్నాయి. బీఆర్ఎస్ హయాంలో ఎంత పెద్ద నేరం జరిగినా పోలీసులు కేవలం గంటల వ్యవధిలోనే వారిని అరెస్టు చేసేవారు. ఇప్పుడు ఘటన జరిగి 5 రోజులు గడుస్తున్నా ఎలాంటి క్లూ దొరుకలేదు కదా.. సముద్ర మార్గం నుంచి దేశం దాటి వెళ్లారని సాక్షాత్తూ పోలీసు వర్గాలే లీకులిస్తున్నాయి. ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందిస్తూ రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, సీసీటీవీ నిఘా ఉన్నా నేరగాళ్లు భయపడటం లేదని విమర్శించారు.

సైబర్ నేరాల్లో దేశంలోనే నం.1

టెక్నాలజీ పరంగా ముందంజలో ఉన్న తెలంగాణ.. ఇప్పుడు సైబర్ నేరాలకు కూడా అడ్డాగా మారుతున్నది. 2024లో రాష్ట్రంలో సైబర్ నేరాలు 49% పెరిగాయి. మొత్తం 27,230 సైబర్ కేసులు నమోదు కాగా, అందులో అత్యధికంగా మోసం, చీటింగ్ కేసులు ఉన్నాయి. హైదరాబాద్ నగరంలో సైబర్ నేరాలు 17% తగ్గినట్టు గణాంకాలు చెప్తున్నా, రాష్ట్రవ్యాప్తంగా వీటి తీవ్రత పెరుగుతూనే ఉన్నది. పోలీసు విచారణలో 16,084 కేసులకు సంబంధించి నివేదికలు సమర్పించినా, కేవలం 3,177 కేసుల్లోనే చార్జిషీట్లు దాఖలు కావడం దర్యాప్తులోని జాప్యాన్ని సూచిస్తున్నది. 2025లో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ద్వారా 2,491 హానికరమైన యూఆర్ఎల్‌లను గుర్తించి, 1,311 లింకులను తొలగించారు. అలాగే 8,979 ఐఎంఈఐ నంబర్లను, 8,856 సిమ్ కార్డులను బ్లాక్ చేశారు. అయినా రోజుకో కొత్త పంథాలో సైబర్ నేరాలు జరుగుతూనే ఉన్నాయి. తెలంగాణ పౌరులు ప్రతియేటా కోట్లాది రూపాయలు నష్టపోతూనే ఉన్నారు.

డ్రగ్స్ మహమ్మారితో ఉడ్తా తెలంగాణగా

తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నా క్షేత్రస్థాయిలో డ్రగ్స్ వినియోగం అరికట్టలేకపోతున్నది. నగరంలో నడిరోడ్లపైనే యువత యథేచ్ఛగా గంజాయి సేవిస్తున్నది. ఇటీవలి కాలంలో పెద్ద ఎత్తున గంజాయి, సింథటిక్ డ్రగ్స్ పట్టుబడుతున్నాయి. మాదకద్రవ్యాల ముఠాలను అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'ఈగల్ ఫోర్స్' మామూళ్లకు అలవాటు పడిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2025 వార్షిక నివేదిక ప్రకారం, మాదకద్రవ్యాల కేసులు గణనీయంగా పెరిగాయి. 2023లో 1,464 కేసులు నమోదు కాగా.. 2025 నాటికి 2,734కి డ్రగ్స్ కేసులు చేరాయి. 2023లో 3,157 కాగా, 2025లో 5,703 మందిని అరెస్ట్ చేశారు. నైజీరియా, ఘనా, సూడాన్ దేశాలకు చెందిన 93 మంది విదేశీయులను డ్రగ్స్ సరఫరా, మనీ లాండరింగ్ ఆరోపణలపై బహిష్కరించారు. అయినా డ్రగ్స్ సరఫరా తగ్గలేదు.. వాటి వినియోగం ఏమాత్రం కట్టడి కాలేదు. సింథటిక్ డ్రగ్స్ తయారీలో వాడే ఎసిటిక్ అన్‌హైడ్రైడ్ వంటి రసాయనాలను పారిశ్రామిక ప్రాంతాలైన చర్లపల్లి, నాచారంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

మహిళలు, చిన్నారులపై నేరాలు

మహిళల భద్రత విషయంలో తెలంగాణ గణంకాలు ఆందోళన కలిగిస్తున్నాయి. 2024 ఎన్సీఆర్బీ నివేదిక ప్రకారం దక్షిణ భారతదేశంలో మహిళలపై అత్యధిక నేరాలు నమోదవుతున్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. 2024లో మహిళలపై 24,495 నేరాలు నమోదు కాగా, అందులో భర్త లేదా బంధువుల వేధింపులు 28.4% ఉన్నాయి. చిన్నారులపై లైంగిక దాడులు (పోక్సో కేసులు) కూడా ఆందోళనకర స్థాయిలో ఉన్నాయి. లైంగిదాడి కేసుల్లో 98.03% నిందితులు బాధితులకు తెలిసిన వారే ఉండటం సామాజిక విశ్లేషకులను కలవరపెడుతున్నది. వీటి పరిష్కారానికి రాష్ట్రంలో 400 ప్రత్యేక పోక్సో కోర్టులు పనిచేస్తున్నాయి. అయినా నేరస్తుల్లో ఎలాంటి భయం కనిపించడం లేదు.

సంచలనం సృష్టిస్తున్న హత్యలు

రాష్ట్రంలో హత్యలు, లైంగికదాడులు, దోపిడీల వంటి తీవ్రమైన నేరాల స్వభావం ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నది. 2025లో హత్యల సంఖ్య 781గా నమోదు కాగా, లైంగికదాడి కేసులు 2,549గా నమోదయ్యాయి. కొద్ది కాలంగా తెలంగాణలో, ముఖ్యంగా హైదరాబాద్, సెంట్రల్ రీజియన్లలో జరుగుతున్న హత్యలు నేరగాళ్ల తెగింపును బట్టబయలు చేస్తున్నాయి. రద్దీగా ఉండే రోడ్లపై పట్టపగలే హత్యలు జరుగడం శాంతిభద్రతల వైఫల్యానికి నిదర్శనమని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. పోలీసులంటే భయం లేదు.. ప్రభుత్వమంటే పట్టింపే లేదు. శుక్రవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లో ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు నివాసం ఉండే ప్రాంతంలో జరిగిన హత్య రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి, రిటైర్డ్ డైరెక్టర్ జనరల్ వినయ్ రంజన్ రాయ్ భార్య తనుజా రంజన్ (55) తన నివాసంలోనే హత్యకు గురయ్యారు. వినయ్ రంజన్ రాయ్ వ్యక్తిగత పని మీద బెంగళూరు వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగింది. దుండగులు ఆమెను నోటిలో గుడ్డలు కుక్కి ఊపిరాడకుండా చేసి చంపినట్టు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా 8 నెలలుగా ఆ ఇంట్లో పనిచేస్తున్న నేపాలీ డొమెస్టిక్ హెల్పర్ (పనిమనిషి)ను గుర్తించారు. నిందితురాలు తన ముఠాతో కలిసి పథకం ప్రకారం విలువైన వస్తువులు దోచుకెళ్లినట్టు గుర్తించారు.

రాష్ట్రంలో అశాంతి, అభద్రత

- శాంతిభద్రతల రక్షణలో రేవంత్ విఫలం
- నేషనల్ క్రైమ్ బ్యూరో నివేదికే సాక్ష్యం
- వరుస నేరాలు, ఘోరాలే నిదర్శనం
- పోలీసు యంత్రాంగం దుర్వినియోగం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విరుచుకుపడ్డారు. నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో తాజా నివేదికే ఇందుకు సాక్ష్యమని స్పష్టంచేశారు. లా అండ్ ఆర్డర్‌ను కాపాడేందుకు వినియోగించాల్సిన పోలీసు, ఇంటెలిజెన్స్ వ్యవస్థలను రాజకీయ కక్ష సాధింపునకు వాడుకోవడం, ప్రశ్నించిన వారిపై ప్రయోగించి దుర్వినియోగం చేసిన ఫలితంగానే రాష్ట్రంలో ఈ దుస్థితి నెలకొన్నదని పేర్కొన్నారు. రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న హింసాత్మక ఘటనలపై కేటీఆర్ శుక్రవారం ఎక్స్ వేదికగా స్పందించారు. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పాలనతో రాష్ట్రంలో శాంతిభద్రతలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయని ఆందోళన వ్యక్తంచేశారు. నిత్యకృత్యంగా మారిన హింసాత్మక ఘటనలతో తెలంగాణ ప్రజలు భయాందోళనలో బతుకుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. శాంతి భద్రతల పరిస్థితిపై బీఆర్ఎస్ బృందం డీజీపీని కలిసిన సమయంలోనే హైదరాబాద్‌లో రిటైర్డ్ డీజీ ర్యాంక్ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రాయ్ భార్య దారుణంగా హత్యకు గురైన వార్త రావడం.. మొన్న రాత్రి సికింద్రాబాద్‌లో ఓ యువకుడిని నడిరోడ్డుపై కిరాతకంగా కత్తులతో పొడిచి చంపిన ఘటనలతో నగర జనం కలవరపాటుకు గురైందని పేర్కొన్నారు. ఇలాంటి హింసాత్మక ఘటనలు సామాన్య పౌరుల్లో పెరుగుతున్న అభద్రతా భావానికి అద్దంపడుతున్నాయని తెలిపారు. నేరాల నియంత్రణకు వాడుకోవాల్సిన పోలీసులను రాజకీయ కక్ష సాధింపులు, ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నించిన సోషల్ మీడియా వారియర్స్ గొంతునొక్కేందుకు వినియోగించడంతోనే శాంతి భద్రతలు గాడితప్పుతున్నాయని పేర్కొన్నారు.

ప్రజలకు భరోసా కల్పించాలి..

దోపిడీలు, దొంగతనాలు, హత్యలు, మానభంగాలను నిలువరించాల్సిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చోద్యం చూస్తూ పబ్బంగడుపుతున్నారని కేటీఆర్ విమర్శించారు. ఇకనైనా కండ్లు తెరువాలని చురకలంటించారు. తక్షణమే రాజకీయ వేధింపులు బంద్‌పెట్టి పోలీసు వ్యవస్థను పటిష్టం చేసి ప్రజల భద్రతకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే నాలుగుకోట్ల తెలంగాణ ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

రాష్ట్రంలో క్రైమ్‌రేట్ పెరిగింది

- మత్తుకు బానిసవుతున్న యువత
- వరంగల్‌లో దారుణాలు.. తన్నుకోవడాలు, కొట్టుకోవడాలు
- హైదరాబాద్‌లో ఇష్టమొచ్చినట్టు బైక్ రేస్‌లు
- మంత్రి సురేఖ సంచలన వ్యాఖ్యలు

హనుమకొండ, మే 8: 'రాష్ట్రంలో క్రైమ్ రేట్ పెరిగింది. యువత మత్తుకు బానిసలుగా మారుతున్నారు. వరంగల్ నగరంలో దారుణం.. తన్నుకోవడాలు, కొట్టుకోవడాలు.. హైదరాబాద్‌లో అయితే చెప్పడానికే వీల్లేదు.. బైక్ రేసులంటూ ఇష్టమొచ్చినట్టు వెళ్తున్నారు..' అని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యానించారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో యూత్ అండ్ స్పోర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా జాబ్‌మేళాకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అతిథులుగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, వరంగల్ కలెక్టర్ సత్యశారద పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. మత్తుకు బానిసలైన యువత రోడ్ల మీద ఏమి చేస్తున్నారో తెలియని పరిస్థితి ఉన్నదని, ఇది చాలా బాధాకరమని పేర్కొన్నారు. వరంగల్‌లో కూడా ఎన్నడూ చూడనటువంటి దారుణాలు, తన్నుకోవడాలు, కొట్టుకోవడాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. నగరంలో క్రైమ్ రేట్ పెరిగిందని, యువత మత్తుకు బానిస కావడమే ఇందుకు కారణమని చెప్పారు. హైదరాబాద్‌లో చెప్పడానికి అవకాశమే లేదని, బైక్ రేస్‌లంటూ ఇష్టమొచ్చినట్టుగా వెళ్తున్నారని వివరించారు. వాళ్లు పడితే పర్వాలేదు.. కానీ, కిందపడి పక్కవాళ్లను చంపేస్తున్నారని, ప్రాణం అనేదానికి విలువ లేకుండా పోతున్నదని ఆందోళన వ్యక్తంచేశారు.

నేరాలకు కేరాఫ్ తెలంగాణ

- శాంతిభద్రతల కల్పనలో సర్కార్ ఫెయిల్
- చిన్నారులపై పెరిగిన లైంగికదాడులు
- ఆడబిడ్డలకు కరువవుతున్న రక్షణ
- 18.7 శాతం పెరిగిన క్రైమ్ రేట్
- రాష్ట్రంలో భయంకర పరిస్థితులను కండ్లకు కట్టిన ఎన్సీఆర్బీ నివేదిక

హైదరాబాద్ , మే 8 (నమస్తే తెలంగాణ) : హత్యలు, అత్యాచారాలు, కిడ్నాప్‌లు, సైబర్ నేరాలతో రాష్ట్రం ఉక్కిరిబిక్కిరి అవుతున్నది. ఆర్థిక, సైబర్ నేరాల్లో తెలంగాణ దేశంలోనే ప్రమాదకర స్థాయికి చేరుకోవడం ఆందోళన కలిగిస్తున్నది. గతంతో పోలిస్తే నేరాల తీవ్రత అమాంతం పెరిగింది. ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట దారుణమైన హత్యలు, అత్యాచారాలు, కిడ్నాప్ ఘటనలు చోటు చేసుకోవడం రాష్ట్రంలో నెలకొన్న భయానక పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. ఇదంతా ప్రతిపక్ష నేతల ఆరోపణలు కావు.. ఎన్సీఆర్బీ నివేదికలో వెల్లడైన నిప్పులాంటి నిజాలు. రాష్ట్రంలో నేరాల రేటు 18.7 శాతం పెరిగింది. ముఖ్యంగా మహిళలు, చిన్నారులపై నేరాలు పెరుగడం కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నది. మహిళా భద్రతకు పెద్దపీట వేస్తున్నామని పాలకులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉన్నది. లైంగిక దాడులు, వేధింపులు, చిన్నారులపై జరుగుతున్న అకృత్యాల సంఖ్య గత ఏడాదితో పోలిస్తే భారీగా పెరిగినట్టు ఎన్సీఆర్బీ తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. టెక్నాలజీలో దూసుకుపోతున్న తెలంగాణ, దురదృష్టవశాత్తు సైబర్ నేరాల్లోనూ అదే వేగాన్ని అందుకుంటున్నది. సైబర్ క్రైమ్స్ 2022లో 15,297 నమోదైతే.. 2023లో 18,236 కేసులు నమోదయ్యాయి. 2024లో అత్యధికంగా 27,230 వరకు నమోదయ్యాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. నివారణ చర్యలు పట్టుతప్పడంతో సైబర్ కేటుగాళ్లు రాష్ట్ర ప్రజల సొమ్మును యథేచ్ఛగా దోచుకుంటున్నారు. ఫోర్జరీ, మోసాలు, ఇతర ఆర్థిక నేరాల్లో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానానికి చేరుకుంటున్నది. దాదాపు అన్ని రకాల నేరాల్లో తెలంగాణలో పెరుగుదల కనిపిస్తున్నట్టు తాజా నివేదిక తేల్చిచెప్పింది. దోపిడీలు, దొంగతనాలు, హత్యలు, అత్యాచారాలు, దళితులు, గిరిజనులపై దాడులు, దారుణమైన అవినీతి పెచ్చుమీరుతున్నట్టుగా తాజాగా విడుదల చేసిన 2024 క్రైమ్ నివేదికలో తేటతెల్లం అయింది.

మహిళలపై పెరిగిన అఘాయిత్యాలు

రేవంత్‌రెడ్డి హయాంలో శాంతి భద్రతలు క్షీణించాయని చెప్పడానికి రాష్ట్రంలో దూసుకుపోతున్న క్రైమ్ రేటే నిదర్శనం. దేశంలో మహిళలపై నేరాలు స్వల్పంగా తగ్గగా.. తెలంగాణలో మాత్రం భారీగా పెరిగాయి. చిన్నారులు సైతం నేరాల కారణంగా ఉక్కిరిబిక్కిరి అవుతున్నరు. 2024లో 2,103 పోక్సో కేసులు నమోదవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. ఎన్సీఆర్బీ ప్రకారం దక్షిణాది రాష్ట్రాల్లో, మహిళలకు ప్రమాదకరమైన రాష్ట్రంగా తెలంగాణ మారింది. 2023లో మహిళలపై 23,678 నేరాలు జరుగగా.. 2024లో 24,495కు నేరాల సంఖ్య పెరిగింది. మహిళలు, చిన్నారుల నగ్న దృశ్యాలను చిత్రీకరించిన కేసుల్లో 2వ స్థానంలో తెలంగాణ నిలిచింది. ప్రతిరోజూ సగటున ఆరుగురు చిన్నారులు కామాంధుల వాంఛకు బలవుతున్నారు. చిన్నారులు, ఆడబిడ్డలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలం అవుతుందనడానికి ఈ లెక్కలే నిదర్శనం.

క్రైమ్ రివ్యూలు చేయట్లే..

తెలంగాణలో క్రైమ్ రేట్ దారుణంగా పెరిగిందని చెప్పడానికి లక్షల్లో నమోదవుతున్న ఎఫ్ఐఆర్‌లే నిదర్శనం. హోంమంత్రిగా రేవంత్‌రెడ్డి ఎలాంటి క్రైమ్ రివ్యూలు నిర్వహించకపోవడం, పోలీసులకు సరైన సూచనలు ఇవ్వకపోవడంతో, పోలీసులు కూడా మంత్లీ క్రైమ్ రివ్యూలకు స్వస్తి చెప్పారు. దీంతో 2024లో క్రైమ్ రేట్ దారుణంగా పెరిగింది. రాష్ట్రంలో 2023లో ఐపీసీ, బీఎన్ఎస్, ఎస్ఎల్ఎల్ కేసులు మొత్తం 1,83,644 నమోదు కాగా 2024లో 2,17,976 కేసులు నమోదయ్యాయి. దేశవ్యాప్తంగా క్రైమ్ రేట్‌లో 18.7 శాతం తగ్గుదల నమోదు కాగా.. తెలంగాణలో మాత్రం 18.7 శాతం పెరుగుదల కనిపించింది. అత్యధికంగా ప్రతి లక్ష మంది జనాభాకు 568.9 కేసులు నమోదయ్యాయి. జాతీయ సగటు 418.9గా ఉంది. సైబర్ క్రైమ్, ఆర్థిక నేరాలు.. మానవ అక్రమ రవాణా, బెట్టింగ్ నేరాల్లో కూడా తెలంగాణ రైజింగ్ ప్రదర్శించింది.

ఎన్సీఆర్బీ రిపోర్టు ప్రకారం 2022 నుంచి 2024 వరకూ నేరాల వివరాలు

నేరం / విభాగం	2022	2023	2024
ఐపీసీ/ బీఎన్ఎస్ నేరాలు	1,51,849	1,56,737	1,90,704
ఎస్ఎల్ఎల్ నేరాలు	13,981	26,907	27,272
వైలెంట్ క్రైమ్స్	9,673	10,069	27,447
మర్డర్/హత్యలు	937	954	1,040
కిడ్నాప్‌లు	2,981	3,174	3,372
మహిళలపై నేరాలు	22,066	23,678	24,495
పిల్లలపై నేరాలు	5,657	6,113	6,767
బాల నేరస్తులు	1,096	1,151	1,569
వృద్ధులపై నేరాలు	2,181	2,150	2,907
ఎస్సీలపై నేరాలు	1,787	1,709	2,059
ఎస్టీలపై నేరాలు	545	575	658
ఆర్థిక నేరాలు	26,321	26,837	39,127
అవినీతి	107	87	152
సైబర్ క్రైమ్స్	15,297	18,236	27,230
రైల్వేస్ (జీఆర్పీ)	922	1,048	1,206
రైల్వేస్ (ఆర్పీఎఫ్)	10,863	33,609	31,277
విదేశీయులపై నేరాలు	6	5	15
మానవ అక్రమ రవాణా	391	336	423

భయంకర నేరాల్లో 172 శాతం పెరుగుదల

తెలంగాణలో దారుణ, భయంకరమైన నేరాల్లో అత్యధికంగా పెరుగుదల కనిపించింది. నడిరోడ్లపై హత్యలు, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, దోపిడీలు, తీవ్రమైన దాడులు, కిడ్నాప్‌లు, గృహహింస, జీవిత భాగస్వాములపై భౌతికంగా దాడులు చేయడం, ఇండ్లు, ఆఫీసులు తగులపెట్టడం వంటి నేరాలు దారుణంగా పెరిగాయి. 2022లో 9,673 నేరాలు, 2023లో 10,069 నేరాలు చోటుచేసుకుంటే.. 2024లో ఆ సంఖ్య ఏకంగా 27,447కు పెరుగడం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది. 2023 కేసీఆర్ పాలనతో పోల్చితే.. 2024 నుంచి రేవంత్ పాలనలో వైలెంట్ క్రైమ్స్ 172 శాతం పెరిగాయి.

లోకం పోకడ



మనం ఇంకా కష్టపడాల్రోయ్!

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	40.8°c	23.0°c
నిజామాబాద్	39.4°c	25.4°c
నల్లగొండ	39.0°c	24.2°c
ఖమ్మం	39.0°c	25.0°c
రంగారెడ్డి	38.5°c	23.4°c
వరంగల్	38.0°c	25.0°c
మహబూబ్‌నగర్	38.0°c	27.0°c
హైదరాబాద్	36.0°c	24.0°c
కరీంనగర్	36.0°c	26.0°c
మెదక్	36.0°c	25.0°c



యువతి ఇంటి వద్ద ఆందోళనకు దిగిన మృతుడి బంధువులు

చిలకలగూడలో యువకుడి దారుణ హత్య

ప్రేమ వ్యవహారమే కారణమంటున్న పోలీసులు

యువతి ఇంటి ముందు మృతుడి కుటుంబసభ్యుల ఆందోళన

అదుపులోకి తీసుకున్న పోలీసులు



హత్యకు గురైన అఖిల్ (ఫైల్)

సికింద్రాబాద్, మే 8: చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి దారుణ హత్య జరిగింది. యవన్ అలియాస్ అఖిల్ (20) అనే యువకుడిని నలుగురు వ్యక్తులు కత్తులతో పొడిచి చంపారు. ప్రేమ వ్యవహారమే ఈ హత్యకు కారణమని పోలీసులు భావిస్తున్నారు. హత్య విషయం తెలుసుకున్న యువకుడి బంధువులు, మృతుడి తండ్రి శ్రీనివాస్, తల్లి అన్నపూర్ణ, ఇతర కుటుంబ సభ్యులు మేడిబావిలోని యువతి నివాసం వద్దకు వచ్చి ఆందోళనకు దిగారు. అల్వాల్‌కు చెందిన అఖిల్ బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. గతంలో సీతాఫల్‌మండిలోనే ఉన్న అతని కుటుంబసభ్యులు రెండేండ్ల క్రితం అల్వాల్‌కు మారారు. అఖిల్ మేడిబావికి చెందిన ఓ యువతిని ప్రేమించినట్టు తెలుస్తున్నది. తరచుగా అల్వాల్ నుంచి సీతాఫల్‌మండికి చెందిన స్నేహితుడి ఇంటికి వచ్చేవాడు. గురువారం రాత్రి అలాగే వచ్చి స్నేహితుడి నివాసం వద్ద ఉండగా నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి దారుణంగా కత్తులతో పొడిచి పారిపోయారు. వెంటనే గాంధీ దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. హంతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ యవన్ కుటుంబసభ్యులు రహదారిపై ఆందోళనకు దిగారు. రోడ్డుపై బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. వాతావరణం ఉద్రిక్తంగా మారడంతో రంగంలోకి దిగిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. యువతి ఇంటి ముందు కూడా మృతుడి కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు.

నిందితులను త్వరలోనే పట్టుకుంటాం: అడిషనల్ డీసీపీ నర్సయ్య

యవన్ అలియాస్ అఖిల్ ఓ యువతి ప్రేమించుకుంటున్నట్టు తెలిసిందని, దీనిపై ఇరు కుటుంబాల మధ్య గతంలో గొడవలు జరిగాయని సికింద్రాబాద్ జోన్ అడిషనల్ డీసీపీ నర్సయ్య చెప్పారు. పెద్ద మనుషుల వద్ద రాజీ కుదరడంతో అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేయలేదని పేర్కొన్నారు. హత్య వెనుక మరేదైనా కుట్ర ఉన్నదా? అనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నామని, హంతకులను త్వరలోనే పట్టుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అడిషనల్ డీసీపీ నర్సయ్య, చిలకలగూడ ఏసీపీ శశాంక్‌రెడ్డి, చిలకలగూడ సీఐ ఒలిశెట్టి రామకృష్ణ పేర్కొన్నారు.

అఖిల్, యువతి ఫోన్ ఆడియో కాల్ వైరల్

కొద్ది రోజుల క్రితం అఖిల్, యువతి మధ్య ఫోన్ కాల్‌లో జరిగిన సంభాషణల ఆడియో రికార్డు వెలుగులోకి వచ్చింది. చెప్పిన మాట వినకపోతే ఇద్దరినీ చంపేస్తామని, నీపై తప్పుడు కేసు పెట్టాలని ఒత్తిడి తెస్తున్నారని ఆ యువతి అఖిల్‌తో చెప్పున్నట్టుగా రికార్డయ్యింది. కేసు పెట్టకపోతే ఇద్దరినీ బతుకనివ్వబోమని బెదిరస్తున్నారని చెప్పింది. ఇందుకు అఖిల్ స్పందిస్తూ మొన్ననే కాంప్రమైజ్ అయ్యాము కదా.. మళ్లీ పోలీస్ కేసేమిటి? నాతో మాట్లాడొచ్చుకదా? అని జవాబిచ్చినట్టు ఆడియోలో వినిపిస్తున్నది. దీంతో పథకం ప్రకారమే అఖిల్‌ను హత్యచేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

దారుణాలకు అడ్డాగా తెలంగాణ

- శాంతి భద్రతలు కాపాడటంలో సర్కార్ విఫలం
- పోలీసుల చేతగానితనంతో బీఆర్ఎస్‌పై దాడులు
- ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని హతమార్చేందుకు కుట్ర
- డీజీపీకి వినతిపత్రం అందజేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ప్రతినిధి బృందం



కరీంనగర్, హుజూరాబాద్‌లో ఎమ్మెల్యేల క్యాంపు ఆఫీస్‌లపై జరిగిన దాడిపై హైదరాబాద్‌లో డీజీపీ సీవీ ఆనంద్‌కు ఫిర్యాదు చేస్తున్న దేశపతి శ్రీనివాస్, కేపీ వివేకానందగౌడ్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, బీఆర్ఎస్ నేతలు

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ పదేండ్ల పాలనలో శాంతి భద్రతలకు నిలయమైన తెలంగాణ రాష్ట్రం రెండున్నరేండ్ల కాంగ్రెస్ పాలనలో నేరాలు, ఘోరాలకు అడ్డాగా మారిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ప్రతినిధి బృందం ఆగ్రహం వ్యక్తంచేసింది. నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో నివేదిక ఇందుకు నిదర్శనమని పేర్కొన్నది. రాష్ట్రంలో పాలన గాడితప్పడంతో లా అండ్ ఆర్డర్ దారి తప్పిందని విమర్శించింది. శుక్రవారం శాసనమండలి, శాసనసభ బీఆర్ఎస్ఎల్పీ విప్‌లు దేశపతి శ్రీనివాస్, కేపీ వివేకానందగౌడ్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌తో కూడిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల ప్రతినిధి బృందం డీజీపీ సీవీ ఆనంద్‌ను హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కలిసింది. కరీంనగర్, హుజూరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు, కారుపై బీజేపీ గూండాల దాడి ఘటనను డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఘటనతో ప్రత్యక్ష సంబంధం ఉన్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను ఎఫ్ఐఆర్‌లో ఏ1 నిందితుడిగా చేర్చాలని, కౌశిక్‌రెడ్డికి భద్రత పెంచాలని, హింసకు పాల్పడిన వారిని గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలనే డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం అక్కడే మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారిపోయాయని, వెనుకబడ్డ రాష్ట్రాల్లోని పరిస్థితులు ఇక్కడ కనిపిస్తున్నాయని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. రేవంత్‌రెడ్డి పాలనలో నచ్చని రాజకీయ పార్టీ నేతల కార్యాలయాలపై దాడులు, మహిళలపై హత్యలు, లైంగికదాడులు, దోపిడీలు నిత్యకృత్యమయ్యాయని మండిపడ్డారు. వారం రోజులుగా కరీంనగర్‌లో బీఆర్ఎస్ నేతలపై జరుగుతున్న దాడులు, వాటిని నిలువరించలేని పోలీసుల చేతగానితనాన్ని డీజీపీకి వివరించామని చెప్పారు. ఆ నియోజకవర్గానికి చెందిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అనాగరికంగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ఒకవైపు అడ్డగోలుగా మాట్లాడుతూ మరోవైపు, బీజేపీ కార్యకర్తలను రెచ్చగొడుతూ బీఆర్ఎస్ నేతలపై దాడులకు ఉసిగొల్పుతున్నారని ఆరోపించారు. పాడి కౌశిక్‌రెడ్డిని హతమార్చేందుకు బండి సంజయ్ అనుచరులు పెట్రోల్ బాంబులతో దాడులకు తెగబడ్డారని ఆరోపించారు. ఇంత జరుగుతుంటే అడ్డుకోవాల్సిన పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడం శోచనీయమని పేర్కొన్నారు. సీపీ, సంజయ్ ఆఫీసుకు కూతవేటు దూరంలోనే జరిగిన జ్యువెల్లరీ దోపిడీని వారమైనా ఛేదించకపోవడం, అలుగునూర్‌లో న్యాయవాది మీద దాడి జరిగినా కేసు నమోదు చేయకపోవడం పోలీసుల నిర్లక్ష్యానికి అద్దంపడుతున్నదని విమర్శించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు సమాధానం చెప్పిన బీఆర్ఎస్ నేతలపై దౌర్జన్యానికి దిగడం దుర్మార్గమని ఖండించారు. ప్రాణాలకు ముప్పు ఉన్న కౌశిక్‌రెడ్డికి భద్రత పెంచాలని డిమాండ్ చేశారు.

బండి, రేవంత్ చీకటి ఒప్పందాలు: కేపీ వివేకానంద

అధికార మదంతో కేంద్ర మంత్రి బండి సంజయ్ రెచ్చిపోతున్నారని బీఆర్ఎస్ఎల్పీ విప్ కేపీ వివేకానంద మండిపడ్డారు. బండి సంజయ్, సీఎం రేవంత్‌రెడ్డి మధ్య ఉన్న రహస్య వ్యవహారాలను కేటీఆర్ బట్టబయలు చేయడంతో ఇష్టారీతిన అడ్డమైన భాషలో మాట్లాడుతున్నారని విమర్శించారు. 'బండి సంజయ్ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కాదు.. సీఎం రేవంత్‌రెడ్డికి సహాయ మంత్రి. ఆయనకు ఆపదకాలంలో అండగా ఉండే వ్యక్తి' అని ఎద్దేవా చేశారు. మరో రెండేండ్లలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, అప్పుడు బండి సంజయ్ గుజరాత్‌కు వెళ్లి తలదాచుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

రక్షకులే భక్షకులయ్యారు: దేశపతి శ్రీనివాస్

రాజ్యాంగాన్ని రక్షించాల్సిన రక్షకులే భక్షకులయ్యారని శాసనమండలిలో బీఆర్ఎస్ఎల్పీ విప్ దేశపతి శ్రీనివాస్ విమర్శించారు. 'శాంతిభద్రతలను కాపాడాల్సిన హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ గూండాలను పెట్టి కొట్టిస్తున్నారు. రాష్ట్ర హోం మంత్రిగా కూడా వ్యవహరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ కార్యాలయాలపై దాడులు చేయిస్తున్నరు. నేరస్తులు ప్రజాప్రతినిధులుగా మారి ప్రజాస్వామ్య విలువలను మంటగలుపుతున్నరు. వారంరోజులుగా జరుగుతున్న హింసాత్మక ఘటనలను చూస్తే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నాయా? లేవా? అనే అనుమానం కలుగుతున్నది' అని ఆగ్రహం వ్యక్తంచేశారు. హిందూ ధర్మం గురించి మాట్లాడే బండి నోటి నుంచి ఏనాడూ ఒక్క మంచి మాటరాలేదని దెప్పిపొడిచారు. అసలు ఆయన రామాయణ ఉపనిషత్తులు చదివారా? లేదంటే బూతులు మాట్లాడటంలో ఆరితేరారా? అని ప్రశ్నించారు. బీహార్ సంస్కృతిని తెలంగాణలోకి తీసుకొనిరావద్దని డీజీపీని కోరామని పేర్కొన్నారు. దాడులు ఆపకుంటే ఆత్మరక్షణ కోసం తాము కూడా ప్రతిదాడులు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

బజారు భాషతో బీజేపీని బొందపెడుతున్నరు: దాసోజు శ్రవణ్‌కుమార్

కేంద్ర మంత్రి హోదాలో ఉన్న బండి సంజయ్ బజారు భాషతో బీజేపీని బొందపెడుతున్నారని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్ విమర్శించారు. కౌశిక్‌రెడ్డి సంధించిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ఆయనపై అనుచరులతో దాడులు చేయించారని ఆరోపించారు. రాష్ట్రంలో అరాచకాలు, మారణహోమాలు జరుగుతుంటే పోలీస్ శాఖ ఎవరికోసం పనిచేస్తున్నదని నిలదీశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు గాడితప్పాయని విమర్శించారు. ఐపీఎస్ భార్యను గొంతుకోసి చంపినా పట్టించుకొనే నాథుడేలేడని మండిపడ్డారు. మహిళా కమిషనర్ సుమతి రోడ్డుపై నిలబడితే పోకిరీల చేష్టలను ప్రజలందరూ చూశారని గుర్తుచేశారు. సీఎం కంట్రోల్ కమాండ్ సెంటర్‌కు వెళ్లడం తప్ప ఆయనకు లా అండ్ ఆర్డర్‌పై కమాండ్‌లేదని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ కార్యాలయాలపై దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకొనేదాకా పోరాటం ఆపబోమని హెచ్చరించారు.



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బీజేపీ దాడిపై బీఆర్ఎస్ ఆగ్రహం

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు
- నేటి నగర బంద్‌కు సహకరించాలి : మాజీ మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్, మే 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కరీంనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ధ్వంసం చేయడంతోపాటు హుజూరాబాద్ ఎమ్మెల్యేపై పాడి కౌశిక్‌రెడ్డిపై దాడికి యత్నించిన ఘటనపై బీఆర్ఎస్ శ్రేణుల నుంచి ఆగ్రహం పెల్లుబికింది. శుక్రవారం కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆందోళనలతో హోరెత్తింది. బీజేపీ గుండాగిరీని నిరసిస్తూ అనేక ప్రాంతాల్లో ధర్నాలు, రాస్తారోకోలు చేశారు. బీజేపీ దాడిని నిరసిస్తూ శనివారం కరీంనగర్ బంద్‌ను విజయవంతం చేయాలని మాజీ మంత్రి గంగుల కమలాకర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ఆదేశాల మేరకు వేములవాడలో రహదారిపై రాస్తారోకో చేశారు. చందుర్తి, రుద్రంగి, కోనరావుపేట, మేడిపల్లి మండల కేంద్రంలో ధర్నాలు నిర్వహించారు. కథలాపూర్‌లో ధర్నాలు చేయడంతోపాటు పాటుగా దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలకేంద్రంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలు దహనం చేశారు. గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. బీజేపీ దాడికి నిరసనగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం తలపెట్టిన నగర బంద్‌కు ప్రజలందరూ సహకరించాలని కోరుతూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కరీంనగర్ చరిత్రలో మొదటిసారి తన క్యాంపు కార్యాలయంపై దాడి చేసి విష సంస్కృతికి బీజం వేశారని ఆగ్రహించారు. ప్రభుత్వ, ప్రజల ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని, దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. గురువారం తన క్యాంపు కార్యాలయంపై దాడి ఘటనను నిరసిస్తూ శనివారం కరీంనగర్ నగరబంద్‌కు పిలుపునిస్తున్నామని, దీనికి అన్ని వర్గాల ప్రజలతోపాటు వ్యాపార వాణిజ్య సంస్థలు మద్దతు ఇవ్వాలని కోరారు. బంద్‌లో బీఆర్ఎస్ శ్రేణులందరూ శాంతియుతంగా పాల్గొని సహకరించాలని సూచించారు.

బాలికపై ఆరు నెలలుగా లైంగిక దాడి

- గర్భం దాల్చడంతో విషయం వెలుగులోకి..

తిమ్మాజిపేట, మే 8: బాలికను బెదిరించి ఆరు నెలలుగా ఓ యువకుడు లైంగికదాడికి పాల్పడిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలంలో వెలుగుచూసింది. ఏఎస్సై ప్రిస్కిల్లా తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక తండ్రి చనిపోవడంతో తల్లి , తమ్ముడితో కలిసి ఉంటున్నది. ఆరు నెలల కిందట తల్లి సొంత పనులపై వేరే గ్రామానికి వెళ్లింది. అదే గ్రామానికి చెందిన యువకుడు ఈ విషయం గమనించి ఒంటరిగా ఉన్న బాలిక ఇంట్లోకి వెళ్లి బెదిరించి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికీ చెప్పవద్దని సూచించాడు. భయపడిన బాలిక ఈ విషయం తల్లికిగాని ఇతరులకు గాని చెప్పలేదు. ఇదే అదనుగా భావించిన సదరు యువకుడు బాలిక తల్లి పనుల కోసం బయటకు వెళ్లినప్పుడల్లా ఇంటికి వచ్చాడు. ఒంటరిగా ఉన్న బాలికపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఇటీవ బాలిక గర్భం దాల్చడంతో ఆగ్రహం చెందిన తల్లి ఆరా తీయడంతో విషయం బయటపడింది. శుక్రవారం బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో యువకుడిపై కేసు నమోదు చేశామని ఏఎస్సై వెల్లడించారు.

రేవంత్ అట్టర్ ఫ్లాప్ సీఎం

రాష్ట్రంలో శాంతిభద్రతలు తీవ్రంగా పతనం • నేరాల భయానక పరిస్థితిని బయటపెట్టిన నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాలు

- నగలషాపు దొంగలను పట్టుకోలేక సాకులు
- అందరూ చూస్తుండగానే బీఆర్ఎస్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలపై మూకల దాడులు
- ఇప్పుడు ఏకంగా ఐఏఎస్ క్వార్టర్స్‌లోనే ఐపీఎస్ అధికారి భార్య దారుణ హత్య
- బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ ధ్వజం

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా లోపించాయని, ముఖ్యమంత్రిగానే కాకుండా హోంమంత్రిగా కూడా రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. 2024 నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) గణాంకాలు కాంగ్రెస్ ప్రభుత్వంలో శాంతిభద్రతల పరిస్థితి పూర్తిగా క్షీణించిందన్న వాస్తవాన్ని బయటపెట్టాయని తెలిపారు. దేశంలోనే అత్యధిక సైబర్ నేరాలు నమోదవుతున్న రాష్ట్రంగా తెలంగాణ మారడం ఆందోళనకరమని పేర్కొన్నారు. 2024లో తెలంగాణలో 27,230 సైబర్ నేరాలు నమోదయ్యాయని, ప్రస్తుతం ఆ నేరాల సంఖ్య 49 శాతం పెరుగడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని వెల్లడించారు. దేశంలోనే అత్యధిక సైబర్ నేరాలు నమోదవుతున్న నగరాల్లో హైదరాబాద్ ఒకటిగా మారిందని పేర్కొన్నారు. 2024లో తెలంగాణలో 25,500 మిస్సింగ్ కేసులు నమోదవగా, వేలాదిమంది ఆచూకీ ఇప్పటికీ లభించలేదని పేర్కొన్నారు. రోజూ సగటున ఆరుగురు చిన్నారులు అదృశ్యమవుతున్న పరిస్థితి నెలకొనడం దారుణమని మండిపడ్డారు. చిన్నారులపై నేరాలు భారీగా పెరిగాయని వాపోయారు. 2024లో రాష్ట్రంలో చిన్నారులపై నేరాల కేసులు 6,767 నమోదయ్యాయని, కిడ్నాప్‌నకు గురైన చిన్నారుల్లో అధిక శాతం బాలికలేనని చెప్పారు. మహిళలపై నేరాలు పెరిగాయని, 2022లో 22,066 కేసులు ఉంటే 2024లో అవి 24,495కు పెరిగాయని శుక్రవారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తంచేశారు.

మానవ అక్రమ రవాణాలో టాప్

మానవ అక్రమ రవాణా కేసుల్లో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలవడం రాష్ట్ర పోలీస్ వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనమని హరీశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. 2024లో 423 మానవ అక్రమ రవాణా కేసులు నమోదయ్యాయని గుర్తుచేశారు. రాష్ట్రంలో కాగ్నిజబుల్ (తీవ్రమైన) నేరాలు భారీగా పెరిగాయని తెలిపారు. 2022లో 1,65,830 కేసులు ఉండగా, 2024 నాటికి అవి 2,17,976కు చేరుకున్నాయని పేర్కొన్నారు. ప్రతి లక్ష జనాభాకు తెలంగాణలో నేరాల రేటు 568.9గా ఉండగా, దేశ సగటు 418.9 మాత్రమే ఉండటం రాష్ట్రంలో శాంతిభద్రతల లోపాన్ని వెల్లడిస్తున్నదని తెలిపారు. కరీంనగర్ నగల దుకాణం దోపిడీ ఘటనలో నిందితులను పట్టుకోలేకపోవడం కాంగ్రెస్ వైఫల్యానికి నిదర్శమని తెలిపారు. పట్టపగలు, ప్రజల ముందే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలపై దాడులు జరుగుతున్నాయని, ఐఏఎస్ క్వార్టర్స్‌లో ఐపీఎస్ అధికారి భార్య హత్య ఘటన రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రలకు నిదర్శనమని హరీశ్ ఆందోళన వ్యక్తంచేశారు. సీపీ సుమతి నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌తో హైదరాబాద్‌లో మహిళల భద్రత ఎంత డొల్లగా మారిందో బయటపడిందని తెలిపారు.



> **2024లో తెలంగాణలో 27,230 సైబర్ నేరాలు నమోదైనయ్. ఇది దేశవ్యాప్తంగా నమోదైన కేసుల్లో గణనీయమైన శాతం. 2023తో పోలిస్తే సైబర్ నేరాలు దాదాపు 49 శాతం పెరుగడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. దేశంలోనే అత్యధిక సైబర్ నేరాలు నమోదవుతున్న నగరాల్లో హైదరాబాద్ ఒకటిగా మారింది.**
> -హరీశ్‌రావు

రైతుల కన్నీటి శాపం పాలకులను వదలదు

రాష్ట్రంలో అన్నదాతలను కాంగ్రెస్ ప్రభుత్వం అష్టకష్టాల పాలుచేస్తున్నదని హరీశ్ ఆవేదన వ్యక్తంచేశారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న పంట కొనుగోలు చేయాలని అధికారుల కాళ్లు మొక్కే పరిస్థితిని ఈ ప్రభుత్వం తెచ్చిందని ధ్వజమెత్తారు. ధాన్యం కొనుగోలులో జాప్యం, కల్లాల వద్ద రైతుల ఇబ్బందులపై ఎక్స్ వేదికగా స్పందించారు. 'ఆరుగాలం చెమటోడ్చి పండించిన పంటను ప్రభుత్వమే కొనకపోతే ఆ రైతన్నకు దిక్కెవరు?' అని ప్రశ్నించారు. కల్లాల్లో రోజుల తరబడి పంటకు కాపలా కాస్తూ, అన్నదాతలు పిట్టల్లా రాలిపోతుంటే ప్రభుత్వం కండ్లప్పగించి చూడటం తప్ప ఏమీ చేయడంలేదని విమర్శించారు. రైతులను ఆదుకోవాల్సిన పాలకులే వారికి మరణశాసనం రాస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇటీవల మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలో ఓ రైతు ధాన్యం కొనాలని తహసీల్దార్ కాళ్లపై పడిన ఘటనను ఉద్దేశించి తీవ్రంగా స్పందించారు. 'నీ బాంచెన్ పంట కొనండి.. అని కాళ్లపై పడటం తప్ప రైతు ఇంకేం చేయగలడు?' అని వాపోయారు. అన్నదాత చేతులతో అధికారుల కాళ్లు మొక్కిస్తున్న ఘనత రేవంత్ సర్కార్‌దేనని విమర్శించారు. రైతన్న కన్నీటి శాపం పాలకులను నీడలా వెంటాడుతూనే ఉంటుందని హెచ్చరించారు. ఇప్పటికైనా స్పందించి, కొర్రీలు పెట్టకుండా తక్షణమే ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

రెచ్చగొట్టేలా మాట్లాడటం బండి నైజం

- కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌పై దాడి పాశవిక చర్య
- రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



ధర్మారం, మే 8 : రాజకీయాల్లో రెచ్చగొట్టేలా మాట్లాడడం కేంద్ర మంత్రి బండి సంజయ్ నైజమని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో పర్యటించిన ఆయనమీడియాతో మాట్లాడారు. గురువారం కరీంనగర్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ ఆఫీస్‌పై బీజేపీ నాయకులు దాడి పాశవిక, ఆటవిక చర్యగా అభివర్ణించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై పనికి రాని విమర్శలు చేయడమేంటని ప్రశ్నించారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై బీజేపీ గుండాలు హత్యాయత్నం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్, బీజేపీ దేశస్థాయిలో విభేదాలు ఉన్నట్టు నటిస్తున్నాయని, రాష్ట్రంలో మాత్రం ఒక్కటేనని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం వడ్లు, మక్కలు కొనుగోలు చేయకపోయినా బండి సంజయ్ మాట్లాడకపోవడం దేనికి నిదర్శమని ప్రశ్నించారు.

క్యాంపు కార్యాలయ విధ్వంసంపై.. తూతూ మంత్రంగా చర్యలు..?

- బెయిలబుల్ కేసులు పెట్టిన పోలీసులు

కరీంనగర్, మే 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): పోలీసుల కండ్ల ముందే బీజేపీ శ్రేణులు గూండాగిరీ చేసి, ఏకంగా కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విధ్వంసం సృష్టించిన ఘటనను పోలీసుల సాదాసీదాగా తీసుకున్నట్టు కనిపిస్తున్నది. నిందితులపై తూతూ మంత్రంగా కేసులు నమోదు చేశారన్న విమర్శలు వస్తున్నాయి. ఈ దాడిలో చాలా మందికి బెయిల్ దొరకడమే కష్టమవుతుందంటూ న్యాయ నిపుణులు అభిప్రాయాలు వ్యక్తం చేయగా.. వీటికి అతీతంగా కేసులు నమోదయిన అందరికీ రాత్రికి రాత్రే నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకొన్నారు. ఈ వ్యవహారంలో కాంగ్రెస్–బీజేపీ ముందు నుంచీ చెట్టాపట్టాల్ వేసుకున్నట్టు కనిపించగా.. స్టేషన్ బెయిల్‌తో వీరి బంధం మరోసారి బయటపడిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించిన అరగంటలోనే దాడికి తెగబడ్డారు. తనపై హత్యా ప్రయత్నం చేశారని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చెబుతున్నా పోలీసులు మాటలను పరిగణనలోకి తీసుకోలేదని తాజా కేసులను చూస్తే అర్థమవుతోంది. దాడిని ఖండిస్తూ బీఆర్ఎస్ నాయకులు కరీంనగర్‌లోని వివిధ టౌన్లలో కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదు చేశారు.

జూబ్లీహిల్స్‌లో రిటైర్డ్ ఐపీఎస్ సతీమణి హత్య

- చోరీ కోసం నేపాలీ గ్యాంగ్ ఘాతుకం
- భారీగా నగదు, ఆభరణాలు చోరీ
- పనిమనిషితో కలిసి నేపాలీ గ్యాంగ్ దురాగతం
- రెండ్రోజులుగా రెక్కీ నిర్వహించిన నిందితులు
- ప్రత్యేక బృందాలతో గాలింపు



విశ్రాంత ఐపీఎస్ సతీమణి తనూజ (ఫైల్)



ప్రధాన నిందితురాలు కల్పన (ఫైల్)



హత్యకు ముందు రోజున రెక్కీ నిర్వహిస్తున్న నిందితుల సీసీ పుటేజీ

బంజారాహిల్స్, మే 8: సంపన్నులు, ఐఏఎస్, ఐపీఎస్‌లు నివాసం ఉంటున్న జూబ్లీహిల్స్‌లో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి సతీమణి దారుణ హత్యకు గురయ్యారు. ఏడాది కాలంగా ఇంట్లో పనిచేస్తున్న నేపాలీ యువతి సహకారంతో ముగ్గురు నేపాలీ గ్యాంగ్ సభ్యులు గురువారం అర్ధరాత్రి రిటైర్డ్ ఐపీఎస్ ఇంట్లో ప్రవేశించి ఆయన భార్య తనూజ (60)ను హత్యచేసి, నగదు, ఆభరణాలు ఎత్తుకెళ్లారు. జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లోని ప్లాట్ నంబర్ 46లో నివాసం ఉంటు న్న రిటైర్డ్ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే గతంలో జైళ్ల శాఖ డీజీగా ఉద్యోగ విరమణ చేశారు. భార్య తనూజ, ఇద్దరు కుమార్తెలతో కలిసి మూడంతస్తుల ఇంట్లో ఉంటున్నారు. ఈ నెల 1న వైద్యం కోసం వినయ్‌రంజన్ రే బెంగళూరు వెళ్లారు. వీరి ఇంట్లో ఏడాది నుంచి కల్పన (30) అనే యువతి పనిమనిషిగా ఉంటున్నది. గతంలో పనిచేసిన కల్పన తల్లి అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె స్థానంలో పనికి కుదిరి అదే ఇంట్లోని సర్వెంట్ రూమ్‌లో ఉంటున్నది. వినయ్‌రంజన్ రే బెంగళూరుకు వెళ్లడంతో పనిమనిషి కల్పనను తన గదిలో పడుకోవాలని తనూజ సూచించారు. పెద్ద కుమార్తె సునందతోపాటు మరో కుమార్తె మూడో అంతస్తులోని బెడ్‌రూమ్‌లో నిద్రిస్తుంటారు. శుక్రవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో ఇంట్లో మరమ్మతుల కోసం కార్పెంటర్ వచ్చి కుమార్తె సునందకు ఫోన్ చేశాడు. కింది అంతస్తుకు వచ్చిన సునంద.. తల్లి గదిలోకి వెళ్లి చూడగా ఆమె నోట్లో గుడ్డలు కుక్కి, చేతులు, కాళ్లను తాళ్లతో కట్టేసి ఉన్నాయి. సెక్యూరిటీ గార్డు, స్థానికుల సహాయంతో జూబ్లీహిల్స్ అపోలో హాస్పిటల్‌కు తీసుకువెళ్లగా అప్పటికే తనూజ మృతి చెందినట్టు వైద్యులు ప్రకటించారు.

రెండ్రోజులుగా రెక్కీ !

తనూజ హత్య విషయంపై సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ బృందాలతోపాటు ఫోరెన్సిక్ విభాగం సిబ్బంది వచ్చి ఆధారాలు సేకరించారు. నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్‌తోపాటు పోలీసు ఉన్నతాధికారులు మృతురాలి కుటుంబసభ్యులతో మాట్లాడారు. సీసీ పుటేజీలను పరిశీలించగా అర్ధరాత్రి 1.40 గంటల ప్రాంతంలో కల్పన బయటకు వచ్చి ఇంటికి ఎదురుగా ఉన్న పార్కు వైపు సైగలు చేయడం.. క్షణాల్లోనే ముగ్గురు ఆగంతకులు ఇంట్లోకి ప్రవేశించిన దృశ్యాలు కనిపించాయి. గంటన్నర తర్వాత రెండు భారీ బ్యాగులతో కల్పనతోపాటు ముగ్గురు ఆగంతకులు వచ్చిన దారిలోనే పారిపోయినట్టు పోలీసులు గుర్తించారు. రెండ్రోజులుగా ఆగంతకులు వినయ్‌రంజన్ ఇంటివద్దకు వచ్చి రెక్కీ నిర్వహించినట్టు, కల్పనతో మాట్లాడి వెళ్లినట్టు తేలింది. అర్ధరాత్రి దాటిన తర్వాత కల్పనతోపాటు ఇంట్లోకి వెళ్లిన ఆగంతకులు నేరుగా తనూజ బెడ్‌రూమ్‌లోకి వెళ్లి ఆమె నోట్లో గుడ్డలు కుక్కి, కాళ్లు చేతులను బంధించి ఆమె ఒంటిమీద ఆభరణాలతోపాటు అల్మారాలో ఉన్న ఆభరణాలతోపాటు నగదును సూట్‌కేసుల్లో సర్దుకొని తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఇంట్లోంచి బయటకు వచ్చి పార్కు గుండా పారిపోయినట్టు తేలింది. నోట్లో గుడ్డలు కుక్కడంతో ఊపిరి ఆడకపోవడంతో తనూజ మృతి చెందినట్టు పోలీసులు భావిస్తున్నారు.

రంగంలోకి దిగిన పోలీస్ యంత్రాంగం

రెండు తెలుగు రాష్ట్రాల్లోనే అత్యంత భద్రత కలిగిన ప్రాంతమైన ప్రశాసన్‌నగర్‌లో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి సతీమణిని దారుణంగా హత్య చేయడంతోపాటు భారీగా సొత్తును దోచుకువెళ్లిన వార్త క్షణాల్లోనే వ్యాపించడంతో డీజీపీ సీవీ ఆనంద్, నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్‌సహా పోలీసు యంత్రాంగం మొత్తం అక్కడికి చేరుకున్నది. నిందితులను పట్టుకొనేందుకు సుమారు 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసులతోపాటు టాస్క్‌ఫోర్స్ బృందాలు సమీప ప్రాంతాలను తనిఖీ చేయగా నిందితులు పారిపోయిన దారిలో కొన్ని ఆధారాలు లభ్యమయ్యాయి. హత్యలో పాల్గొన్న ఓ నిందితుడు వాడిన క్యాప్, మాస్క్ సమీపంలోని పార్క్‌లో పారవేయగా వాటిని క్లూస్ టీమ్ సేకరించింది. నేపాలీ గ్యాంగ్ సభ్యులు పారిపోయిన దారిలో సీసీ పుటేజీని సేకరిస్తున్నారు. నిందితులకు సంబంధించిన కీలక ఆధారాలు లభ్యమయ్యాయని, త్వరలోనే వారిని పట్టుకుంటామని నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ ప్రకటించారు. నాలుగు ప్రత్యేక బృందాలు నిందితుల కోసం నేపాల్ సరిహద్దులకు వెళ్లినట్టు తెలుస్తున్నది.

మూడు నెలల్లో మూడో ఘటన

జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు నెలల వ్యవధిలో నేపాలీ గ్యాంగ్‌లు మూడు దోపిడీలకు పాల్పడటం సంచలనంగా మారింది. ఫిబ్రవరి 5న రాత్రి జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 69లోని నందగిరిహిల్స్‌లో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్న రవీంద్రకుమార్‌శర్మ అనే వ్యాపారి ఇంట్లో పనిచేస్తున్న భూపేందర్ షాహీ అనే వ్యక్తి నలుగురు నేపాలీ గ్యాంగ్ సభ్యులతో కలిసి సుమారు రూ1.3 కోట్ల విలువైన సొత్తును చోరీచేశాడు. ఆ ఘటనను మరువకముందే జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 25లో నివాసం ఉంటున్న రియల్‌ఎస్టేట్ వ్యాపారి పింగళి అనిరుధ్‌రెడ్డి నివాసంలో పనిమనుషులా చేరిన నేపాలీ గ్యాంగ్‌కు చెందిన మహేశ్‌షాహీ, అప్సర ఏప్రిల్ 13న అర్ధరాత్రి దాటిన తర్వాత మరో ముగ్గురి సహకారంతో ఇంట్లోకి ప్రవేశించి సుమారు రూ.2 కోట్ల విలువైన వజ్రాభరణాలు, ఖరీదైన వాచీలు ఎత్తుకెళ్లారు. ఈ రెండు ఘటనల తరువాత సంపన్నుల ఇండ్లలో నేపాలీ పనిమనుషుల వివరాలు సేకరించేందుకు జూబ్లీహిల్స్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.

నేపాలీ పనిమనుషులతో జాగ్రత్త



తనూజ హత్య నేపాలీ గ్యాంగ్ పనిగా ప్రాథమికంగా ఆధారాలు లభ్యమయ్యాయి. కొంతకాలంగా దేశవ్యాప్తంగా నేపాలీ గ్యాంగ్‌లు పలు నేరాలకు పాల్పడుతున్నాయి. జూబ్లీహిల్స్‌లో రెండునెలల క్రితం నేపాలీ గ్యాంగ్‌లు చోరీ చేయడంతో నిందితులను పట్టుకున్నాం. నేపాలీలను పనిమనుషులుగా పెట్టుకుంటే వారి బ్యాక్‌గ్రౌండ్ వెరిఫికేషన్ చేసుకోవాలని గతంలో సైతం చెప్పాం. ప్రజలు భయభ్రాంతులకు గురికావొద్దు. అతి త్వరలోనే నిందితులను పట్టుకుంటాం. -సీపీ సజ్జనార్

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

కేసీఆర్ ఎప్పుడో చెప్పారు!



కోవెల సంతోష్ కుమార్

ప్రాంతీయ ఆకాంక్షల మీద ఏమాత్రం గౌరవం లేని జాతీయ పార్టీలను రాష్ట్రాల నుంచి తరిమికొట్టాలని, ఇందుకోసం ప్రాంతీయ పార్టీలు ఏకమై కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా ఎదగాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎప్పుడో ప్రతిపాదించారు. ఒక్కో ప్రాంతీయ పార్టీ అధినేత దగ్గరకు వెళ్లి కలిసి మరీ జాతీయ పార్టీల దుర్నీతిని వివరించారు. బీజేపీ, కాంగ్రెసేతర ప్రత్యామ్నాయం కోసం పనిచేయాలని సహేతుకంగా నొక్కిచెప్పారు. జాతీయ పార్టీలతో పొత్తుల ప్రసక్తి లేకుండా ప్రాంతీయ అస్తిత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని గట్టిగా చెప్పారు. ప్రాంతీయ అస్తిత్వంతోనే జాతీయ రాజకీయాలు చేయాలని సూచించారు. జాతీయ పార్టీల పంచన చేరకుండా ప్రత్యామ్నాయం ఏర్పాటు చేద్దామని సూచించారు.


మమత, కేజ్రీవాల్, అఖిలేశ్, నితీశ్, స్టాలిన్, ఉద్ధవ్, పవార్ అందరి దగ్గరకూ వెళ్లి నచ్చచెప్పటానికి కేసీఆర్ ప్రయత్నించారు. అయితే, ఉత్తరాది ప్రాంతీయ పార్టీల నాయకులు కేసీఆర్ మాటలను పెడచెవిన పెట్టారు. ఏదైనా జాతీయ పార్టీ పంచన వెళ్తేనే తమకు ఉనికి ఉంటుందని, నాలుగు సీట్లు గెలుస్తామని కక్కుర్తి పడ్డారు. ఇవాళ ఫలితాన్ని అనుభవిస్తున్నారు. తమిళనాడులో స్టాలిన్ తాను కాంగ్రెస్‌ను వదిలేది లేదన్నారు. దక్షిణాది ప్రాంతీయ పార్టీలు కూడా కేసీఆర్ ఆలోచనను తక్కువ అంచనా వేశాయి. తెలుగుదేశం పార్టీ ఎప్పుడైనా, ఏదో ఒక జాతీయ పార్టీతో పొత్తులు పెట్టుకోకుండా ముందుకు వెళ్లలేదు కాబట్టి..ఆ పార్టీకి సొంత క్రెడిబిలిటీ అంటూ ఉన్నదని చెప్పలేం. ఇతర పార్టీలు కూడా ఏదో ఒక జాతీయ పార్టీతో అంటకాగకపోతే వెళ్లలేమన్న ఆలోచనతో ఉండటం వల్లనే ఒక్కొక్కటిగా కనుమరుగవుతున్నాయా? అనే అనుమానం కలుగుతున్నది. తాజాగా, బెంగాల్, తమిళనాడు, కేరళం ఎన్నికల ఫలితాలు ఈ విషయాన్ని మరోసారి నిరూపించాయి.

కాంగ్రెస్ ధృతరాష్ట్ర కౌగిలిలో కేజ్రీవాల్, మమత, స్టాలిన్ పార్టీలు నలిగి ముక్కలు ముక్కలయ్యాయి. పార్లమెంట్ ఎన్నికల సందర్భంలో ఇండి కూటమి పేరుతో అన్ని పార్టీల మద్దతును కాంగ్రెస్ తీసుకున్నది. కూటమి పేరుతోనే ఎన్నికల్లో ఆయా రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలతో పొత్తులు పెట్టుకొని స్నేహం నటించి సీట్లు పెంచుకున్నది. కానీ, రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముంచుకొచ్చినప్పుడు ఇండి కూటమితో పార్లమెంట్‌లో తనకు మద్దతుగా నిలిచిన అన్ని పార్టీలకు కాంగ్రెస్ పూర్తిగా చెయ్యిచ్చింది. ఢిల్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్‌పై బీజేపీ కంటే ఎక్కువగా విమర్శలు గుప్పించింది రాహుల్ గాంధీయే. ఢిల్లీ లిక్కర్ స్కాంలో అరెస్టయినప్పుడు కేజ్రీవాల్ వెన్నంటి నిలిచిన రాహుల్, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల దగ్గరకు వచ్చేసరికి కేజ్రీవాల్‌ను అదే లిక్కర్ స్కాంలో దోషిని చేసి దుమ్మెత్తిపోసి బీజేపీ గెలుపునకు రాచబాట వేశారు.

> పార్లమెంట్ ఎన్నికల్లో తనకు అండగా నిలిచిన మమతను తాజాగా జరిగిన బెంగాల్ ఎన్నికల్లోనూ రాహుల్ గాంధీ బోనులో నిలబెట్టి.. మొట్టమొదటిసారి బెంగాల్‌లో బీజేపీ అధికారపీఠం ఎక్కటానికి చక్కగా దోహదపడ్డారు. తమిళనాడులో డీఎంకే సైతం కాంగ్రెస్ బంధనాలను ఎందుకు వదిలించుకోవటం లేదో అర్థం కాదు. వాస్తవానికి అక్కడ కాంగ్రెస్ 1961లోనే తన ఉనికిని కోల్పోయింది. అస్సాంలో బీజేపీతో డైరెక్టుగా తలపడి సోదిలోకి లేకుండా ఓడిపోయింది.

పార్లమెంట్ ఎన్నికలు దగ్గరకు వచ్చేసరికి కాళ్లా వేళ్లాపడి మద్దతు పొందిన ప్రాంతీయ పార్టీలకు అసెంబ్లీ ఎన్నికల సమయంలో పక్కలో బల్లెంలాగా మారిపోయి..బీజేపీకి లైన్‌క్లియర్ చేస్తూ వచ్చింది. 'కొట్లాడటానికి చేతకానివాడు.. పక్కకు పోడంట.. కొట్లాడే వాళ్ల కాళ్లల్ల కట్టెలు పెడతాడంట'..ఇందుకు ఉదాహరణ కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ.

బీజేపీ నాయకత్వం కూడా ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా వ్యవహరిస్తూ వస్తున్నది. వారి వ్యూహాలను కాంగ్రెస్ అర్థం చేసుకోవటం లేదు. 2023లో తెలంగాణలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటిదాకా దూకుడుగా వ్యవహరించిన బీజేపీ.. ఒక్కసారిగా తనకు తానుగా వెనక్కిపోయింది. తన మిత్రపక్షంలో ఉన్న నాయకుడిని అర్జెంటుగా కాంగ్రెస్‌లోకి జంప్ చేయించి.. తన కున్న ఓటు షేర్‌ను పూర్తిగా వదులుకొని కాంగ్రెస్‌ను తెలంగాణలో గెలిపించింది. అస్సాంలో బీజేపీ సొంతంగా గెలువలేదు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లో సైతం సొంతంగా తలబడి గెలువలేదు. తెలంగాణలో బీజేపీ వెనక్కిపోవటం వల్ల గెలిచిన కాంగ్రెస్ పార్టీ..కేరళంలో గెలవటానికి సీపీఐని, ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను బీజేపీ కోవర్ట్ అని ప్రచారం చేయటం దుర్మార్గమైన వ్యవహారం. అంతేకాదు..తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌ను అక్కడికి పంపించి మరీ ఈ రకమైన ఆరోపణలు చేయించింది. ఇండి కూటమిలో కలిసి పనిచేసిన మిత్రులకు కాంగ్రెస్ చేసిన తీరని ద్రోహం ఇది. ఇదే సీపీఐ తెలంగాణలో ఒక్క ఎమ్మెల్యే సీటుకు, ఒక నామినేషన్ పోస్టుకు కక్కుర్తిపడి ఏమీ మాట్లాడలేని స్థితిలో ఉండటం దేశంలో కమ్యూనిస్టుల పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. దశాబ్దాల తరబడి ఏలిన కమ్యూనిస్టులు మూడు రాష్ట్రాల్లో డిపాజిట్లు కూడా దక్కించుకోలేని స్థితిలో ఉన్నారు. వేర్వేరు రాష్ట్రాల్లో ఆయా ప్రాంతీయ పార్టీల పంచన చేరి, లేదా కాంగ్రెస్‌ను బతిమిలాడుకొని..ఒకటో అరో సీటుతో సంతృప్తి పడే పరిస్థితి నెలకొన్నది.



ముందే గమనించిన కేసీఆర్: దేశంలో మారుతున్న ఈ రాజకీయ పరిణామాలను కేసీఆర్ 2022 లోనే అంచనా వేశారు. బీజేపీ, కాంగ్రెసేతర పక్షాలు దేశమంతా ఏకం కావాలని ఆకాంక్షించారు. దానికి తెలుగు రాష్ట్రాల్లోని ఒక సెక్షన్ మీడియా పెడర్థాలు తీసింది. ఎద్దేవా చేసింది.

> తనను కాదని దూరం వెళ్తే..పార్టీ పరిస్థితి ఏమవుతుందో, 2019 ఎన్నికల్లోనే బీజేపీ.. తెలుగుదేశం పార్టీకి రుచి చూపించింది. ఎన్నికలైన మరుక్షణమే.. నలుగురు రాజ్యసభ సభ్యులను బీజేపీలో చేర్పించి మోదీ పంచన చేరిపోయారు చంద్రబాబు. ఏమాత్రం తేడా వచ్చినా బీజేపీ ఆ పార్టీని మింగేస్తుందని ఆయనకూ తెలుసు. బీహార్‌లో నితీష్ కుమార్ శకానికి ఈమధ్యనే ముగింపు పలికారు. ఆయన కుమారుడు నిషాంత్, తండ్రి పార్టీ జేడీయూను ఎంతవరకు ముందుకు తీసుకుపోగలరో ఇప్పుడిప్పుడే అంచనా వేయలేం.

మహారాష్ట్రలో శివసేన, నేషనలిస్ట్ కాంగ్రెస్ పని అయిపోయింది. హర్యానా, జార్ఖండ్‌లో ప్రాంతీయ పార్టీలు కనపడకుండా పోయాయి. ఇక ఉత్తరాదిన మిగిలింది, ఉత్తరప్రదేశ్‌లో అఖిలేశ్ యాదవ్‌కు చెందిన సమాజ్‌వాదీ పార్టీయే. మాయావతి పార్టీ బహుజన్ సమాజ్ పార్టీ.. ఆయా రాష్ట్రాల్లో సీట్లు అమ్ముకుంటూ..ఇంకా ఉనికిలో ఉంటున్నది తప్ప యూపీలో అధికారంలోకి వచ్చే స్థాయిలో లేదు. సమాజ్‌వాదీ పార్టీ మాత్రమే ఉత్తరాదిన బీజేపీకి గట్టి పోటీ ఇస్తున్నదిగా చెప్పుకోవచ్చు.

తమిళనాడులో విజయ్ పార్టీ (టీవీకే) అధికారంలోకి రావటం ప్రాంతీయ పార్టీల ప్రస్థానంలో ఆహ్వానించదగ్గ పరిణామం. తమిళనాడులో ప్రాంతీయ అస్తిత్వానికే ఓటర్లు పెద్దపీట వేస్తారని మళ్లీ రుజువైంది. జయలలిత లేకపోయినా అన్నాడీఎంకే మంచి ఫలితాలను సాధించింది కానీ, ఇండిపెండెంట్‌గా పోటీ చేయకుండా, బీజేపీ మద్దతు తీసుకోవడం ఆ పార్టీకి ప్రమాదఘంటిక అని చెప్పవచ్చు. తాజా ఫలితాల్లో అన్నాడీఎంకే కారణంగా 3.66 శాతం ఉన్న బీజేపీ ఓటు..11.24 శాతానికి పెరిగింది అంటేనే బీజేపీ అడుగేమిటో అర్థం చేసుకోవచ్చు. తెలంగాణలో కాంగ్రెస్ కోసం చేసిన మాదిరిగానే, తమిళనాడులో అన్నాడీఎంకే కోసం..పార్టీ కోసం పనిచేస్తున్న అన్నామలైని బీజేపీ పక్కకు తప్పించింది.

ఇప్పుడు ప్రాంతీయ పార్టీల అస్తిత్వం కొద్దో గొప్పో మిగిలింది తెలుగు, తమిళ రాష్ట్రాల్లోనే. ఈ రెండు రాష్ట్రాల్లో ప్రాంతీయ చైతన్యం గొప్పది. కనీసం ఇక్కడైనా ఆ అస్తిత్వ చైతన్యాన్ని కాపాడుకుంటారా? లేదా, జాతీయ పార్టీల మాయలో పడి..మాయమైపోతాయా? బీజేపీ ఎత్తుగడను అర్థం చేసుకోలేక కాంగ్రెస్ వేస్తున్న తప్పటడుగులు..ఒక్కో రాష్ట్రంలో బీజేపీకి రాచబాట పరుస్తూ పోతున్నాయి. అన్నింటికీ మించి ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్ గుప్పిట్లోంచి బయటపడి తమ కండ్లకు కప్పుకొన్న పొరలు విప్పుకొని, తమ ప్రాంతీయ అస్తిత్వాలను నిలబెట్టుకుంటాయా? ■

మగువల వేదన అర్థమైందా రేవంత్?



కందిబండ కృష్ణప్రసాద్
91827 77010

ఏ సమస్యకైనా సరే మూలం ఏమిటో సక్రమంగా అర్థమైతే తప్ప సరైన పరిష్కార మార్గం లభించదు. ముఖ్యంగా శాంతిభద్రతలకు సంబంధించిన ఏదైనా సమస్య వెలుగులోకి వచ్చినప్పుడు తక్షణమే పరిష్కారం చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద, పోలీస్‌శాఖ మీద ఉంటుంది. లేదంటే ఆ సమస్య మరింత ముదిరి శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం కలిగించే ప్రమాదకర స్థాయికి చేరుతుంది. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బీ సుమతి అర్ధరాత్రి వేళ.. రోడ్డు మీద.. ఒక సాధారణ మహిళ మాదిరిగా నిల్చున్న సందర్భంలో ఆమెకు ఎదురైన చేదు అనుభవాలు ఇటువంటి ప్రమాదాన్నే హెచ్చరిస్తున్నాయి. ఆమె ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారో తెలియదు కానీ, అర్ధరాత్రి వేళ ఆమె పెద్ద 'సాహసమే' చేశారు! మన దేశంలో సాధారణ మహిళలు సర్వసాధారణంగా ఇటువంటి సాహసాలు చేయరు.

ఎప్పుడైనా ఏ మహిళ అయినా అర్ధరాత్రి వేళ ఒంటరిగా బయటకు వచ్చి, బస్సు కోసమో, ట్యాక్సీ కోసమో, స్నేహితుల కోసమో, బంధువుల కోసమో ఎదురుచూడాల్సిన తప్పనిసరి పరిస్థితి వస్తే, అది ఎంత నరకమో, దుర్భరమో పోలీస్ కమిషనర్ హోదాలో ఉన్న సుమతి అర్థం చేసుకొని ఉంటారు. అర్ధరాత్రి వేళ 'పోకిరీ'ల మాదిరిగా తనకు తారసపడ్డ ఆ నలభై మంది తాను నిల్చున్నప్పుడు తనతో అలా మాట్లాడటానికి, తాను నడుస్తున్నప్పుడు తనను వెంబడించడానికి గల కారణం ఏమిటో కూడా రూఢీ అయి ఉంటుంది! ఇప్పటికే ఒకసారి 18 మంది ప్రాణాలను బలిగొన్న బాంబ్‌బ్లాస్ట్ జరిగిన దిల్‌సుఖ్‌నగర్ లాంటి అత్యంత కీలకమైన, సున్నితమైన ప్రాంతంలో పోలీస్ గస్తీ ఎంత అధ్వానంగా ఉన్నదో, రాత్రి డ్యూటీలో ఉండే పోలీసులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అవగతమై ఉంటుంది.

ప్రతిరోజూ నిశిరాత్రిలో ఆ సువిశాల రోడ్ల వెంట ఏమి జరుగుతున్నదో, కొంతమంది యువకులు తనతో ప్రవర్తించిన తీరును బట్టే ఆమె అర్థం చేసుకొని ఉంటారు. ఆమె లోకం పోకడ తెలియని అమాయకురాలు ఏమీ కాదు కదా! పైగా పెద్దపెద్ద నక్సలైట్ల లొంగుబాట్ల ఇష్యూనే హ్యాండిల్ చేసిన, కరుడుగట్టిన నేరస్తులకు సైతం చుక్కలు చూపించిన ట్రాక్ రికార్డ్ ఉన్న పోలీస్ ఆఫీసర్ ఆమె! ఆ అర్ధరాత్రి వేళ.. ఒక సాధారణ మహిళగా తనకు ఎదురైన చేదు అనుభవాలు, అందుకు గల కారణాలను ఆమె ప్రభుత్వానికి అధికారికంగా నివేదించారో లేదో తెలియదు. శాంతిభద్రతలతో ముడిపడిన హోంశాఖ బాధ్యతలను కూడా తానే స్వయంగా పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికైనా ఇటువంటి ఆలోచన వచ్చిందో లేదో, ఆయనకు అంత తీరిక ఉన్నదో లేదో తెలియదు. కానీ, దిల్‌సుఖ్‌నగర్ లాంటి రద్దీ ప్రాంతాల్లో కూడా మహిళలు ఒంటరిగా బస్సుల కోసం ఎదురు చూసే పరిస్థితిని కల్పించలేకపోతున్నందుకు ఏ ప్రభుత్వమైనా సిగ్గు పడాలి. తమ ఏలుబడిలో ఒక మహిళా పోలీస్ కమిషనర్‌కు ఇటువంటి పరిస్థితి ఎదురైన నేపథ్యంలోనైనా ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా పరిగణించాలి. ఎందుకంటే, సాక్షాత్తు పోలీస్ కమిషనర్ సుమతికి ఎదురైన అనుభవం ప్రభుత్వ ప్రతిష్టకు కూడా మచ్చ తెచ్చేదే!

> దిల్‌సుఖ్‌నగర్ అనేది ఆషామాషీ సెంటర్ కాదు. అదొక హైవే. హైదరాబాద్‌ను ఇతర రాష్ట్రాలతోనూ కనెక్ట్ చేసే మార్గం. వ్యాపార, వాణిజ్య కూడలి. పలు కార్పొరేట్ హాస్పిటల్స్, కాలేజీలు, కోచింగ్ సెంటర్లు, హాస్టల్స్ కేంద్రీకృతమైన ప్రాంతం. అనేక సుప్రసిద్ధ దేవాలయాలు ఉన్న రహదారి. అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా అనేకమంది ప్రయాణికులు ఆర్టీసీతోపాటు ప్రైవేట్ వాహనాల్లో రాకపోకలు సాగిస్తుంటారు.

కుటుంబాలతో కలిసి రోడ్డు మీదనే నిలబడి తాము ఎక్కాల్సిన బస్సు కోసం ఎదురుచూస్తుంటారు. దూరప్రాంతాల నుంచి వచ్చేవారు ఆ పరిసరాల్లోనే బస్సు దిగి, ఆటోలు, ట్యాక్సీల్లో ఇండ్లకు వెళ్తుంటారు. అలాంటి ఆ ప్రాంతంలో ముఖ్యంగా దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్ నుంచి కొత్తపేటలో నిర్మాణంలో ఉన్న టిమ్స్ హాస్పిటల్ వరకు కొంతకాలంగా 'అసాంఘిక కార్యక్రమాలు' పెరుగుతున్న విషయాన్ని మీడియా వెలుగులోకి తెస్తూనే ఉన్నది. ఫ్యామిలీతో కలిసి ఆ మార్గంలో వెళ్లే వారికి అదొక ఇబ్బందికర వాతావరణమే. ఒకవైపు, పోలీస్ పెట్రోలింగ్ వాహనాలు తిరుగుతున్నా.. అక్కడ నేర సామ్రాజ్యం విస్తరిస్తుండటం అత్యంత ఆందోళనకరం. పోకిరీలు, ట్రాన్స్‌జెండర్లు, ప్రాస్టిట్యూట్స్ చెలరేగిపోతున్నా.. పెట్రోలింగ్ వాహనాల్లో తిరిగే పోలీసులు ఎందుకు సీరియస్‌గా తీసుకోవడం లేదన్నదే ప్రశ్న.




బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నది. హైదరాబాద్‌లో రహదారుల వెంట లక్షకు మించి సీసీ కెమెరాలు, వాటన్నింటినీ అనుసంధానిస్తూ, పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేసింది. నగరం నలుమూలలా ఏమి జరిగినా క్షణాల్లో పసిగట్టే సాంకేతికతను పోలీసు యంత్రాంగం అందిపుచ్చుకున్నది. మహిళలకు భద్రత కల్పించాలనే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం షీ టీమ్‌లను ఏర్పాటు చేసింది. ఆ ప్రయోగం సత్ఫలితాలనిచ్చింది. ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొచ్చింది. కానీ నేడు బస్సు కోసం ఎదురుచూస్తున్న మహిళ వద్దకు వెళ్లి 'వస్తావా? రేటెంత? ఎక్కడికి వెళ్దాం?' అని అడిగే ధైర్యం 'పోకిరీ'లకు ఎలా వస్తున్నది? ఎక్కడ, ఏ వీధిలో, ఏ చిన్న ఫంక్షన్ జరిగినా, ఎక్కడ గృహప్రవేశం ఉన్నా, ఎక్కడ షామియానా కనిపించినా క్షణాల్లో అక్కడ వాలిపోయి, వేలు, లక్షలాది రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేసే ధైర్యం ట్రాన్స్‌జెండర్లకు ఎవరు ఇస్తున్నారు?

> ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద కార్లు ఆగిన వెంటనే, ట్రాన్స్‌జెండర్స్ గుంపు అక్కడకు చేరి, కారు అద్దాల మీద టపీటపీమని కొడుతున్నా, అక్కడే ఉండి చూస్తున్న పోలీసులు ఎందుకు స్పందించడం లేదు? సీసీ కెమెరాల్లో అవన్నీ సాక్ష్యాల రూపంలో నమోదవుతున్నా ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు? నగరంలో విస్తరిస్తున్న ఈ దందాలు శాంతిభద్రతలు ఘోరంగా క్షీణిస్తున్నాయనడానికి నిదర్శనం కాదా?

ఒక మహిళ ఒంటరిగా బస్టాండ్ వద్ద నిల్చోలేని పరిస్థితి, కనీసం ఇంటి వద్ద కూడా ప్రశాంతంగా ఫంక్షన్ చేసుకోలేని భయానక వాతావరణం ఒక దిక్కు ఏర్పడుతుంటే.. అది శాంతిభద్రతల వైఫల్యం కాదా? నగర పౌరులకు భద్రత కల్పించే విషయంలో ఎందుకింత నిర్లిప్తత? చెట్ల చాటునో, గోడల చాటునో నక్కి ట్రాఫిక్ ఉల్లంఘన ఫొటోలు తీయడం, దారి కాచి చలాన్లు వసూలు చేసే నైపుణ్యం కలిగిన పోలీసులకు నిత్యం పౌరులు ఎదుర్కొంటున్న ఇలాంటి సమస్యలు పట్టవా?

హైదరాబాద్ నగరంలో దాదాపు తొమ్మిది లక్షల సీసీ కెమెరాలు ఉన్నా, వాటిలో రికార్డు అవుతున్న అంశాలను ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా పరిశీలించాలన్న ధ్యాస కానీ, అసాంఘిక ప్రవృత్తి, చీకటి నేరాలకు అడ్డాగా మారుతున్న ప్రాంతాలను గుర్తించి, వాటిని అరికట్టేందుకు ఏం చేయాలన్న ఆలోచన కానీ పోలీసు యంత్రాంగానికి ఎందుకు రావడం లేదు? ఇంత సాంకేతికత అందుబాటులోకి వచ్చిన తర్వాత కూడా పోలీసులు అంత నిర్లిప్తంగా ఎందుకు ఉంటున్నారు? సభ్యసమాజం తలదించుకొనేలా నడివీధుల్లో జరుగుతున్న బాగోతాలను అరికట్టే విషయంలో పోలీసులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నరో అర్థం చేసుకోవడానికి స్వయంగా పోలీస్ కమిషనర్ సుమతికి ఎదురైన అనుభవమే నిదర్శనం. ఇలాంటి పరిస్థితి సర్కార్ వైఫల్యం కాదా? ఇందుకు హోంశాఖను పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి నైతిక బాధ్యత తీసుకోవద్దా? ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని, మహిళల, పౌరుల భద్రతకు ముప్పుగా పరిణమిస్తున్న ఈ సంస్కృతిని కూకటివేళ్లతో పెకిలించేందుకు ప్రయత్నించకపోతే, మరెన్నో కీచక దృశ్యాలు, ఘోరమైన నేరాలను చూడాల్సి వస్తుంది. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌కి డ్యామేజ్ అయితే, సురక్షిత నగరం కాదని ముద్ర పడితే అది రాష్ట్రానికి ప్రమాదం. ■



గీతన్నల బతుకు దినదిన గండం



రాజు పిల్లనగోయిన

తెలంగాణ గడ్డపై గౌడన్నల కష్టం ప్రాచీనమైనది, అత్యంత సాహసోపేతమైనది. ఆకాశానికి, భూమికి మధ్య వేలాడుతూ, ప్రాణాలను పణంగా పెట్టి కల్లు గీసే గీత కార్మికుడు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో, సంస్కృతిలోనూ కీలక పాత్రధారి. కానీ, నేడు ఆ గీతన్నల బతుకులు ఛిద్రమవుతున్నాయి. తాటి చెట్టు నుంచి ప్రమాదవశాత్తూ పడి ఎంతోమంది దుర్మరణం చెందుతుండగా, వేలాదిగా గాయపడుతున్నారు.

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ఆయా కుటుంబాలకు సవ్యంగానే ఆర్థిక భరోసా ఇచ్చింది. రేవంత్ సర్కార్ గీత కార్మికులపై శీతకన్ను వేస్తున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గీత కార్మికుల సంక్షేమం పాతాళానికి పడిపోయింది. గీత కార్మికుడు చెట్టు పైనుంచి పడి మరణిస్తే ఇచ్చే ఎక్స్‌గ్రేషియా తక్షణమే రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతామని ఎన్నికల ప్రచార సమయంలో కాంగ్రెస్ నేతలు భరోసా ఇచ్చారు. ప్రమాదం జరిగిన 15 రోజుల్లోనే పరిహారం నేరుగా బాధిత కుటుంబ సభ్యుల ఖాతాల్లో పడేలా చేస్తామన్నారు. గీత వృత్తిని గౌరవప్రదంగా మారుస్తామని, ఆధునిక పరికరాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కానీ నేడు వాస్తవ పరిస్థితి చూస్తే..గీతన్నలను ప్రభుత్వం గాలికి వదిలేసిందని స్పష్టమవుతున్నది. రెండున్నరేండ్లు గడుస్తున్నా. పెంచిన రూ.10 లక్షల పరిహారం బాధితులకు అందకపోగా..గతంలో మాదిరిగా రూ.5 లక్షల పరిహారమైనా ఇప్పించండంటూ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సుమారు 200 మందికి పైగా గీత కార్మికులు ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయారు. వందలాది మంది వెన్నెముక విరిగి, కాళ్లు, చేతులు పడిపోయి మంచాన పడ్డారు. వీరిలో ఒక్కరికి కూడా పైసా సాయం అందలేదు. ప్రభుత్వ యంత్రాంగం మాత్రం..'నిధులు లేవు', 'పాలసీ ఇంకా ఖరారు కాలేదు' అంటూ కుంటిసాకులు చెప్తూ కాలయాపన చేస్తున్నది. గతంలో ప్రారంభమైన రక్షణ కవచం (సేఫ్టీ కిట్స్) పంపిణీని ఈ ప్రభుత్వం అటకెక్కించింది. గీత కార్మికులకు అత్యాధునిక మోకు ఇస్తామని చెప్పినా, అది ఎప్పుడు వస్తుందో చెప్పలేని స్థితిలో ఉన్నది. 'నీరా'ను ఒక ఆరోగ్య పానీయంగా ప్రమోట్ చేస్తామని, గీత కార్మికులకు ఉపాధి కల్పిస్తామని చెప్పిన పాలకుల మాటలు నీటి మూటలయ్యాయి. హైదరాబాద్‌లోని 'నీరా' కేఫ్‌లు కళ తప్పాయి. గ్రామీణ ప్రాంతాల్లో 'నీరా' సేకరణ కేంద్రాలు లేవు. మార్కెటింగ్ సదుపాయం కల్పించటంలో ప్రభుత్వం విఫలమైంది.

> అబ్కారీ శాఖ ద్వారా ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయల ఆదాయం వస్తున్నది. ఈ ఆదాయంలో అత్యధిక భాగం మద్యం అమ్మకాల ద్వారా ఉంటున్నది. కల్లును కూడా అబ్కారీ శాఖే పర్యవేక్షిస్తుంది. మరి ఆ శాఖ ద్వారా వస్తున్న ఆదాయంలో కనీసం ఒక శాతం కూడా గీత కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయలేకపోవటం అత్యంత దారుణం. గీత కార్మికులు బలమైన ఓటు బ్యాంకుగా ఉన్నప్పటికీ, వారి ఐక్యత లేకపోవటాన్ని ప్రభుత్వం ఆసరాగా తీసుకుంటున్నది. పెండింగ్‌లో ఉన్న వందలాది క్లెయిమ్స్‌ను పరిష్కరించటానికి కనీసం వెయ్యి కోట్ల రూపాయలైనా కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించలేదు. గీత కార్మికుల కుటుంబాలకు మొండిచేయి చూపింది.

గీత కార్మికులు మరణిస్తే రూ.5 లక్షల పరిహారం నేరుగా నామినీ ఖాతాలో పడేలా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక వ్యవస్థను రూపొందించారు. కానీ, ఇపుడు ఆ వ్యవస్థ కుప్పకూలింది. పెంచిన పరిహారం కోసం కొత్త జీవో విడుదల చేయటంలో, బడ్జెట్ కేటాయించటంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తున్నది. కేసీఆర్ ప్రభుత్వంలో మద్యం ద్వారా వచ్చే ఆదాయంలో కొంత భాగాన్ని గౌడన్నల సంక్షేమానికి కేటాయించే పద్ధతిని అనుసరించింది. కానీ ప్రస్తుత ప్రభుత్వం అబ్కారీ శాఖను కేవలం రాబడి వనరుగా మాత్రమే చూస్తున్నది. మద్యం దుకాణాల లైసెన్సుల ద్వారా వచ్చే వేల కోట్లు ఇతర పథకాలకు పోతున్నాయి తప్ప, గీతన్నల ప్రాణాలకు రక్షణగా నిలబడటం లేదు. ఇకనైనా 50 ఏండ్లు నిండిన గీత కార్మికులకు నెలకు రూ.5 వేలు పెన్షన్ ఇవ్వాలి. ప్రతి గీత కార్మికుడికి ప్రభుత్వం తరఫున ఉచితంగా రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ చేయించాలి. హరితహారం కింద నాటే మొక్కల్లో ఈత, తాటి చెట్లకు ప్రాధాన్యం ఇవ్వాలి.




కవిత!

మన నేల మీద
మళ్ళీ పల్లేరు మొలకల జాడలు
నిశ్శబ్దంగా పరచుకుంటున్న కరువు నీడలు
మరోసారి పట్నం వైపు
పల్లెల వలస చూపులు
ఆకుపచ్చ తెలంగాణ దృశ్యం
కనుమరుగయ్యే కుట్ర
సాధించుకున్న స్వేచ్ఛ వెనక
పరాయి జెండా రెపరెపలు
భ్రమలు ఒక్కొక్కటిగా మంచు తెరలై
కనుమరుగవుతున్న విషాదకాలం
శకుని మాయాజూదం
చివరి అంకానికి చేరుకున్న వికృత వేళ
జట్లు జట్లుగా దుష్టచతుష్టయం
ఏకమై కొత్త కొత్త కుట్రలకు
ఆజ్యం పోస్తున్నారు
నీటి దొంగలకు ఇంటి దొంగల తోడు
మాన్పుకున్న గాయాలను
గెలికి చూస్తున్నారు
యుద్ధం తప్పనప్పుడు సాధకుడు
పాంచజన్యం పూరించాల్సిందే!
మౌనం ఎంత శక్తివంతమో
చరిత్రలో ఒక పాఠమై నిలిచిపోవాలి!



కోట్ల వెంకటేశ్వరరెడ్డి
9440233261



గవర్నర్ వ్యవస్థ అవసరం లేదు!

గవర్నర్ పదవిని రద్దు చేయాలన్న డీఎంకే నిర్ణయానికి కట్టుబడి ఉన్నాం. ప్రస్తుతం తమిళనాడులో రాజకీయ పరిణామాలు.. రాష్ట్ర ప్రయోజనాలకు, గవర్నర్ వ్యవస్థకు మధ్య ఘర్షణకు నిదర్శనం. ప్రజల నిర్ణయమే సర్వోన్నతమైనది. ఎన్నికలలో స్పష్టమైన తీర్పు రాలేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఏం చేయాలన్న విషయంపై రాజ్యాంగ వ్యవస్థలు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరమున్నది.

కనిమొళి, డీఎంకే ఎంపీ



కొనేదాకా కొట్లాడుడే

• దండం పెడుతున్న..ధాన్యం కొనండి

రాయపర్తి, మే8: చేతులు జోడించి దండం పెడుతున్న.. దయచేసి రైతులను ఇబ్బందులు పెట్టకండి.. మక్కలు కొనుగోలు చేసి వారిని ఆదుకోండి..' అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సంబంధిత అధికారులను వేడుకున్నారు. శుక్రవారం వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలో మక్క రైతుల కష్టాలను తెలుసుకున్న ఆయన పోలీస్ స్టేషన్ ఎదుట వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై బైఠాయించారు. జాంబవ రైతు ఉత్పత్తిదారుల సంఘం యాజమాన్యం రైతులను చిన్నచూపు చూస్తున్నదని వాపోయారు. రేవంత్‌రెడ్డి సర్కార్ రైతుల పాలిట శాపంగా మారిందని విమర్శించారు. అనంతరం మార్క్‌ఫెడ్ జీఎంతో ఫోన్లో మాట్లాడుతూ రాయపర్తిలో మక్కజొన్న సాగు చేసిన రైతులు పడుతున్న కష్టాలను, ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. 24 గంటల్లో కొనుగోలు చేయకుంటే హైవేను దిగ్బంధిస్తామని హెచ్చరించారు. ఎస్సై రాజేందర్ గారూ.. మీకు రైతుల కష్టాలు కనపడటం లేదా...ఇంత అధ్వానమైన పరిస్థితులు రాష్ట్రంలో ఎప్పుడైనా చూశామా చెప్పండి అంటూ ఆవేదన వ్యక్తంచేశారు.



• రైతును కన్నీరు పెట్టిస్తున్న కాంగ్రెస్

మోర్తాడ్, మే 8: ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం రైతులను కన్నీరు పెట్టిస్తున్నదని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మండిపడ్డారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో తాలు తీస్తే తోలు తీస్తా అన్న ముఖ్యమంత్రి.. ఇప్పుడు రైతుల వద్ద నుంచి క్వింటాలుకు 10 కిలోల తరుగుతీస్తున్న మిల్లర్లపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి, భీమ్‌గల్ మండలాల్లోని కొనుగోలు కేంద్రాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి కొనుగోళ్లలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంటా వేయక నెల రోజులుగా ధాన్యం కల్లాల్లోనే కుప్పలు, తెప్పలుగా పేరుకుపోవడం, అకాల వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంపై వేముల ఆవేదన వ్యక్తం చేశారు. తరుగు పేరిట దోపిడీకి అడ్డుకట్ట వేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠిని ఫోన్‌లో కోరారు.



• అసెంబ్లీలో చెప్పినా ఆవేదన పట్టలే..



మల్లాపూర్, మే 8: రెండు నెలల క్రితమే అసెంబ్లీ వేదికగా మొత్తుకున్నా రైతుల సమస్యలను పట్టించుకోలేదని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల స్పష్టం చేశారు. శుక్రవారం జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రంలోని మక్కలు, వడ్ల కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. మా బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలందరం సమిష్టిగా హమాలీ పనులు చేసి ధాన్యం జోకుతాం'' అని పేర్కొన్నారు.

• తడిసిన మక్కలు కొనాల్సిందే..

జగిత్యాల, మే 8 : తడిసిన మక్కలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీట్ మార్కెట్‌లో అకాల వర్షానికి తడిసిన మక్కలను ఆయన శుక్రవారం పరిశీలించగా, ఈ సందర్భంగా రైతులు లారీలు రావడం లేదని జీవన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. తూకం వేసిన మక్కల సంచులు కూడా తడుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కలెక్టర్, మార్క్‌ఫెడ్ ఎండీ, అధికారులతో జీవన్‌రెడ్డి ఫోన్‌లో మాట్లాడారు. మార్కెట్‌లోనే మూడు గోదాంల ఖాళీగా ఉన్నాయని, వాటిని కేటాయించాలని కోరారు. శుక్రవారం మక్కలు తరలిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.



అదే యాతన..తీరని వేదన

రోజులు..వారాలు.. నెల దాటినా రైతాంగం పరిస్థితి మారలేదు. పంట మొదలు నుంచి అమ్ముకునే దాకా తీరని కష్టం..నష్టం వెంటాడుతున్నది. ఎరువుల ఇక్కట్లు మరచిపోకముందే ఇప్పుడు పంటను అమ్ముకునేందుకు రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఎదురైంది. ఓవైపు మండుతున్న ఎండలు.. మరోవైపు కడుపు మాడ్చుకొని కొనుగోలు కేంద్రాల్లో ఎదురుచూపులు రైతును కన్నీరు పెట్టిస్తున్నది. ధాన్యం, మక్క కొనుగోలు కేంద్రాల్లో సరైన ఏర్పాట్లు చేయకపోవడం రేవంత్ సర్కార్ నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా కనిపిస్తున్నది. ఇంకెన్నాళ్లీ కష్టం దేవుడా అంటూ రైతాంగం ఆవేదన వ్యక్తంచేస్తున్నది.

• పంటలు కొనడంలో సర్కార్ విఫలం



గొల్లపెల్లి, మే 8 : ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో రేవంత్ సర్కార్ పూర్తిస్థాయిలో విఫలమైందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ధ్వజమెత్తారు. జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. అక్కడ రైతుల కష్టాలను చూసి చలించిపోయి, వారితో కలిసి రాస్తారోకోకు దిగారు. అకాల వర్షానికి తడిసిన ధాన్యం పరిస్థితి ఏంటో తెలియక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ధాన్యాన్ని అమ్ముకోవడానికి ఇంతయాతన పడాలా? అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పెద్దపెద్ద మాటలు మాట్లాడుతున్నాడని, జిల్లాలో ఏ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించాడో?, ఏ రైతుతో మాట్లాడాడో? చెప్పాలని ప్రశ్నించారు.

కాల్మొక్త సారూ.. వడ్లు కొనండి

కర్నమామిడిలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్యను వేడుకున్న రైతులు

హాజీపూర్, మే 8 : 'వర్షాలు పడ్తున్నయి. ధాన్యం ఎక్కడ తడుస్తదోనని భయమైతంది.. మీ కాల్మొక్త సారూ.. వడ్లు కొనండి..' అంటూ మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం కర్నమామిడి గ్రామానికి చెందిన రైతు బొడ్డు మధుకర్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రయ్య కాళ్లపై పడి వేడుకున్నాడు. పడ్తన్‌పల్లి, కర్నమామిడి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో వడ్లు కొనడం లేదంటూ ఆగ్రహించిన రైతులు శుక్రవారం హాజీపూర్ మండల కేంద్రంలోని జాతీయ రహదారి-63పై ఎడ్లబండ్లతో దాదాపు రెండు గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. సమాచారమందుకున్న హాజీపూర్ ఎస్ఐ కిరణ్‌కుమార్ అక్కడికి చేరుకొని సజావుగా కొనుగోళ్లు జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. అయినా వారు వినకుండా కలెక్టర్ రావాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఇక ఎస్ఐ చేసేదేమీ లేక ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రయ్య అక్కడికి చేరుకొని రైతులను సముదాయించారు.

• రైతులపై కక్ష.. ఇదేనా ప్రజా పాలన?



చొప్పదండి, మే 8: కోతల్లేకుండా ధాన్యం కొనాలని చొప్పదండి మండలం ఆర్నకొండ రైతులు శుక్రవారం రోడ్డెక్కారు. సర్కార్‌కు వ్యతిరేకంగా నినదించారు. తూకం వేసి సిద్ధంగా ఉన్న వేల బస్తాల ధాన్యం తరలించడం లేదని మండిపడ్డారు. చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ రైతుల నిరసనకు మద్దతు తెలిపారు. రైతులపై ఇంతలా కక్ష సాధించడం.. ఇదేనా ప్రజా పాలన? అంటూ ధ్వజమెత్తారు. ఆర్డీవో, అదనపు కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడి రైతుల బాధలను వివరించారు. ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రెండు రోజుల్లో ధాన్యం కొనుగోలు పూర్తి చేయకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. పోలీసుల హామీతో ఆందోళన విరమించారు.

• వడ్లు కొనమంటే... లీడర్లను కొంటున్నరు..



మహబూబ్‌నగర్, మే 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రైతులు పండించిన ధాన్యం కొనమంటే గ్రామాల్లో సర్పంచులు, ఉపసర్పంచులు, లీడర్లను కాంగ్రెసోళ్లు కొంటున్నరని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. మహబూబ్‌నగర్ మండలంలోని రాంరెడ్డిగూడెం మిల్లు వద్ద వడ్లు విక్రయించేందుకు వాహనాల్లో సంచులు పెట్టుకొని ఎదురు చూస్తున్న రైతులతో మాజీ మంత్రి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజు దగ్గరలోనే ఉందని హెచ్చరించారు. రైతులు అధైర్య పడొద్దని.. ప్రభుత్వం పంటలు కొనేదాకా కొట్లాడుతామని హామీ ఇచ్చారు. రైతులను అన్ని విధాలా ఇబ్బందుల పాలుజేసి రైతు వారోత్సవాలు ఎందుకు నిర్వహిస్తున్నారో అర్థం కావడం లేదని మండిపడ్డారు.

• ట్రాక్టర్ల బారులు.. రైతులకు కన్నీళ్లు



వరంగల్, మే 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్రంలో కాంగ్రెస్ పరిపాలనలో రైతుల కన్నీళ్లకు అంతులేదు. రహదారులపై ధాన్యం ట్రాక్టర్ల వరుసకు అంతులేదు. రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లో రైతుల నిరీక్షణ తప్పడం లేదు. పంట ఉత్పత్తులను కాపాడుకోవడానికి రైతులకు రికామే లేదు. కరువునాడు కన్నీరే.. కడుపునిండా పంట పండినా కన్నీరే అన్నట్టుగా రైతన్న పరిస్థితి తయారైంది. భూమి మోసేంత పంట పండినా సరే.. కేసీఆర్ హయాంలో తన పంట కొనమని రైతు రోడ్డెక్కలేదు. రెండున్నరేండ్ల కాంగ్రెస్ సర్కార్ పాలన అన్నదాతను దయనీయ దుస్థితికి చేర్చింది. పంట వేసిన నాటి నుంచి అమ్ముకునేదాకా అరిగోస పెడుతున్నది. వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలో శుక్రవారం కిలోమీటర్ల కొద్దీ చీమలుదారులు తీసినట్టే..మక్కజొన్న లోడ్లతో ట్రాక్టర్ల బారులు తీసిన దృశ్యమే ఇవ్వాళ రాష్ట్రంలో రైతు దయనీయ దృశ్యానికి సంకేతం. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా నిలిచింది. ఏఎన్ఐ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వంటి మీడియా సంస్థల ప్రతినిధులు రహదారులపై బారులు తీరిన ట్రాక్టర్లను చూసి ఆశ్చర్యానికి లోనయ్యారు. డ్రోన్ కెమెరాలకు కూడా సిగ్నల్ అందనంత దూరం ట్రాక్టర్ల బారులు తీరడం గమనార్హం. మునుపెన్నడూలేని దయనీయస్థితిని మక్క రైతులు ఈసారి అనుభవిస్తున్నారు. తమకు భరోసాగా నిలిచేందుకు వచ్చిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి వంటి వారికి తమ గోడు చెప్పుకొంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు.

• పదిహేను రోజులైనా పంట కొనలే..



నెక్కొండ, మే 8 : ధాన్యం, మక్కల కొనుగోలులో సర్కార్ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ వరంగల్ జిల్లా నెక్కొండలో శుక్రవారం పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. నెక్కొండ-నర్సంపేట ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించగా మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి రైతులకు సంఘీభావం తెలిపారు. పనికర గుట్ట ప్రాంతంలో అధికారులు బలవంతంగా మక్కలను నిల్వచేయించి పదిహేను రోజులు గడుస్తున్నా నేటికీ కొనలేదని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ రోజుల తరబడి రైతులు కొనుగోలు కేంద్రాల్లో నిరీక్షిస్తున్నా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, అధికారులు మొద్దు నిద్రలో ఉన్నారని విమర్శించారు. అనంతరం జిల్లా కలెక్టర్, డీసీవోతో మాజీ ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడి రైతుల ఇక్కట్లను తొలగించాలని కోరారు.

• మక్కలు కొనాలని మార్కెట్ గేట్‌కు తాళం




అకాల వర్షానికి తడిసిన మక్కలను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం వరంగల్ జిల్లా నర్సంపేట వ్యవసాయ మార్కెట్‌లో రైతులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డు గేట్‌కు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. -నర్సంపేట

• మక్కలు కొనాలని ధర్నా



ఇబ్రహీంపట్నం, మే 8: తడిసిన మక్కలు కొనుగోలు చేయాలని శుక్రవారం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నంలోని వ్యవసాయ మార్కెట్ ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజులు గడుస్తున్నా మక్కలు కొనకపోడం దారుణమని మండిపడ్డారు.

• అధికారుల నిర్లక్ష్యం.. రైతన్నకు కష్టం



వడ్లు, మక్కలు కొనాలని కోరుతూ నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలంలోని రాజురా గ్రామానికి చెందిన రైతులు శుక్రవారం నర్సాపూర్(జీ) మండలంలోని అర్లిఎక్స్ రోడ్డు వద్ద రాస్తారోకో చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొనుగోలు కేంద్రాలకు మక్కలు, వడ్లు తీసుకువచ్చి 25 రోజులైనా పంట కొంటలేరని మండిపడ్డారు. లోకేశ్వరం తహసీల్దార్ అక్కడికి రాగానే ఇద్దరు రైతులు కాళ్లపై పడి పంటలు కొనాలని వేడుకున్నారు. రేపటిలోగా పది లారీలను సరిపడా గన్నీ బ్యాగులను తెప్పించి కొనుగోలు ప్రక్రియ పూర్తి చేస్తామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. -నర్సాపూర్(జీ)

• పరిహారం ఏది మహాప్రభో..



కోల్డ్ స్టోరేజీలో అగ్నిప్రమాదం జరిగి నెలలు గడుస్తున్నా తమకు పరిహారం అందలేదని బాధిత రైతులు ఆందోళనకు దిగారు. నష్టపరిహార సాధన కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా మధిర తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. అప్పు చేసి మరీ కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేసుకుంటే అగ్నిప్రమాదం తమ జీవితాలను బుగ్గిపాలు చేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. -మధిర

• ధాన్యం కొనండి.. మా చింత తీర్చండి



ధాన్యాన్ని ప్రభుత్వం కోనుగోలు చేయడం లేదని నారాయణరావుపేట రైతులు శుక్రవారం సిద్దిపేట జిల్లా సిద్దిపేట - ముస్తాబాద్ రహదారిపై బైఠాయించి ధర్నాకు దిగారు. ధాన్యం కుప్పలు పోసి నెలలు గడుస్తున్నా పట్టిచుకోవడం లేదని మండిపడ్డారు. సమస్యను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. - నారాయణరావుపేట

ధర్మం తప్పిన ధర్మవాణి!

- కమిషనర్ ఆదేశాలు బుట్టదాఖలు
- దేవాదాయ శాఖ హెడ్ ఆఫీస్‌లో పేరుకుపోతున్న ఫైళ్లు
- ముడుపులు ముట్టనిదే ఫైల్ కదలడం లేదని దేవాలయాల సిబ్బంది ఆవేదన వ్యక్తం

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 8 (నమస్తే తెలంగాణ): ధర్మవాణి ధర్మం తప్పింది! ధర్మవాణిలో స్వీకరించిన వినతిపత్రాలపై సాక్షాత్తు దేవాదాయ శాఖ కమిషనర్ జారీ చేసిన ఆదేశాలకే దిక్కులేకుండా పోతున్నది. మార్చి 16వ తేదీన దేవాదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ధర్మవాణిలో పాలకుర్తి సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి సంబంధించి ఆగమం విషయంలో అక్కడి అర్చకులు కమిషనర్‌కు ఒక వినతి పత్రం అందజేశారు. అదేరోజు సీ సెక్షన్‌లో దీనికి సంబంధించి ఫైల్ పుటప్ చేసి ఈవో నుంచి నివేదిక కోరాలని చెప్పినా ఇప్పటి వరకు అంటే నెలన్నర దాటినా సదరు ఈవోకు ఎలాంటి లేఖ రాలేదు. మూడునెలల క్రితం హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ అమ్మవారి దేవాలయానికి సంబంధించి ఓ ఉద్యోగి విషయమై విచారణ చేయాలని ఎంక్వైరీ ఆఫీసర్‌ను నియమిస్తూ కమిషనర్ నుంచి నోట్‌ఫైల్ వచ్చినా ఆ సెక్షన్ నుంచి మాత్రం సదరు విచారణాధికారికి కానీ, దేవాలయానికి కానీ ఎలాంటి లేఖ కూడా అందలేదు. దీంతో విచారణకు చాలా సమయం పట్టింది. ధర్మవాణిలో దేవాలయాల అర్చక ఉద్యోగులకు సంబంధించిన సమస్యలతోపాటు ఆ శాఖకు సంబంధించిన అనేక అంశాలపై వెంటవెంటనే నిర్ణయాలు తీసుకొని ఉత్తర్వులు జారీ చేయడంతో ధర్మవాణికి తొలి వారం నుంచే స్పందన లభించింది. అయితే, కమిషనర్ ఎంత చిత్తశుద్ధితో పనిచేసినా మిగతా సెక్షన్లకు సంబంధించిన సిబ్బంది సరిగా పనిచేయకపోవడంతో చాలావరకు కమిషనర్ రాసిన నోట్‌ఫైల్స్‌కు సంబంధించిన ఉత్తర్వులు బట్వాడా జరుగడం లేదని అర్చక ఉద్యోగులు చెప్తున్నారు.

అటకెక్కిన ఈ-ఆఫీసు..!

దేవాదాయ శాఖలో ఫైళ్లన్నీ వెంటవెంటనే క్లియరెన్స్ చేయాలని ఆదేశిస్తూ గత సంవత్సరం జూలైలో మంత్రి కొండా సురేఖ అట్టహాసంగా ఈ-ఆఫీసు ప్రారంభించారు. ఒకట్రెండురోజులు ఫైల్స్ ముందుకు కదిలినప్పటికీ, ఆ తర్వాత ఈ-ఆఫీసు ముచ్చటే మరచిపోయారు. అసలు కంప్యూటర్‌లో ఫైల్ అప్‌లోడ్ చేయాలంటే ఏ,బీ, సీ సెక్షన్లలో ఆ ఆరుగురు ఉద్యోగులకు కచ్చితంగా డబ్బులు ముట్టాల్సిందే. ఒక్కో ఫైల్ దాని తీరును బట్టి రూ.5 వేల నుంచి రూ.2 లక్షల వరకు రేటు నిర్ణయించారు. ఇటీవల ఆఫీసులోని మొదటి అంతస్తులో ఏసీబీ తనిఖీలు జరుగుతున్న సమయంలో కూడా ఒక సెక్షన్‌లో పనిచేస్తున్న ఉద్యోగి ఉత్తర తెలంగాణలోని ఒక ప్రధాన శివాలయానికి సంబంధించిన ఫైల్ ముందుకు కదిలించడానికి రూ.20వేలు ముడుపులు తీసుకున్నారని దేవాదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో అప్పట్లో చర్చ జరిగింది. ఒక సూపరింటెండెంట్‌పై అవినీతి ఆరోపణలు రావడంతో ఆయన సెలవు పెట్టి వెళ్లిపోయారు. ధర్మవాణితో సమస్యలు తీరుతాయని ఉద్యోగులు భావించినప్పటికీ కమిషనర్ నోట్‌ఫైల్‌పై సంతకం చేసి ఇచ్చిన తర్వాత సెక్షన్ల వారీగా జరుగాల్సిన వ్యవహారంలో ప్రతిచోటా డబ్బులు ముట్టకపోతే ఆ ఫైల్ అటకెక్కినట్టేనని అర్చక ఉద్యోగులు చెప్పారు.

వందలాది ఫైళ్లు అక్కడే..!

క్షేత్రస్థాయిలో ఫైల్ కదలాల్సిన ఇన్‌వార్డ్ నుంచి మొదలుపెడితే కమిషనర్ చాంబర్ వరకు ప్రతిచోటా ఎంతో కొంత ముట్టజెప్పకపోతే ఫైల్ కదిలే సమస్యే లేదు. కమిషనర్ చాంబర్‌లో వందల కొద్ది ఫైళ్లు పేరుకొనిపోగా హనుమంతరావు బాధ్యతలు స్వీకరించాక వాటికి కొంతమేరకు పరిష్కారం లభించింది. ఆఫీసులో ఉన్న కొందరు డిప్యూటీ స్థాయి అధికారుల సహకారంతో కొందరు సూపరింటెండెంట్లు, మరికొందరు సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు ఈ లంచాల బాగోతంలో కీలక భాగస్వాములుగా వ్యవహరిస్తున్నారంటూ దేవాదాయ సిబ్బంది చెవులు కొరుక్కుంటున్నారు. కమిషనర్ నేరుగా రంగంలోకి దిగి సెక్షన్ల వారీగా ప్రక్షాళన చేసి ఈ ఆఫీసును పునరుద్ధరిస్తే తప్ప ఈ ముడుపుల బాగోతానికి తెరపడేది లేదని, నెలల తరబడి ఆగిపోతున్న ఫైళ్లకు మోక్షం లభిస్తుందని దేవాలయాల సిబ్బంది చెప్పుకొంటున్నారు. ఏండ్ల తరబడి తిష్ట వేసిన ఉద్యోగులను బదిలీ చేస్తే పరిస్థితి చక్కబడుతుందని కొందరు ఉద్యోగులు అంటున్నారు.



రాజన్నసిరిసిల్ల జిల్లా వీర్నపల్లిలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



రాజన్నసిరిసిల్ల జిల్లా దుమాలలో వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని పూజలు చేస్తున్న కేటీఆర్

తెలంగాణ నెత్తిన కాంగ్రెస్ దరిద్రం

ఇది గవర్నమెంట్ కాదు.. దండుపాళ్యం ముఠా.. ● రెండున్నరేండ్లలో రైతులు, విద్యార్థులు ఆగమైండ్రు: కేటీఆర్

రాష్ట్రంలో ఎక్కడికెళ్లినా కేసీఆరే రావాలంటున్నరు ఏడాదిన్నర ఓపిక పట్టండి.. కేసీఆర్ సీఎం అయితడు

- త్వరలో సభ్యత్వాలు పూర్తి చేసి కొత్త కమిటీలు వేస్తం
- ప్రజా సమస్యలపై కొట్లాడే యువతకు ప్రాధాన్యమిస్తం
- వీర్నపల్లికి కేంద్ర మంత్రి బండి చేసిందేమున్నది?
- పిల్లలకు ఒక్క బడి కట్టలే.. కనీసం గుడి కూడా కట్టలే
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపాటు
- వీర్నపల్లిలో రైతులు, పార్టీ నాయకులతో సమావేశం

రాజన్న సిరిసిల్ల, మే 8 (నమస్తే తెలంగాణ) : దేశమంతా కాంగ్రెస్ దరిద్రాన్ని వదిలించుకుంటే.. తెలంగాణలో మాత్రం మనోళ్లు దారిన పోయే దరిద్రాన్ని నెత్తిన రుద్దుకున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ప్రజా సమస్యలపై బీఆర్‌ఎస్ చేస్తున్న ఆందోళనలతో కాంగ్రెస్ సర్కార్ ఆగమవుతున్నదని చెప్పారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు, రైతు డిక్లరేషన్ సంగతేందని అడుగుతున్నామని, అందుకే రేవంత్‌రెడ్డి ఆగమైతున్నాడని చెప్పారు. కాంగ్రెస్ దరిద్రం మరో రెండేండ్లు ఉంటుందని, అప్పటిదాకా భరించక తప్పదని తెలిపారు. మళ్లీ మంచి రోజులు వస్తాయని, ఏడాదిన్నర ఓపిక పట్టాలని, కేసీఆర్ సీఎం అవుతారని, రైతులకు మేలు జరుగుతుందని ధీమా వ్యక్తంచేశారు. శుక్రవారం సిరిసిల్ల నియోజకవర్గంలో ఆయన పర్యటించారు. గంభీరావుపేట మండలం లింగన్నపేటలో ముత్యాల పోచమ్మ తల్లి కల్యాణోత్సవం, ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లె, నారాయణపూర్, పెద్దమ్మతల్లి ఆలయం, మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం, శ్రీదేవి, భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్థిర ప్రతిష్ఠా మహోత్సవం, వీర్నపల్లి మండలం భూక్యా తండా, బావుసింగ్ నాయక్ తండాల్లో జగదాంబదేవి, సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వీర్నపల్లిలో బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో రైతులు, విద్యార్థులు ఆగమవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి రెండున్నరేండ్లలో కేవలం 12 వేల ఉద్యోగాలే ఇచ్చి చేతులు దులుపుకొన్నాడని విమర్శించారు. 'అన్యాయాన్ని ప్రశ్నిస్తే ఇగో అరెస్ట్.. అగో అరెస్ట్ అంటరు.. కేటీఆర్‌ను జైల్లో పెడుతారని ప్రచారం చేసుకుంటరు. నన్ను అరెస్ట్ చేస్తామంటే చేసుకోండ్రి అని సవాల్ చేసిన. మేమేం తప్పుచేశామని అరెస్ట్ చేస్తరు?' అని ప్రశ్నించారు.

> "రాష్ట్రంలో దండుపాళ్యం ముఠా పాలన కొనసాగుతున్నది. కాంగ్రెస్ పాలనలో రైతులు, విద్యార్థులు ఆగమవుతున్నరు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి రెండున్నరేండ్లలో కేవలం 12 వేల ఉద్యోగాలే ఇచ్చి చేతులు దులుపుకొన్నరు. అన్యాయాన్ని ప్రశ్నిస్తే ఇగో అరెస్ట్.. అగో అరెస్ట్ అంటరు.. -కేటీఆర్

త్వరలోనే బీఆర్‌ఎస్ కమిటీలు

జూన్, జూలైలో బీఆర్‌ఎస్ సభ్యత్వాలు స్వీకరిస్తామని, కొత్త కమిటీలు కూడా పూర్తి చేస్తామని కేటీఆర్ తెలిపారు. చాకుల్లాంటి యువతను తీసుకుంటామని, సీరియస్‌గా యుద్ధానికి సిద్ధమవుదామని పిలుపునిచ్చారు. సమస్యలపై పోరాడాలని, 'ఢీ అంటే ఢీ' అని కొట్లాడిన వారికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సమున్నత స్థానం కల్పిస్తామన్నారు.

బండి కాదు.. తొండి సంజయ్

కేంద్ర మంత్రి బండి సంజయ్ సందట్లో సడేమియాలా మారారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. 'ఎంత సేపూ ఇయ్యాల ఏ వారమన్నా.. రేపు ఏం వారమన్నా' అంటూ మతం పేరిట జనాల నెత్తి కరాబు చేస్తున్నడు' అని విమర్శించారు. ప్రజల కష్టాలు తెలియని, రైతుల గురించి, కరెంట్ గురించి, ధాన్యం కొనుగోలు గురించి ఆయనకు కనీస అవగాహన కూడా లేదని ఎద్దేవాచేశారు. రైతులను ఏమాత్రం పట్టించుకోడని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై ఏనాడూ ప్రశ్నించలేదని, ఎంత సేపు మతం పేరు చెప్పి ఓట్లు డబ్బాలో వేయించుకోవడం తప్ప చేసిందేం లేదని మండిపడ్డారు. 'కేంద్రమంత్రి అయిన రెండున్నరేండ్లలో దత్తత గ్రామమైన వీర్నపల్లిలో బండి సంజయ్ ఒక్క బడి కట్టలే.. ఒక్క గుడి కూడా కట్టలే. చదువు రాదు.. శాస్త్రం రాదు' అని ఎద్దేవా చేశారు. 'దేవుడి గుడి ముందు బిచ్చగాళ్లలా భగవాన్ కా నామ్‌పే దేవో బాబా అన్న చందంగా బండి వైఖరి ఉంటుంది' అని దెప్పిపొడిచారు. కేసీఆర్ హయాంలో యాదగిరిగుట్టను అభివృద్ధి చేశారని, బీజేపీ వాళ్లు చేసిందేమిటని నిలదీశారు. కేసీఆర్ పాలనలో గుడులు కట్టామని, బడులు కట్టామని, కరెంట్ తెచ్చామని, తండాలను పంచాయతీలుగా మార్చామని గుర్తుచేశారు.

దండుపాళ్యం ముఠా పాలన

రాష్ట్రంలో ఉన్నది ప్రభుత్వం కాదని, దండుపాళ్యం ముఠా పాలన కొనసాగుతున్నదని కేటీఆర్ మండిపడ్డారు. ఈ మాట సురేఖమ్మ బిడ్డనే చెప్పిందని గుర్తుచేశారు. సమ్మక్క, సారక్క జాతరలో రూ.70 కోట్ల పనుల్లో వాటా కోసం మంత్రులు సీతక్క, సురేఖక్క, పొంగులేటి కొట్లాడుకున్నారని చెప్పారు. ఇట్లాంటి ప్రభుత్వం ఏ పనీచేయదని, వడ్లు కొనదని, బోనస్ ఇయ్యదని, పింఛన్లు ఇయ్యదని విమర్శించారు. 'నేను చెప్పింది తప్పని పిస్తే నాలుగు రోజులు పోతే మీకే అర్థమవుతది. గాడిదను చూస్తేనే గుర్రం విలువ తెలుస్తది. చీకటిని చూస్తేనే వెలుతురు విలువ తెలుస్తది' అని తెలిపారు. గతంలో మాదిరిగా వీర్నపల్లి మండల వ్యాప్తంగా అన్నీ గ్రామాల్లో కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని కేటీఆర్ చెప్పారు.

స్కైరూట్ ఏరోస్పేస్ రాష్ట్రానికి గర్వకారణం

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): తెలంగాణ టీ హబ్‌లో ఉద్భవించి భారతదేశపు తొలి స్పేస్-టెక్ యూనికార్న్‌గా అవతరించిన స్కైరూట్ ఏరోస్పేస్ రాష్ట్రానికి గర్వకారణమని కేటీఆర్ కొనియాడారు. ఈ ఘనత సాధించిన స్టార్టప్ బృందాన్ని శుక్రవారం ఎక్స్ వేదికగా అభినందించారు. దేశ స్పేస్ టెక్ రంగం నుంచి వన్ బిలియన్ డాలర్ల (సుమారు రూ.8 వేల కోట్లు) కంటే ఎక్కువ విలువను సాధించిన మొట్టమొదటి స్టార్టప్‌గా చరిత్ర సృష్టించడం స్ఫూర్తిదాయకమని ప్రశంసలు కురిపించారు. హైదరాబాద్ కేంద్రంగా టీ హబ్‌లో రూపుదిద్దుకొని, ఇంత తక్కువ సమయంలో అద్భుతమైన మైలురాయిని చేరుకోవడం గొప్ప విషయమని పేర్కొన్నారు. మన తెలంగాణ ఎకోసిస్టమ్‌కు గర్వకారణమని, భారతీయుల ప్రతిభ, ఆశయాలకు ఉన్న అపారమైన శక్తికి నిదర్శనమని అభివర్ణించారు. భవిష్యత్తులో మరిన్ని అద్భుత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ముమ్ముందు తెలంగాణ, భారత దేశాన్ని ఇలాగే గర్వపడేలా చేయాలని అభిలషించారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ చందన, భరత్ దకా, స్కైరూట్ బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

మహబూబాబాద్ జిల్లా మేఖ్యాతండాలో విషాదం



మంగ్యా(ఫైల్)

కురవి, మే 8: అప్పులబాధతో రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మహబూబాబాద్ జిల్లా కురవి మండలంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మేఖ్యాతండాకు చెందిన బానోత్‌మంగ్యా (70)కు 30 గుంటల వ్యవసాయ భూమి ఉంది. పంట సాగు చేసినా ఆశించిన దిగుబడి లేక నష్టపోయాడు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన భార్యకు వైద్యం ఖర్చులు, ఇంటి నిర్మాణంకోసం రూ.15 లక్షల అప్పు చేశాడు. భూమి అమ్మినా అప్పు తీర్చలేని పరిస్థితి ఏర్పడడంతో ఆవేదన చెందిన మంగ్యా గురువారం సాయంత్రం పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు మహబూబాబాద్‌లోని దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ అదే రాత్రి మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. మృతుడి కుమారుడు హాతీరాం ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కురవి ఎస్సై సతీశ్ తెలిపారు.

అమెజాన్‌ను సందర్శించిన కేజీబీవీ విద్యార్థులు

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ) : ఎక్స్‌పోజర్ విజిట్ (క్షేత్ర సందర్శన)లో భాగంగా కేజీబీవీ విద్యార్థులు అమెజాన్ సంస్థను సందర్శించారు. 50 మంది విద్యార్థినుల బృందం అమెజాన్ కార్యాలయాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా అమెజాన్ వలంటీర్లు రోబోటిక్ మోటర్ వాహనాల తయారీపై మార్గనిర్దేశనం చేశారు. రోబోల అమరిక, వాటి ఆపరేట్‌లో అవగాహన కల్పించారు. మంచిర్యాల జిల్లాకు చెందిన లాస్యశ్రీ, హనుమకొండకు చెందిన చందన మాట్లాడుతూ.. రోబోల తయారీ రేసులో పాల్గొనడం ఆనందంగా ఉందని తెలిపారు. విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా విద్యార్థినులను అభినందించారు.



2024 సెప్టెంబర్ నెల.. పెద్దపెద్ద బుల్డోజర్లు, క్రేన్లతో వచ్చిన హైడ్రా సిబ్బంది అనేక భవనాలను నిర్దాక్షిణ్యంగా కూల్చేశారు. తాము కూల్చివేసిన భవనాల వద్దకు ఎవరూ రావద్దని హైడ్రా హుకుం జారీచేసింది. ఆయా భవనాలకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని మున్సిపాలిటీకి సిఫార్సు చేసింది.


పొరపాటున కూల్చినం.. మళ్లీ కట్టుకోండి!

మొదటిపేజీ తరువాయి...

కూల్చివేతలు చేపట్టింది. చెరువు హద్దుల్లో నిర్మాణాలు ఉండరాదంటూ కొత్తగా నిర్మిస్తున్న కొన్ని ఇండ్లను, అక్కడ వ్యాపారాలు చేసుకోరాదంటూ కొన్ని షెడ్లను సమూలంగా నేలమట్టం చేసింది. అన్నిరకాల అనుమతులు తీసుకున్నామని, రూ.లక్షలు ఖర్చుచేసి మూడు నాలుగు అంతస్తుల వరకు కట్టుకున్నామని ఆ భవన యజమానులు మొరపెట్టుకున్నా హైడ్రా అధికారులు వినలేదు. అనుమతి పత్రాలను చూపించే ప్రయత్నం చేసినా పట్టించుకోలేదు. సరిగ్గా సంవత్సరం తర్వాత 2025 సెప్టెంబర్‌లో ఒక భవన యజమానికి హైడ్రా ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ నుంచి 'నో ఇష్యూ.. ప్లీజ్ గో ఎహెడ్ సార్' అంటూ మెసేజ్ వచ్చింది. దీనిపై స్పందించిన ఆ యజమాని హైడ్రా కార్యాలయం చుట్టూ తిరుగుతూ, మున్సిపాలిటీలో అధికారులను కలుస్తూ విశ్వ ప్రయత్నాలు చేయగా, నెలల తర్వాత హైడ్రా అధికారులు 'మళ్లీ ఇల్లు కట్టుకోవడానికి తమకు అభ్యంతరం లేదు' అని చెప్పారని వాపోయారు. భవనం కూల్చేసే సమయంలో తాము అన్ని పర్మిషన్లు చూపించినా వినలేదని, రెండుమూడు సార్లు కమిషనర్ రంగనాథ్‌ను కూడా కలిశామని వారు పేర్కొన్నారు. చివరికి తమ ఏరియాకు సంబంధించిన హైడ్రా ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌ను సంప్రదిస్తే తనకు తెలియకుండానే ఇల్లు కూల్చేశారని, సున్నంచెరువు దగ్గర కూల్చివేతల్లో తప్పు జరిగిందని ఆయన చెప్పారట. మీరు మళ్లీ కట్టుకున్నా తమకు అభ్యంతరం లేదని, ఈ విషయంలో మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అభ్యంతరం రాకపోతే చాలని చెప్పారంటూ భవన యజమానులు తెలిపారు. హైడ్రా అనుమతి అనంతరం తాము మళ్లీ నిర్మాణ పనులు ప్రారంభించామని చెప్తున్నారు. అయితే హైడ్రా తప్పుడు కూల్చివేతల కారణంగా తమకు రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇదే విషయంపై హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసినప్పుడు ఆయన నష్టపరిహారం కోసం కోర్టుకు వెళ్లాలని సలహా ఇచ్చారన్నారు. ప్రస్తుతం తమకు భవనం పూర్తి కావడమే ముఖ్యమని, తాము కోర్టుకెళ్లడం లేదని ఆ భవన యజమాని తెలిపారు. రెండురోజుల కిందట కూడా హైడ్రా సిబ్బంది తమ భవనం నుంచే కరెంట్ తీసుకున్నారని పేర్కొన్నారు.

స్నేహితుడి కోసం అలైన్‌మెంట్ మార్పు?

సున్నంచెరువు విషయంలో హైడ్రా చేస్తున్న హద్దుల నిర్ధారణే తప్పుల తడకగా ఉన్నదని సియేట్ కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. సున్నం చెరువుకు సంబంధంలేని తమ ప్లాట్ల విషయంలో హైడ్రా చర్యలపై కేసు నడుస్తున్నదని తెలిపారు. హైకోర్టు ఇచ్చిన తీర్పునకు విరుద్ధంగా హైడ్రా తమ ప్లాట్లలో ఫెన్సింగ్ వేసిందని బాధితులు తెలిపారు. ఒక ప్లాట్‌కు సంబంధించి హైడ్రా ఏకంగా అలైన్‌మెంట్‌నే మార్చేసిందని ఆరోపిస్తున్నారు. ఆ ప్లాట్ దగ్గర గతంలో హైడ్రా తవ్వకాలు చేపట్టిందని, కొన్ని రోజులకు అలైన్‌మెంట్ మార్చి కొంచెం ముందుకు తీసుకొచ్చిందని చెప్తున్నారు. ఇందుకు ప్రధాన కారణం ఆ ప్లాట్ యజమానికి, హైడ్రా ఉన్నతాధికారికి మధ్య ఉన్న స్నేహమే అని అనుమానిస్తున్నారు. రోజూ హైడ్రా ఉన్నతాధికారి, ప్లాట్ యజమాని కలిసి వాకింగ్‌కు వెళ్తారని చెప్తున్నారు. అంతేగాకుండా ఆ అధికారి గతంలో రిజిస్ట్రేషన్ శాఖలో ఉన్నతాధికారిగా పనిచేసి రిటైర్ అయ్యారని, అందుకే ఆయనకు హైడ్రా మినహాయింపు ఇచ్చిందని సియేట్ కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. సున్నం చెరువుకు సంబంధించిన ఎఫ్టీఎల్, బఫర్ జోన్లను హైడ్రా ఎలా నిర్ధారిస్తుందని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై హైడ్రా ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌ను 'నమస్తే తెలంగాణ' ప్రతినిధి సంప్రదించగా.. కూల్చివేసిన చోట మళ్లీ నిర్మాణాలు ఎలా చేపడుతారని ఎదురు ప్రశ్నించారు. తమ సిబ్బందిని అప్రమత్తం చేస్తామని పేర్కొన్నారు.



2025 సెప్టెంబర్ నెల.. గతంలో తాము కూల్చేసిన ఓ ఇంటి యజమానికి హైడ్రా ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ ఒక మెసేజ్ పంపారు. 'నో ఇష్యూ.. ప్లీజ్ గో ఎహెడ్ సార్' అంటూ సందేశం పంపించారు. అంటే మీ భవనాన్ని మేము పొరబాటున కూల్చేశాం. మీరు మళ్లీ అదే స్థలంలో ఇల్లు కట్టుకోవచ్చు అని చెప్పారు.



మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గాంధీనగర్‌లో వర్షానికి తడిసిన ధాన్యం బస్తాలు

అకాల వర్షం.. అపార నష్టం

- కొనుగోలు కేంద్రాల్లో తడిసి ముద్దయిన ధాన్యం, మక్కలు
- వరంగల్ ఉమ్మడి జిల్లాలో రైతులకు తీరని నష్టం

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, మే 8: అకాల వర్షానికి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు మండలాల్లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం, మక్కలు తడిసి ముద్దయ్యాయి. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ ఏజెన్సీలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి గాంధీనగర్‌లోని కొనుగోలు కేంద్రంలో నిల్వ చేసిన 40 వేల బస్తాల ధాన్యం తడిసిపోయింది. వరంగల్ జిల్లా నర్సంపేట వ్యవసాయ మార్కెట్‌లో ఆరబోసిన మక్కలు నీటిపాలయ్యాయి. దీంతో పలు గ్రామాల నుంచి మార్కెట్‌కు మక్కలు తెచ్చిన రైతులు కన్నీరుమున్నీరుగా విలపించారు. తడిసిన మక్కలు, ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. చెన్నారావుపేట మండలం తిమ్మరాయిన్‌పహాడ్ కొనుగోలు కేంద్రంలోని వడ్లు నీటిపాలయ్యాయి. ఎల్లాయగూడెం తండా బోడ రవికి చెందిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఆరబోయగా కొట్టుకుపోయింది. నెక్కొండ మండల కేంద్రంలోని పనికర గుట్ట ప్రాంతంలో ఆరబోసిన మక్కలు నీటిలో తడిసిపోయాయి. ములుగు జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఏటూరునాగారం మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అన్నపురెడ్డిపల్లి, అశ్వారావుపేట, బూర్గంపహాడ్, పాల్వంచ, దమ్మపేట తదితర మండలాల్లో వర్షం కురిసింది. దీంతో ఆయా గ్రామాల్లో ధాన్యం, మక్క బస్తాలు తడిసిపోయాయి. కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం, మొక్కజొన్నను కాపాడుకునేందుకు రైతులు నానా పాట్లు పడ్డారు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని టార్పాలిన్లతో కప్పి భద్రపరుచుకున్న రైతులు



వరంగల్ జిల్లా నర్సంపేట మార్కెట్‌లో తడిచిన మక్కలను చూపుతున్న రైతులు

బెంగాల్ సీఎంగా సువేందు అధికారి

- ప్రకటించిన అమిత్ షా
- నేడు ప్రమాణ స్వీకారం



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ తదుపరి సీఎంగా బీజేపీ నాయకుడు సువేందు అధికారి నియమితులయ్యారు. పశ్చిమ బెంగాల్‌లో ఏర్పడిన తొలి బీజేపీ ప్రభుత్వానికి సారథిగా ఆయన నిలువనున్నారు. బీజేపీ శాసనసభాపక్ష నాయకుడిగా సువేందు అధికారి ఎన్నికైనట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. కోల్‌కతాలో జరిగిన బీజేపీ సమావేశంలో అమిత్ షా మాట్లాడుతూ నేటి విజయం అనేక కోణాల నుంచి అత్యంత ముఖ్యమైనదని, వందేండ్ల సైద్ధాంతిక ప్రయాణం తర్వాత ఈరోజు గంగోత్రి నుంచి గంగాసాగర్ వరకు ప్రతిచోటా బీజేపీ ప్రభుత్వాలు ఏర్పడ్డాయని అన్నారు.

నేడు ప్రమాణం

కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్, కేంద్ర మంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమక్షంలో బెంగాల్‌లో కొత్త బీజేపీ ప్రభుత్వం ప్రమాణం చేయనున్నది. బెంగాల్ ప్రభుత్వం అధికారిక ఏర్పాటు ప్రక్రియకు ముందు లోక్‌భవన్ వద్ద సన్నాహాలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతి కోరుతూ సువేందు అధికారి గవర్నర్‌ను కలిశారు. బెంగాల్ ఎన్నికల ప్రచారంలో స్థానిక పుత్రుడినే ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటామని బీజేపీ నాయకులు పదేపదే ప్రకటించిన నేపథ్యంలో ఎన్నికల్లో బీజేపీ గెలుపొందిన తర్వాత సువేందు అధికారి పేరే ముఖ్యమంత్రి ఎంపికలో ముందుగా తెరపైకి వచ్చింది.

కేరళ సీఎం రేసులో కేసీ వేణుగోపాల్ ముందంజ

తిరువనంతపురం: కేరళ ముఖ్యమంత్రి రేసులో కేసీ వేణుగోపాల్ ముందంజలో ఉన్నారు. పార్టీ పరిశీలకులు అజయ్ మాకెన్, ముకుల్ వాస్నిక్‌లు తమ రిపోర్టును పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు సమర్పించిన దరిమిలా ఈ విషయం వెల్లడయ్యింది. ఈ సందర్భంగా అజయ్ మాకెన్, ముకుల్ వాస్నిక్ మాట్లాడుతూ సీఎం ఎంపిక అనేది నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేలు, కూటమిలోని నేతలు, ప్రజాభిప్రాయం మొదలైన వాటిపై ఆధారపడి ఉంటుందన్నారు. పార్టీ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం అతి త్వరలోనే కాంగ్రెస్ అధిష్ఠానం సీఎం పేరును వెల్లడించనుంది. కాగా వేణుగోపాల్ కేరళ సీఎం రేసులో ముందున్నారు. ఈ జాబితాలో అసెంబ్లీలో ప్రతిపక్ష నేత వీడీ సతీశన్, మరో సీనియర్ నేత రమేశ్ చెన్నితల ఉన్నారు. కాగా 63 ఏండ్ల వేణుగోపాల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి. అలప్పుజ ఎంపీ. ఒకవేళ వేణుగోపాల్ ముఖ్యమంత్రి పదవికి ఎన్నికైతే, తన ఎంపీ పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. కాగా వచ్చే సోమవారం (మే 11) న కేరళ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారోత్సవం జరిగే అవకాశం ఉంది. ఈ కార్యక్రమానికి పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, హాజరయ్యే అవకాశాలున్నాయి.

13న సీఎంగా రంగస్వామి ప్రమాణం

పుదుచ్చేరి, మే 8: పుదుచ్చేరిలో విజయం సాధించిన ఏఐఎన్‌ఆర్‌సీ చీఫ్, ఎన్డీఏ నేత ఎన్ రంగస్వామి లెఫ్టినెంట్ గవర్నర్ కే కైలాస్‌నాథన్‌ను శుక్రవారం కలిశారు. తనకు మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్యేల సంతకాలతో కూడిన పత్రాన్ని ఎల్జీకి సమర్పించి రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం కల్పించాలని కోరారు. రంగస్వామితో పాటు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఆయనకు మద్దతు తెలిపిన పార్టీల ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు సమర్పించిన పత్రాన్ని రాష్ట్రపతి అనుమతి కోసం పంపనున్నట్టు ఎల్జీ ప్రకటించారు. కాగా, ఎల్జీ కార్యాలయం అందించిన సమాచారం ప్రకారం ఈ నెల 13న రంగస్వామి ఐదోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. 30 మంది సభ్యులున్న కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలో రంగస్వామి ఏఐఎన్‌ఆర్‌సీ పార్టీ 16 స్థానాల్లో పోటీ చేసి 12 స్థానాల్లో విజయం సాధించింది. దాని మిత్రపక్షం నాలుగు సీట్లను గెల్చుకుంది.

ఎడతెగని హైడ్రామా

- తమిళ నాట తొలగని అనిశ్చితి
- కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై పూటకో నాటకీయ మలుపు
- 116 మంది సంతకాలతో గవర్నర్‌కు విజయ్ లేఖ!
- మరో నలుగురి ఎమ్మెల్యేల మద్దతున్నట్లు మౌఖికంగా వెల్లడి
- మెజారిటీ చూపితేనే ప్రమాణంపై గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్ ప్రకటన
- టీవీకేకు కాంగ్రెస్, లెఫ్ట్ మద్దతు..
- వీసీకే మద్దతుపై అస్పష్టత.. ఐయూఎంఎల్ యూటర్న్



చెన్నై, మే 8: తమిళనాడు రాజకీయం గంటకో మలుపు తిరుగుతున్నది. కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై హైడ్రామా కొనసాగుతున్నది. శనివారం ఉదయం ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయడానికి టీవీకే అధినేత విజయ్ ఏర్పాట్లు చేసుకుంటున్న క్రమంలో శుక్రవారం రాత్రి ఊహించని ట్విస్ట్ ఎదురైంది. విడుతలై చిరుతైగళ్ కట్చి(వీసీకే) నుంచి మద్దతు లేఖ అందకపోవడంతో ప్రమాణ స్వీకారంపై గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. వీసీకే లేఖ కోసం గవర్నర్ ఎదురుచూస్తున్నారని లోక్‌భవన్ వర్గాలు తెలిపాయి. అంతకుముందు గవర్నర్‌ను మూడోసారి కలిసిన విజయ్.. 116 మంది ఎమ్మెల్యేల సంతకాలతో కూడిన మద్దతు లేఖను అందజేశారు. 234 స్థానాలున్న శాసనసభలో ప్రభుత్వ ఏర్పాటుకు 118 మంది సభ్యుల మద్దతు అవసరం. వీసీకే, ఐయూఎంఎల్ టీవీకేకు మద్దతు తెలిపాయని, దీంతో టీవీకే బలం 120కు చేరుకుందని, శనివారం ఉదయం 11 గంటలకు విజయ్ సీఎంగా ప్రమాణం చేస్తారని అంతకుముందు మీడియాలో కథనాలు వెలువడ్డాయి.

వీసీకే మద్దతుపై ఉత్కంఠ

టీవీకేకు మద్దతుపై శనివారం తమ నిర్ణయం ప్రకటిస్తామని వీసీకే శుక్రవారం రాత్రి ప్రకటించింది. లోక్‌భవన్ వర్గాల కథనం ప్రకారం శుక్రవారం సాయంత్రం గవర్నర్‌ను కలసిన విజయ్ 116 మంది ఎమ్మెల్యేలు ఇచ్చిన మద్దతు సంతకాలను సమర్పించారు. అయితే వీసీకే, ఐయూఎంఎల్‌కు చెందిన అధికారిక లేఖలను సమర్పించలేదు. ఆ లేఖలను కొద్ది సేపట్లో సమర్పిస్తానని విజయ్ చెప్పినట్లు సమాచారం. మిగిలిన మద్దతు లేఖలు అందిన వెంటనే ప్రమాణ స్వీకారం గురించి గవర్నర్ కార్యాలయం అధికారిక ప్రకటన విడుదల చేస్తుందని ఆ వర్గాలు చెప్పాయి. అయితే టీవీకేకు తాము మద్దతు ఇవ్వడం లేదంటూ ఐయూఎంఎల్ రాత్రి ఒక ప్రకటన విడుదల చేసింది. డీఎంకే సారథ్యంలోని కూటమితోనే కొనసాగుతామని ఐయూఎంఎల్ ప్రకటించింది. వీసీకే తన మద్దతు లేఖను మెయిల్ ద్వారా టీవీకేకు పంపినట్లు వార్తలు వచ్చినప్పటికీ అది నిజం కాదని ఆ పార్టీ స్పష్టం చేసింది. ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించి విజయ్‌కు గవర్నర్ ఈ నెల 10వ తేదీ వరకు గడువు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతున్నది. ఇదిలా ఉంటే, ఏఎంఎంకేకు చెందిన టీటీవీ దినకరన్ శుక్రవారం రాత్రి గవర్నర్‌ను కలుసుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఏఐఏడీఎంకేను ఆహ్వానించాలని అర్థించారు. కేవలం ఒకే ఒక ఎమ్మెల్యే ఉన్న తన పార్టీ తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటుకు ఏఐఏడీఎంకే నాయకుడు ఎడప్పాడి కే పళనిస్వామిని బలపరుస్తున్నట్లు దినకరన్ గవర్నర్‌కు తెలిపారు.

తాత్సారంపై ఆగ్రహం

బీజేపీ నేతృత్వంలోని కేంద్రం దొడ్డిదారి ద్వారా గవర్నర్ పాలనను తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నదని విపక్ష పార్టీలు ఆరోపించాయి. శుక్రవారం తెరవెనుక టీవీకే నేతృత్వంలోని కూటమికి మద్దతు కూడగట్టేందుకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్వయంగా వీసీకే అధినేత తోల్ తిరుమావళవన్‌తో మాట్లాడటంతో చెన్నై వ్యాప్తంగా తీవ్రమైన చర్చలు జరిగాయి. ఆ వెంటనే, సీపీఐ వర్కింగ్ కమిటీ, సీపీఎం రాష్ట్ర నాయకత్వం కూడా విజయ్‌కు మద్దతు ప్రకటించడంతో అసెంబ్లీలో సమీకరణాలు నాటకీయంగా మారిపోయాయి. తదుపరి ప్రభుత్వాన్ని ఎవరు ఏర్పాటు చేస్తారనే అనిశ్చితికి తెరపడే అవకాశం ఏర్పడింది.

విజయ్ తీరుపై అసహనం

తమిళనాడు రాజకీయాలను అస్థిరపరిచేందుకు గవర్నర్ కార్యాలయాన్ని ఉపయోగించుకోవడానికి బీజేపీ ప్రయత్నిస్తున్నదని వీసీకే నాయకుడు సింథనై సెల్వన్ ఆరోపించారు. ప్రజాస్వామ్య నియమాలు ప్రమాదంలో ఉన్నాయని ఆయన హెచ్చరించారు. అదే సమయంలో ఎన్నికల అనంతర పరిస్థితిని విజయ్ నిర్వహించిన తీరును ఆయన బహిరంగంగా విమర్శిస్తూ ఫలితాలు వెలువడిన వెంటనే టీవీకే అధినేత కూటమి భాగస్వాములను వ్యక్తిగతంగా ఎందుకు సంప్రదించలేదని ప్రశ్నించారు. మద్దతు కోరుతూ వాట్సాప్ సందేశం పంపి ఆ తర్వాత స్పందించండి అని చెప్పడాన్ని మనం ఎలా అర్థం చేసుకోవాలి?" అని సెల్వన్ ప్రశ్నించారు.

విజయ్‌తో చేతులు కలపడం అనైతికం

కాంగ్రెస్‌పై ఆ పార్టీ సీనియర్ నేత మణి శంకర్ అయ్యర్ విమర్శ



న్యూఢిల్లీ: చిరకాలంగా మిత్రపక్షంగా ఉన్న డీఎంకేను ఎన్నికలైన వెంటనే వీడిన కాంగ్రెస్ వైఖరిని అదే పార్టీకి చెందిన సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి మణి శంకర్ అయ్యర్ తీవ్రంగా తప్పుబట్టారు. అది అనైతిక చర్యగా విమర్శించిన ఆయన నీచపరమైన స్వార్థపరత్వాన్ని తలపించిందని వ్యాఖ్యానించారు. విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీకి కాంగ్రెస్ మద్దతు తెలపడాన్ని ఆయన తప్పుబడుతూ స్వరాజ్యం అనేది నైతికతపై ఆధారపడిన ప్రభుత్వమై ఉండాలన్న మహాత్మా గాంధీ 1925 నాటి సూత్రాన్ని హస్తం పార్టీ ఉల్లంఘించిందని అన్నారు. తాము టీవీకేలో చేరిన వెంటనే ఇతర చిన్న పార్టీలు కూడా తమలా టీవీకేలోకి వస్తాయని కాంగ్రెస్ వేసిన అంచనా విఫలమైందని, అందుకే టీవీకే ఇంతవరకు పూర్తి మెజారిటీని సాధించలేక పోతున్నదని ఒక ఆర్టికల్‌లో ఆయన విమర్శించారు. 'తమిళనాడులో కాంగ్రెస్ ఐదు సీట్లను గెల్చుకుంది. అదీ సొంత బలంపై కాదు. దశాబ్దాలుగా తోడుగా ఉన్న డీఎంకే భాగస్వామ్యం అండతోనే' అని ఆయన స్పష్టం చేశారు. విజయ్‌తో చేరడం ద్వారా అనైతికతకు పాల్పడటమే కాక, ఆయనకు మెజారిటీ ఉండేలా చూడకపోవడం అనే రాజకీయ మూర్ఖత్వానికి పాల్పడ్డామని పేర్కొన్నారు.

ఏకైక అతిపెద్ద పార్టీకే అవకాశం ఇవ్వాలి

తమిళనాడులో విజయ్ పార్టీని ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానించాలి

- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్



హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): తమిళనాడులో అత్యధిక స్థానాలు సాధించిన ఏకైక అతిపెద్ద పార్టీని ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానించాలని, ఈ విషయంలో జాప్యం చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ తెలిపారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం నెలకొన్న రాజకీయ ప్రతిష్టంభనపై శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తమిళనాడులో నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీకి ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మెజారిటీ అనేది అసెంబ్లీలోనే తేలాలని, గవర్నర్ బంగ్లాలో ఎమ్మెల్యేల పరేడ్ అవసరం లేదని సుప్రీంకోర్టు ఎస్సార్ బొమ్మై కేసులో స్పష్టంగా చెప్పిందని ఆయన గుర్తు చేశారు. 1996లో అటల్ బిహారీ వాజపేయికి మెజారిటీ లేకపోయినా అత్యధిక సీట్లు సాధించిన పార్టీగా అప్పటి రాష్ట్రపతి వారిని ఆహ్వానించారని, మెజారిటీ నిరూపించుకోవడానికి 13 రోజుల సమయం ఇచ్చారని తెలిపారు. 2014లో మహారాష్ట్రలో బీజేపీకి 22 సీట్లు తక్కువ వచ్చినప్పటికీ, అప్పటి గవర్నర్ విద్యాసాగర్‌రావు ఫడ్నవీస్‌ను ప్రభుత్వం ఏర్పాటుకు పిలిచిన విషయాన్ని ఆయన ఉటంకించారు.

కాంగ్రెస్ వెన్నుపోట్లతో!

కూటమికి బీటలు

- మంత్రి పదవుల కోసం డీఎంకేతో 55 ఏండ్ల దోస్తీకి కాంగ్రెస్ గుడ్‌బై
- మోసగాళ్లతో ఉండలేమని 'ఇండియా' నుంచి డీఎంకే ఎగ్జిట్
- పార్లమెంట్‌లో మరో చోట సీట్లు కేటాయించాలంటూ స్పీకర్‌కు విజ్ఞప్తి
- తమిళ నాడులో కాంగ్రెస్ నేతలను పరిగెత్తించి కొట్టిన డీఎంకే నేతలు
- కాంగ్రెస్ వెన్నుపోటు వైఖరిపై ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ ధ్వజం
- కష్టాల్లో మిత్రులను విడిచిపెట్టే వాళ్లం కాదని పరోక్షంగా చురకలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)



హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): మంత్రి పదవుల కోసం 55 ఏండ్లుగా తమతో కొనసాగుతున్న డీఎంకేను కాంగ్రెస్ వెన్నుపోటు పొడించింది. దీంతో ఇలాంటి నమ్మకద్రోహి నేతృత్వం వహిస్తున్న కూటమిలో మిత్రపక్షాలుగా కొనసాగబోమని డీఎంకే తన అసమ్మతిని తెలియజేసింది. కష్టాల్లో ఉన్నప్పుడు మిత్రులను విడిచిపెట్టడం కరెక్ట్ కాదంటూ మరో మిత్రపక్షం సమాజ్‌వాదీ పార్టీ హస్తానికి మొట్టికాయలు వేసింది. తాము ఓడితే సంబురాలు ఎలా చేసుకొంటారని తృణమూల్ కన్నెర్రజేస్తున్నది. మొత్తంగా కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి ఇప్పుడు బీటలువారుతున్నది. హస్తం పార్టీ ఒంటరవుతున్నది.

డీఎంకే అవుట్

మంత్రి పదవుల కోసం తమిళనాడులోని నటుడు విజయ్‌కు చెందిన టీవీకే పార్టీకి బుధవారం కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది. దీని కోసం డీఎంకేతో 55 ఏండ్లుగా కొనసాగుతున్న సుదీర్ఘ పొత్తుకు గుడ్‌బై చెప్పింది. కాంగ్రెస్ తాజా నిర్ణయంపై డీఎంకే మండిపడింది. వెన్నుపోటు రాజకీయాలకు తెరలేపిన కాంగ్రెస్‌తో ఇకపై కలిసి నడువబోమని తేల్చిచెప్పింది. ఆ పార్టీ నేతృత్వం వహిస్తున్న ఇండియా కూటమి నుంచి వైదొలుగుతున్నట్టు శుక్రవారం ప్రకటించింది. దీంతో కాంగ్రెస్‌తో తమ పొత్తు ముగిసిపోయిందని స్పష్టం చేసింది. కాంగ్రెస్ ఎంపీల పక్కన కూడా తాము ఇకపై కూర్చోబోమని, తమకు లోక్‌సభలో ప్రత్యేక సీట్లు కేటాయించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు డీఎంకే ఎంపీ కనిమొళి లేఖ రాశారు. మరోవైపు, ప్రభుత్వ ఏర్పాటుకు విజయ్‌ను ఆహ్వానించకుండా గవర్నర్ ఉద్దేశపూర్వకంగానే తాత్సారం చేస్తున్నారంటూ మయిలాదుతురైలో కాంగ్రెస్ శ్రేణులు నిరసనకు దిగాయి. అయితే, తమతో పొత్తులో ఉంటూ టీవీకేకు మద్దతు ప్రకటించిన కాంగ్రెస్‌పై అప్పటికే గుర్రుగా ఉన్న డీఎంకే కార్యకర్తలు తాజా ఆందోళనలపై భగ్గుమన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలను రోడ్ల మీద పరిగెత్తించి దాడులు చేశారు. కాంగ్రెస్ వెన్నుపోటుదారుల పార్టీ అంటూ నినాదాలు చేశారు.

అఖిలేశ్ మండిపాటు

డీఎంకేతో పొత్తును కాంగ్రెస్ వదులుకోవడాన్ని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ తప్పుబట్టారు. కష్ట సమయాల్లో మిత్రులను విడిచిపెట్టి వెళ్లే వాళ్లం తాము కాదంటూ పరోక్షంగా కాంగ్రెస్‌కు చురకలు అంటించారు. అంతేకాకుండా, ఇటీవల తమిళనాడు, బెంగాల్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో అధికారాన్ని కోల్పోయిన డీఎంకే అధినేత స్టాలిన్, టీఎంసీ చీఫ్ మమతా బెనర్జీని స్వయంగా కలిసిన అఖిలేశ్ వారికి సంఘీభావం ప్రకటించారు. ఆ ఫొటోలను ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దీంతో కాంగ్రెస్ వైఖరిపై అసహనంతో ఉన్న ఎస్పీ.. ఇండియా కూటమిలో కొనసాగడం కష్టమేనంటూ రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

పునరాలోచనలో టీఎంసీ

మొన్నటి బెంగాల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మమత ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు కురిపించారు. ఆ ఎన్నికల్లో టీఎంసీ పరాజయం పాలైతే కాంగ్రెస్ నేతలు సంబురాలు చేసుకొన్నారు. దీనిపై మమత గుర్రుగా ఉన్నట్టు వార్తలు వస్తున్నాయి. ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్న టీఎంసీపై కాంగ్రెస్ నేతల వైఖరిని మమత పరివారం తప్పుబడుతున్నట్టు తెలుస్తున్నది. త్వరలోనే ఇండి కూటమిలో కొనసాగడంపై టీఎంసీ ఓ కీలక నిర్ణయం తీసుకొనే అవకాశం లేకపోలేదని విశ్లేషకులు చెబుతున్నారు.

ఆప్ బాటలోనే మిగతా పక్షాలు

తాము నేతృత్వం వహిస్తున్న ఇండియా కూటమిలోని మిత్ర పక్షాలపై కూడా ఎన్నికల సమయంలో కాంగ్రెస్ డైరెక్టుగా యుద్ధాన్ని ప్రకటించింది. రాష్ట్రాల ఎన్నికల సాకుతో మిత్ర పక్షాలను రాజకీయంగా దెబ్బతీయడం కాంగ్రెస్‌కు రివాజుగా మారింది. ఇండియా కూటమిలోనే భాగస్వామ్య పక్షాలుగా ఉన్న లెఫ్ట్ పార్టీలపై కాంగ్రెస్ తీరు ఇలాగే ఉందనడానికి ఇటీవలి కేరళ ఎన్నికలే సరైన ఉదాహరణగా చెప్పొచ్చు. ప్రభుత్వ ఏర్పాటుకు తెలంగాణలో లెఫ్ట్ పార్టీల మద్దతును కూడగట్టిన కాంగ్రెస్.. కేరళలో మాత్రం అదే వామపక్షాలపై కత్తులు దూసింది. విజయన్ ప్రభుత్వంపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సహా కాంగ్రెస్ అధినాయకత్వంలోని పెద్దలు అందరూ నోరుపారేసుకొన్నారు. ఇక, పంజాబ్, ఢిల్లీ ఎన్నికల్లో ఇండియా కూటమిలో గతంలో మిత్రపక్షంగా ఉన్న ఆమ్‌ఆద్మీ పార్టీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ అభ్యర్థులను నిలబెట్టింది. దీంతో కాంగ్రెస్ వైఖరిని తప్పుబడుతూ ఇండియా కూటమి నుంచి నిరుడు ఆప్ బయటకు వచ్చింది. ఇప్పుడు మిగతా మిత్రపక్షాలు కూడా ఆప్ దారిలోనే నడుస్తూ.. ఇండియా కూటమికి గుడ్‌బై చెప్పే అవకాశమున్నదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

హోర్ముజ్‌లో భారత నౌకపై కాల్పులు

- ఒకరు మృతి.. సురక్షితంగా బయటపడ్డ 17 మంది సిబ్బంది
- అమెరికా-ఇరాన్ కాల్పుల మధ్య చిక్కుకుని మునిగి పోయిన కార్గో షిప్



పీఎస్‌వీ ప్రేమ్ సాగర్-1 నౌకలో దిగులుగా కనిపిస్తున్న సిబ్బంది

వాషింగ్టన్: ఇరాన్ చర్చలకు దిగి వచ్చిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన కొద్ది గంటలకే రెండు దేశాల మధ్య మళ్లీ ఉద్రిక్తతలు ప్రారంభమయ్యాయి. హోర్ముజ్ జలసంధిలోని మూడు అమెరికా యుద్ధ నౌకలపై ఇరాన్ డ్రోన్లతో విరుచుకుపడింది. జలసంధిలో గస్తీ కాస్తున్న నౌకలపై దాడులు చేసింది. రెండు దేశాల పరస్పర దాడుల్లో భారత్‌కు చెందిన ఒక సరుకు రవాణా నౌక గురువారం రాత్రి హోర్ముజ్ జలసంధి వద్ద మునిగిపోయింది. ఈ ఘటనలో ఒక భారతీయుడు మరణించాడు. గుజరాత్‌లోని ద్వారకా జిల్లా సాలయకు చెందిన ఈ రవాణా నౌకలో ఇంజిన్ రూమ్‌లో పని చేస్తున్న అల్తాఫ్ తలాబ్ కేర్ ఈ ప్రమాదంలో మరణించగా, మిగిలిన 17 మంది నౌకా సిబ్బందిని రక్షించారు. ఈ విషయాన్ని ఇండియన్ సెయిలింగ్ వెస్సల్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆడమ్ భాయ్ వెల్లడించారు.

యెమెన్‌కు వెళ్తుండగా..

ఎంఎస్‌వీ అల్ ఫైజ్ నూర్ సులేమనీ-1 అనే ఈ రవాణా నౌక సరుకుతో దుబాయ్ నుంచి యెమెన్‌లోని ముకాలియా పోర్టుకు వెళ్తున్నది. ఆ సమయంలో నౌకలో ఒక గన్‌మేన్ సహా 18 మంది సిబ్బంది ఉన్నారు. గురువారం రాత్రి ఒంటి గంటకు హోర్ముజ్ జలసంధి మీదుగా వెళ్తుండగా హఠాత్తుగా ఇరాన్-అమెరికా నావికా దళాల మధ్య కాల్పులు మొదలయ్యాయి. ఆ కాల్పుల మధ్య ఈ నౌక చిక్కుకుపోయి తీవ్రంగా దెబ్బతింది. దీంతో నౌక మునిగిపోవడం ప్రారంభించింది. దీంతో నౌకలోని సిబ్బంది తమను తాము రక్షించుకోవడానికి ప్రయత్నించారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న పీఎస్‌వీ ప్రేమ్ సాగర్-1 అనే నౌక సిబ్బంది ఇందులోని 17 మందిని రక్షించారు. ఈ దాడిలో ఇంజిన్ రూమ్‌లో ఉన్న అల్తాఫ్ తలబ్ కేర్ తీవ్రంగా గాయపడి అక్కడే మరణించాడు. రక్షించిన వారినందరినీ శుక్రవారం సాయంత్రం నాటికి దుబాయ్ పోర్టుకు చేర్చారు.

ఇరాన్‌పై ప్రతి దాడి

యూఎస్ యుద్ధ నౌకలపై ఇరాన్ దాడి అనంతరం ఇరాన్‌లోని క్షిపణి లాంచ్ సైట్లు, కమాండ్ సెంటర్లపై అమెరికా దాడులు చేసింది. హోర్ముజ్ జలసంధిలో మూడు రక్షక దళ నౌకలపై జరిగిన దాడులను తాము తిప్పికొట్టామని, ఇరాన్ సైనిక స్థావరాలపై ప్రతీకారం తీర్చుకున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం ట్రూత్ సోషల్‌లో ప్రకటించారు. ఇది జరిగిన కొన్ని గంటల తర్వాత తమపై క్షిపణి దాడులు జరిగినట్టు యూఏఈ తెలిపింది.

రేప్, పోక్సో కేసుల్లో దోషులకు పెరోల్ నిషేధం!

త్వరలో కేంద్రానికి ఎన్‌సీడబ్ల్యూ సిఫారసులు

న్యూఢిల్లీ, మే 8: మహిళలు, పిల్లలపై అత్యాచారం, తీవ్రమైన లైంగిక దాడి, ఇతర తీవ్రమైన నేరాలకు పాల్పడిన దోషులకు పెరోల్‌పై పూర్తి నిషేధం విధించాలని కోరుతూ జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) త్వరలో కేంద్రానికి సిఫారసులు సమర్పిస్తుందని కమిషన్ చైర్‌పర్సన్ విజయ రహత్కర్ శుక్రవారం తెలిపారు. మహారాష్ట్రలోని పుణె జిల్లాలో ఇటీవల జరిగిన లైంగిక దాడి కేసు నేపథ్యంలో కమిషన్ ఈ నిర్ణయం తీసుకుంది. మహిళలు, పిల్లలపై ఘోరమైన నేరాలకు పాల్పడిన దోషులకు ప్రస్తుత పెరోల్ విధానంపై కమిషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

పుతిన్ హత్యకు కుట్ర!

బంకర్లలోనే రష్యా అధ్యక్షుడు

మాస్కో, మే 8: ప్రస్తుతం ఉక్రెయిన్‌తో యుద్ధం జరుగుతున్న క్రమంలో హత్యాయత్నాలు, డ్రోన్ దాడులు జరిగే అవకాశం ఉందని హెచ్చరికలు రావడంతో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు ప్రాణభయం పట్టుకుంది. దీంతో అధికారులు ఆయన భద్రతను మరింత పటిష్ఠం చేశారు. ఆయన భద్రతా చర్యలను పెంచడమే కాక, బహిరంగంగా పాల్గొనే కార్యక్రమాలను గణనీయంగా తగ్గించారు. పలు ముందస్తు రక్షణ చర్యలు కూడా చేపట్టారని ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక వెల్లడించింది. ప్రస్తుతం పుతిన్ అండర్ గ్రౌండ్ బంకర్లలోనే ఎక్కువ కాలం గడుపుతున్నారని ఆ పత్రికా కథనం వెల్లడించింది. ఇటీవల రష్యా వైమానిక స్థావరాలు లక్ష్యంగా ఉక్రెయిన్ డ్రోన్ దాడులు చేయడంతో క్రెమ్లిన్ మరింత అప్రమత్తమైంది.

క్లౌడ్ ఫ్లేర్‌లో 1,100 కొలువుల కోత

న్యూఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) ఆధారంగా వ్యాపారాన్ని పునర్వ్యవస్థీకరిస్తున్నందున 1,100 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్టు సైబర్ భద్రత కంపెనీ క్లౌడ్‌ఫ్లేర్ గురువారం వెల్లడించింది. కంపెనీ త్రైమాసిక నివేదిక గురువారం వెలువడిన తర్వాత ఆ కంపెనీ షేర్లు భారీగా పడిపోయి 14 శాతానికి పైగా నష్టపోయాయి. వెంటనే కంపెనీ యాజమాన్యం ఉద్యోగుల తొలగింపు నిర్ణయాన్ని ప్రకటించింది. కంపెనీలో అంతర్గతంగా ఏఐ వినియోగం మూడు నెల్లలోనే 600 శాతం పెరిగిందని.. దీంతో హెచ్‌ఆర్, ఇంజినీరింగ్, ఫైనాన్స్, మార్కెటింగ్ విభాగాల్లో ఉద్యోగాలను తొలగిస్తున్నట్టు తెలిపింది. సంస్థను విడిచి వెళ్లేవారికి అత్యుత్తమ ఉద్యోగ విరమణ ప్యాకేజీ అందిస్తామని కంపెనీ వ్యవస్థాపకులు హామీ ఇచ్చారు.

ఇద్దరు భారతీయులకు హంటా వైరస్

న్యూఢిల్లీ: డచ్ నౌక ఎంవీ హోండియస్‌లో హంటా వైరస్ వ్యాప్తి ప్రపంచ దేశాలను కలవరపాటుకు గురి చేస్తున్నది. నౌకలో సిబ్బందిగా ఉన్న ఇద్దరు భారతీయులకు ఈ వైరస్ వ్యాప్తి చెందింది. నౌకలో మొత్తం ఐదుగురికి ఈ వైరస్ వ్యాప్తి చెందిందని.. ఈ వైరస్ వల్ల ఇప్పటివరకు ముగ్గురు మరణించారని బీబీసీ పేర్కొన్నది. ఈ నౌకలో 28 దేశాలకు చెందిన 150 మంది ప్రయాణికులు ఉన్నారు. మరోవైపు వైరస్ వ్యాప్తి నేపథ్యంలో నౌక ప్రయాణం సాగిన 12 దేశాలను ప్రపంచ ఆరోగ్య సంస్థ అప్రమత్తం చేసింది. 'ఇదొక ప్రమాదకర వైరస్. కానీ వైరస్ బారిన పడిన వ్యక్తి మాత్రమే దీని వల్ల అనారోగ్యం పాలవుతాడు' అని ఆ సంస్థ ప్రతినిధి తెలిపారు.

'తారా' ఆయుధ వ్యవస్థ పరీక్ష విజయవంతం

భువనేశ్వర్: దేశీయంగా అభివృద్ధి చేసిన తారా ఆయుధ వ్యవస్థను భారత్ గురువారం విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరంలో ఈ పరీక్ష నిర్వహించారు. భారత రక్షణ సామర్థ్యాన్ని ఈ ఆయుధ వ్యవస్థ మరింత బలోపేతం చేయనుంది. మార్గదర్శకత్వం లేని వార్‌హెడ్‌లను కచ్చితత్వంతో కూడిన గైడెడ్ ఆయుధాలుగా మార్చడానికి అభివృద్ధి చేసిన ఈ ఆయుధ వ్యవస్థను డీఆర్‌డీవో, ఐఏఎఫ్ సంయుక్తంగా పరీక్షించాయి. భూతల లక్ష్యాలను నిర్వీర్యం చేయడానికి తక్కువ ఖర్చుతో కూడిన ఆయుధాల విధ్వంసక శక్తిని, కచ్చితత్వాన్ని మెరుగుపరచడం కోసం ఈ వ్యవస్థను తయారుచేసింది.

తమ దేశంలోని డుకొనొ అగ్ని పర్వతం పేలి ముగ్గురు మృతి చెందారని.. 10 మంది గల్లంతయ్యారని ఇండోనేషియా అధికారులు శుక్రవారం తెలిపారు. అగ్ని పర్వతం నుంచి వెలువడిన బూడిద 10 కిలో మీటర్ల ఎత్తు వరకు ఎగసిందని వారు చెప్పారు. మృతుల్లో ఇద్దరు విదేశీయులున్నారని నార్త్ హల్మహెరా పోలీస్ చీఫ్ సపరిబు తెలిపారు. ఈ ఘటనలో ఐదుగురు పర్వతారోహకులు గాయపడ్డారని విపత్తు నిర్వహణ ఏజెన్సీ తెలిపింది. కఠిన భౌగోళిక పరిస్థితులు, విస్ఫోటం కొనసాగడం వల్ల సహాయక చర్యలకు తీవ్ర సవాళ్లు ఎదురవుతున్నాయని వెల్లడించింది. అగ్ని పర్వత విస్ఫోటం గురించి ముందుగానే తాము హెచ్చరించామని.. అయితే విదేశీయులకు ఈ విషయం తెలియకపోవచ్చని దేశ భూగర్భ శాస్త్ర ఏజెన్సీ తెలిపింది.



ఆపరేషన్ సిందూర్‌లో పాక్‌కు చైనా సహాయం!

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్‌లో తాము ఎలాంటి పాత్ర పోషించ లేదంటూ ఇన్నాళ్లూ బుకాయిస్తూ వచ్చిన చైనా తొలిసారిగా నిజం ఒప్పుకుంది. పాక్‌కు క్షేత్రస్థాయిలో సాంకేతిక సహకారం అందించినట్టు చైనా తొలిసారిగా బహిరంగంగా అంగీకరించింది. ఏవియేషన్ ఇండస్ట్రీ కార్పొరేషన్ ఆఫ్ చైనా (ఏవీఐసీ)కి చెందిన చెంగ్డు ఎయిర్‌క్రాఫ్ట్ డిజైన్ అండ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఇంజినీర్ల ఇంటర్వ్యూను ప్రభుత్వ వార్తా సంస్థ సీసీటీవీ ప్రసారం చేసింది. అందులో నాలుగు రోజుల పాటు భారత్-పాక్ మధ్య జరిగిన యుద్ధంలో తాము పాకిస్థాన్ అధికారులతో కలిసి పనిచేసినట్టు జాంగ్ అనే ఇంజినీర్ తెలిపారు. ఆయన ప్రకటనతో చైనాకు చెందిన నిపుణులు నేరుగా పాక్‌లో ఉండి భారత్‌తో జరిగిన యుద్ధంలో పాల్గొన్న విషయం వెల్లడైంది.

10% సుంకాలు చట్ట విరుద్ధం

వాణిజ్య కోర్టులో ట్రంప్‌నకు మరో ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ, మే 8: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ప్రపంచ దేశాలపై ఆయన విధించిన 10 శాతం సుంకాలను అమెరికా వాణిజ్య న్యాయస్థానం గురువారం కొట్టివేసింది. 1970ల నాటి వాణిజ్య చట్టం ప్రకారం ఈ చర్యలు చట్టబద్ధంగా సమర్థనీయం కాదని కోర్టు తీర్పునిచ్చింది. అయితే కోర్టు ఉత్తర్వులు కేవలం రెండు చిన్న వ్యాపారాలకు, వాషింగ్టన్ రాష్ట్రానికి మాత్రమే వర్తిస్తుంది. అప్పీల్ ప్రక్రియ జరిగేంత వరకు ఇతర దిగుమతిదారులందరిపై సుంకాలు అమలులో ఉండేలా ఇది అనుమతిస్తుంది. ఫిబ్రవరి 24న ప్రవేశపెట్టిన 10 శాతం ప్రపంచవ్యాప్త సుంకాలను సవాలు చేస్తూ బొమ్మల తయారీ సంస్థ బేసిక్ ఫన్, మసాలా దినుసుల దిగుమతిదారు బర్లాప్ అండ్ బారెల్, వాషింగ్టన్ రాష్ట్రం దాఖలు చేసిన పిటిషన్‌పై అమెరికా అంతర్జాతీయ వాణిజ్య న్యాయస్థానం 2:1 తీర్పును వెలువరించినట్లు రాయిటర్స్ వార్తాసంస్థ తెలిపింది. వ్యాపార సంస్థలకు అనుకూలంగా తీర్పు ఇవ్వడానికి ఇది చాలా తొందరపాటు అవుతుందని పేర్కొంటూ ఒక న్యాయమూర్తి విభేదించారు. ప్రధానంగా డెమోక్రటిక్ పార్టీ నేతృత్వంలోని 24 రాష్ట్రాల కూటమి కోరిన విస్తృతమైన ఇంజంక్షన్‌ను మంజూరు చేయడానికి కోర్టు నిరాకరించింది.

యూఎఫ్‌వో ఫైళ్లు విడుదల

వాషింగ్టన్, మే 8: ఎగిరే పళ్లాలు నిజంగా ఉన్నాయా? అవి ఇతర గ్రహాలకు సంబంధించినవా? అప్పుడప్పుడు ఆకాశంలో కన్పించే గుర్తు తెలియని వస్తువులు ఏమిటి? ఇవన్నీ ప్రపంచ వ్యాప్తంగా పలువురిలో ఆసక్తి, అనుమానాలు కలిగించే సందేహాలు. అమెరికా లాంటి అగ్రదేశం కూడా ఇలాంటి విషయాల పట్ల గోప్యంగానే వ్యవహరించింది. అయితే ఇలాంటి వాటి గురించి ప్రపంచ పౌరులకు వెల్లడించాలని, వారి సందేహాలను తీర్చాలని తొలిసారిగా నిర్ణయించింది ట్రంప్ ప్రభుత్వం. ప్రజలు గుర్తించ లేని అసాధారణ ఘటనలు (యూఏపీ)కు సంబంధించిన రహస్య ప్రభుత్వ పత్రాల తొలిభాగాన్ని విడుదల చేసింది. వీటిని war.gov/ufo వెబ్‌సైట్‌లో చూడవచ్చు. ఈ ఫైళ్లను పొందడానికి ఎలాంటి భద్రతా అనుమతి అవసరం లేదు.

సాగర్ నీళ్లకు ఏపీ ఎసరు!

అడుగడుగునా కేఆర్ఎంబీ వత్తాసు • తాజాగా ఏపీ కోరినట్టే 12వ తేదీనే త్రీమెంబర్ కమిటీ భేటీకి పిలుపు

తెలంగాణ ప్రతిపాదనలన్నీ మూలన • రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెడుతున్న సర్కార్

హైదరాబాద్, మే8 (నమస్తే తెలంగాణ): కోటాకు మించి నాగార్జున సాగర్ జలాలను యథేచ్ఛగా మళ్లించుకుపోయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం.. ఉన్న కొద్దిపాటి నీటి నిల్వలకూ ఎసరు పెట్టింది. ఆ జలాల్లోనూ వాటాకోసం పట్టుబడుతున్నది. 10 టీఎంసీలు ఇవ్వాలన్న డిమాండ్ పెట్టింది. అడుగడుగునా ఏపీకి కొమ్ముకాస్తున్న కేఆర్ఎంబీ (కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు) సైతం తాజాగా ఏపీ ప్రతిపాదనలకు అనుగుణంగానే నిర్ణయాలు తీసుకుంటున్నది. ఏడాదిపొడవునా ఎలాంటి సమావేశాలు ఏర్పాటు చేయకుండా చూసీచూడనట్టు వ్యవహరించిన బోర్డు.. ఇప్పుడు ఏపీ కోరగానే 12వ తేదీన త్రీమెంబర్ కమిటీ సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. తెలంగాణ ప్రతిపాదనలన్నీ మూలకు నెట్టింది. ఈ ఏడాది ఇప్పటికే తాత్కాలిక కోటాకు మించి ఎలాంటి ఇండెంట్లను సమర్పించకుండానే సాగర్ నుంచి జలాలను ఏపీ మళ్లించుకుపోయింది. ఇంత జరుగుతున్నా రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ మొద్దునిద్రలో కూరుకుపోయింది. ఏపీ సర్కార్ నీటి దోపిడీని నిలువరించకుండా, ఇదేమని బోర్డును నిలదీయకుండా రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెడుతున్నది.



నాగార్జున సాగర్ రిజర్వాయర్

771 టీఎంసీలు వాడుకున్న ఏపీ

ఆంధ్రప్రదేశ్ ఈ ఏడాది కృష్ణా జలాలను రికార్డ్ స్థాయిలో మళ్లించుకుపోయింది. తాత్కాలిక కోటా ప్రకారం 66:34శాతం నిష్పత్తిలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు వినియోగించుకోవాల్సి ఉన్నది. ఈ కోటాకు మించి రికార్డు స్థాయిలో ఈ ఏడాది ఏపీ జలాలను మళ్లించుకుపోయింది. దాదాపు 771.252 టీఎంసీలను (74.27శాతం) జలాలను తరలించుకుపోయింది. తెలంగాణ తన తాత్కాలిక కోటా 34 శాతాన్ని కూడా వినియోగించుకోలేని దుస్థితి నెలకొన్నది. ఈ ఏడాది కేవలం 25.77 శాతం అంటే 267.733 టీఎంసీల జలాలను మాత్రమే తెలంగాణ వినియోగించుకున్నది. కోటాలో భాగంగా 105.221 టీఎంసీల జలాలు వినియోగించుకోవాల్సి ఉన్నది. ప్రస్తుతం సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు డెడ్ స్టోరేజీకి చేరువయ్యాయి. రెండు రిజర్వాయర్లలో కలిపి మొత్తంగా అందుబాటులో ఉన్నదే 33 టీఎంసీలే. వేసవి తాగునీటి అవసరాల దృష్ట్యా 18 టీఎంసీలు తెలంగాణకు అవసరం. ప్రధానంగా హైదరాబాద్ నగరం, నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల సాగునీటి అవసరాలను తీర్చాల్సి ఉన్నది. అవిగాక వచ్చే సీజన్ వరకు తెలంగాణ తాగునీటి అవసరాలకు ఆ రిజర్వాయర్లపైనే ఆధారపడాలి. అంటే ఆ ఉన్న జలాలన్నీ తెలంగాణ కోటాలోనివే. ప్రస్తుతం అందుబాటులో ఉన్న జలాల్లోనూ 10 టీఎంసీలు కావాలంటూ బోర్డు వద్ద ఏపీ డిమాండ్ పెట్టింది. ఇప్పటికే కోటాకు మించి 38 టీఎంసీలు ఎక్కువగా మళ్లించుకుపోయిన ఏపీ.. తాజాగా ఉన్న రిజర్వాయర్లలోని ఉన్న కాస్తా నీటినిల్వలకు ఎసరు పెట్టాలని చూస్తున్నది.

ఏపీకే కేఆర్ఎంబీ వత్తాసు

కేఆర్ఎంబీ మొదటి నుంచీ ఏపీకే వత్తాసు పలుకుతున్నది. ఈసారి నీటి సంవత్సరం ముగింపు దశకు చేరుకునే వరకూ బోర్డు త్రీమెంబర్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేయనేలేదు. ఏపీ నిరంతరాయంగా జలాలను మళ్లించుకుపోతున్నా ఇదేమని నిలువరించనేలేదు. జనవరిలో ఏర్పాటు చేస్తామని హడావుడి చేసిన బోర్డు.. ఆ తర్వాత ఎలాంటి కారణాలు చూపకుండానే వాయిదా వేసింది. ఏప్రిల్ 30న నిర్వహించాలని గతంలో బోర్డు నిర్ణయించగా, రాష్ట్రాల అభ్యంతరాలతో వాయిదా పడింది. త్రీమెంబర్ కమిటీ సమావేశ నిర్వహణకు అనుకూలమైన తేదీని చెప్పాలని బోర్డు రాష్ట్రాలనే కోరింది. 24గంటలు గడువకముందే ఏపీ ప్రతిస్పందించింది. 12వ తేదీన త్రీమెంబర్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరడం.. తెలంగాణ వాదనలను పరిగణనలోకి తీసుకోకుండానే అదే తేదీని బోర్డు కరారు చేయడం.. బోర్డు వివక్షకు అద్దం పడుతున్నది. ఏపీకి బోర్డు ఎంతలా సాగిలపడుతున్నదో దీన్నిబట్టే తెలిసిపోతున్నది.

ఏపీ బరితెగింపు.. చేవలేని రేవంత్ సర్కార్

కృష్ణా నీటి తరలింపులో ఏపీ బరితెగిస్తున్నదని తెలంగాణ ఇంజినీర్లే మండిపడుతున్నారు. దానికి కేఆర్ఎంబీ బోర్డు మద్దతుగా నిలుస్తున్నదని ఆరోపిస్తున్నారు. ఇలాంటి దశలో తెలంగాణ కాంగ్రెస్ సర్కార్ చేవలేనితనం ప్రదర్శిస్తున్నదని మండిపడుతున్నారు. గుట్టుగా ఏపీకి సహకరిస్తున్నదని నీటిరంగ నిపుణులు సైతం నిప్పులు చెరుగుతున్నారు. ఈ నీటి సంవత్సరం ఆది నుంచే ఏపీ నిరాటంకంగా కృష్ణా జలాలను తరలింపును చేపట్టింది. ఈ ఏడాది పోతిరెడ్డిపాడు ద్వారా దాదాపు 240 టీఎంసీలను మళ్లించింది. విషయాన్ని ఎప్పటికప్పుడు రాష్ట్ర ఇంజినీర్లు తెలంగాణ ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్తూ వస్తున్నారు. పదుల సంఖ్యలో లేఖలు రాశారు. ఏపీని అడ్డుకోవాలని ఉన్నతాధికారులు సైతం నేరుగా బోర్డు చైర్మన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. కానీ ప్రభుత్వ పెద్దలు మాత్రం స్పందించనే లేదు. బోర్డును నిలదీసింది లేదు. ప్రశ్నించిన పాపానపోలేదు. త్రీమెంబర్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేయకున్నా ఇదేమిటని రివర్ బోర్డును కాంగ్రెస్ సర్కార్ నిలదీయ లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఏపీని అడ్డుకోవాలని బోర్డుపై తెలంగాణ సర్కార్ ఒత్తిడి తీసుకురాకపోవడం గమనార్హం.

పోలవరం నుంచే జీసీ లింకు చేపట్టాలి

ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశంలో మరోసారి ఏపీ వాదన • కన్సల్టెన్సీ మీటింగ్‌లో చర్చించాలన్న ఎన్‌డబ్ల్యూడీఏ

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): గోదావరి-కావేరి (జీసీ) లింకు ప్రాజెక్టును ఇచ్చంపల్లి నుంచి కాకుండా పోలవరం నుంచే చేపట్టాలని, అప్పుడే అందుకు అంగీకరిస్తామని ఏపీ సర్కారు స్పష్టం చేసింది. జీసీ లింకు ప్రాజెక్టుపై పలు అభ్యంతరాలను లేవనెత్తింది. కేంద్ర జలవనరులశాఖ కార్యదర్శి కాంతారావు నేతృత్వంలో శుక్రవారం న్యూఢిల్లీ నుంచి నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ) 76వ జనరల్ బాడీ సమావేశం హైబ్రిడ్‌మోడ్‌లో కొనసాగింది. గత సమావేశ నిర్ణయాలు, పురోగతిపై ఈ సమావేశంలో చర్చించారు. అనంతరం నేషనల్ పర్‌స్పెక్టివ్ ప్లాన్ (ఎన్‌పీపీ)లో భాగంగా చేపట్టిన రివర్ లింకు ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష జరిపారు. ఈ క్రమంలో గోదావరి కావేరి రివర్ లింకు ప్రాజెక్టు పురోగతిని సైతం సమీక్షించారు. ఈ సందర్భంగా ఏపీ గత వాదనలనే కొనసాగించినట్టు తెలిసింది. ఇచ్చంపల్లి నుంచి జీసీ లింకు ప్రాజెక్టును చేపట్టేందుకు సమ్మతించబోమని, పోలవరం నుంచే ఆ ప్రాజెక్టును చేపట్టాలని మరోసారి ప్రతిపాదించినట్టు సమాచారం. జీసీ లింకులో భాగంగా తమకు కేటాయిస్తున్న 16 టీఎంసీలను ఆల్మట్టి ద్వారా వినియోగించుకుంటామని, అందుకు అనుగుణంగా బెడ్తి వరద లింకును జీసీ లింకు నుంచి తొలగించాలని, ప్రత్యేకంగా అంచనాలను ప్రతిపాదనలను ఇవ్వాలని కర్ణాటక కోరినట్టు తెలిసింది. ఇదిలావుంటే, రివర్ లింకు ప్రాజెక్టుకు సంబంధించిన అభ్యంతరాలు, ప్రతిపాదనలపై కన్సల్టెన్సీ సమావేశాల్లో చర్చించాలని ఎన్‌డబ్ల్యూడీఏ సూచించినట్టు సమాచారం. అనంతరం 2025-26 ఆర్థిక సంవత్సరంలో సాధించిన ప్రగతిని సమీక్షించడంతోపాటు 95 కోట్లతో 2026-27 వార్షిక బడ్జెట్‌ను ప్రతిపాదించి, దానిపై చర్చించారు. సమావేశంలో ఎన్‌డబ్ల్యూడీఏ డైరెక్టర్ జనరల్ బాలేశ్వర్ ఠాకూర్, ఎన్‌డబ్ల్యూడీఏలోని అన్ని విభాగాల ఉన్నతాధికారులు, అన్ని రాష్ట్రాల ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర ఒప్పుకొంటేనే బరాజ్

మొదటిపేజీ తరువాయి...

మంత్రులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ్మిడిహట్టి మీద 150 మీటర్ల ఎత్తుతో బరాజ్ నిర్మించడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతున్నదని దీనికోసం మహారాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చేలా తెలంగాణలోని ఎంపీలు చొరవతీసుకోవాలని సూచించారు. మహారాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకుంటేనే బరాజ్ నిర్మాణం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. 2008లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మించేందుకు పనులు ప్రారంభించారని గుర్తుచేశారు. కొన్ని కారణాల వల్ల అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయలేకపోయిందని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ పభుత్వం తమ్మిడిహట్టి మీద 150 మీటర్ల ఎత్తుతో బరాజ్ నిర్మించాలని నిర్ణయించిందని చెప్పారు. దీనికోసం మహారాష్ట్ర ప్రభుత్వం అనుమతి తప్పనిసరిగా కావాలని, మహారాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చేలా తెలంగాణలోని ఎంపీలు చొరవతీసుకొని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఒప్పించాల్సిన అవసరమున్నదని తెలిపారు. దీనిపై తెలంగాణ ముఖ్యమంత్రి కూడా మహారాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారని, ఈ నెలాఖరు వరకు మహారాష్ట్ర సీఎంతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీకానున్నట్టు తెలిపారు.

మంత్రుల పర్యటనపై విమర్శలు

తమ్మిడిహెట్టి వద్ద బరాజ్ నిర్మించి తీరుతామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు మహారాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకొంటేనే బరాజ్ నిర్మాణమవుతుందని, దీని కోసం తెలంగాణలోని బీజేపీ మంత్రులు, ఎంపీలు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించే బాధ్యత తీసుకోవాలనడంపై జిల్లా రైతాంగంలో విమర్శలు వెల్లువెత్తున్నాయి. జిల్లాలో అర్ధాంతరంగా ఉన్న అనేక ప్రాజెక్టులను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం తమ్మిడిహట్టి మీద బరాజ్ నిర్మిస్తామని ఇంతకాలం ఊదరగొట్టి.. ఇప్పుడేమో బీజేపీ సహకారం ఉంటేనే బరాజ్ నిర్మిస్తామని మంత్రులు చెబుతుండటంపై రైతుల్లో నిరాశ వ్యక్తమవుతున్నది. గతంలోనే బీఆర్ఎస్ ప్రభుత్వం 148 మీటర్ల ఎత్తుతో బరాజ్ నిర్మాణానికి మహారాష్ట్రతో ఒప్పందం చేసుకున్నదని పేర్కొన్నారు. ఇన్ని రోజులు తమ్మిడిహట్టి బరాజ్ కట్టితీరుతామని ఊదరగొట్టి.. ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చిన కాంగ్రెస్ సర్కారు ఇప్పుడు యూటర్న్ తీసుకున్నదనే విమర్శలు వస్తున్నాయి. మహారాష్ట్ర అనుమతి లేకుండా తమ్మిడిహట్టి బరాజ్ నిర్మాణం సాధ్యం కాదని తెలిసినప్పటికీ ..ఇన్ని రోజులు తప్పుదోవ పట్టించిన కాంగ్రెస్ సర్కార్, చివరికి బీజేపీ మీదికి తోసేసి చేతులు ఎత్తేసేందుకు సిద్ధమైందనే విమర్శలు వస్తున్నాయి. జిల్లాలో బీటలు వారుతున్న కుమ్రం భీం ప్రాజెక్టుతోపాటు, ఓపెన్ కాస్ట్ కారణంగా అంతరించిపోతున్న వట్టివాగు, అర్ధాంతరంగా నిలిచిపోయిన చెలిమెల వాగు, జగన్నాథ్‌పూర్, పీపీరావు ప్రాజెక్టులను బాగుచేస్తే కనీస స్థాయిలోనైనా పంటలకు నీరు అందుతుందని రైతులు పేర్కొంటున్నారు.

అధికారులే రియల్టర్లుగా.. భూమి విలువపై విచారణ

అడ్డగోలుగా రిజిస్ట్రేషన్ విలువ పెంపునకు సర్కార్ కసరత్తు

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదాయమే లక్ష్యంగా అధికారులను పరుగులు పెట్టిస్తున్నది. ఈ ఏడాది అదనంగా రూ.10 వేల కోట్ల ఆదాయాన్ని రాబట్టుకోవాలన్న లక్ష్యంతో భూములు, ఇతర స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ విలువలను అడ్డగోలుగా పెంచేందుకు సిద్ధమవుతున్నది. ఆ క్రమంలో జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, ఎమ్మార్వోలు, జిల్లా రిజిస్ట్రార్లు, సబ్ రిజిస్ట్రార్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లను రంగంలోకి దింపింది. కార్యాలయాల్లో కూర్చోకుండా క్షేత్రస్థాయిలో భూములు, ఇతర స్థిరాస్తుల వాస్తవిక ధరలను తెలుసుకుని నివేదికలు రూపొందించాలని వారిని ఆదేశిస్తున్నది. మార్కెట్ విలువల సవరణ కమిటీ పేరుతో వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, ప్లాట్లు, ఇండ్లు, ఫ్లాట్ల బహిరంగ మార్కెట్ ధరలను అంచనా వేయిస్తున్నది. రెండు రోజుల్లోగా నివేదికలు అందజేయాలని గడువు విధించడంతో వారంతా రియల్టర్ల అవతారమెత్తుతున్నారు. ఎర్రటి ఎండల్లో పొలాలు, వెంచర్ల బాట పడుతూ స్థిరాస్తి వ్యాపారుల తరహాలో ఎకరం ఎంత? ప్లాట్లు అయితే గజం ఎంత చెప్తున్నారు? అని ఆరా తీస్తున్నారు. దీన్ని చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.చరిత్రలో ఎన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో ఈ ఏడాది స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ విలువలను భారీగా పెంచాలని కాంగ్రెస్ ప్రభుత్వం యోచిస్తున్నది. రేవంత్‌రెడ్డి సర్కార్ అనాలోచిత విధానాల వల్ల ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా స్థిరాస్తుల క్రయవిక్రయాలు నిలిచిపోయాయన్న అధికారిక గణాంకాలను తుంగలో తొక్కుతున్నది. ప్రైవేట్ ఏజెన్సీలు, అరవింద్ సుబ్రహ్మణ్యం ఇచ్చిన నివేదికలను ప్రామాణికంగా తీసుకొని స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ విలువలను ఏకంగా మూడు రెట్ల వరకు పెంచాలని చూస్తున్నది. ఈ నేపథ్యంలో శుక్రవారం అనేక మంది అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లారు.

ధాన్యం కొనుగోలుపై వెంటనే సమీక్షించండి

సీఎం రేవంత్‌కు కూనంనేని లేఖ

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): అధికారులతో సమీక్షించి ధాన్యం కొనుగోళ్లలో వేగం పెరిగేలా తక్షణమే ఆదేశాలు జారీ చేయాలని సీపీఐ ఎల్పీ లీడర్ కూనంనేని సాంబశివరావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయనకు లేఖ రాశారు. మిల్లులకు వెళ్లిన లారీల్లోంచి ధాన్యం అన్‌లోడ్ చేయడం ఆలస్యమవుతుండటం కొనుగోలుకు ఆటంకంగా మారిందని పేర్కొన్నారు. ఈ పరిస్థితిలో ధాన్యం లోడ్ చేసుకొనేందుకు లారీల యజమానులు భయపడాల్సిన దుస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. లారీల కొరతతో ధాన్యం సేకరణ పూర్తిగా మందగించిందని, రైతులు కాంటా కోసం పడిగాపులు కాయాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్నిచోట్ల అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోతుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. మక్కజొన్న కొనుగోలులో సంక్షోభాన్ని నివారించాలని కోరారు.

నాయీబ్రాహ్మణులపై కాంగ్రెస్ చిన్నచూపు

- భవిష్యత్తులో గుణపాఠం చెప్తాం
- రాష్ట్ర అధ్యక్షుడు బాలకృష్ణ

హైదరాబాద్, మే8 (నమస్తే తెలంగాణ): నాయీబ్రాహ్మణులపై కాంగ్రెస్ చిన్నచూపు చూస్తున్నదని, భవిష్యత్తులో ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాచమల్ల బాలకృష్ణ హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నామినేటెడ్ పదవుల్లో ఒక్క పదవినైనా నాయీబ్రాహ్మణులకు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా అవమానించిందని నిప్పులు చెరిగారు. నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి స్పందన లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా కార్పొరేషన్ ఏర్పాటు చేసి, చైర్మన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, ఆ నిధులు నేరుగా నాయీబ్రాహ్మణ కుటుంబాలకు చేరేలా చర్యలు తీసుకోవాలని, లేదంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుడుతామని ప్రకటనలో హెచ్చరించారు.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు



కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో తమకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ శుక్రవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఖమ్మం జిల్లా నేతలు

నామినేటెడ్ పదవులను అమ్ముకున్నారు!

- కాంగ్రెస్ పార్టీ కోసం పని చేసిన వారికి పదవులు ఇవ్వలేదు
- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు లక్ష్మీనారాయణగౌడ్ ఆగ్రహం
- మార్కెట్ కమిటీ ఉపాధ్యక్ష, కాంగ్రెస్ పదవులకు రాజీనామా

కరీంనగర్ కార్పొరేషన్, మే 8: నామినేటెడ్ పదవులను అమ్ముకున్నారని, నాలుగు దశాబ్దలుగా కాంగ్రెస్ కోసం పని చేస్తున్న తనకు అధిష్టానం అన్యాయం చేసిందని కరీంనగర్ సీనియర్ నాయకుడు సుధగోని లక్ష్మీనారాయణగౌడ్ మండిపడ్డారు. నలభై ఏండ్లుగా పార్టీనే నమ్ముకున్న కార్యకర్తలకు సరైన గుర్తింపు ఇవ్వకపోతే పార్టీ ఎలా ముందుకు పోతుందని ప్రశ్నించారు. మార్కెట్ కమిటీ ఉపాధ్యక్ష, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. కరీంనగర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తనకు కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వాలని మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌గౌడ్, డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, అర్బన్ డీసీసీ అధ్యక్షుడు అంజన్‌కుమార్‌తోపాటు ఇతరులు కూడా మద్దతు పలికి ప్రభుత్వానికి సూచించారని తెలిపాడు. పార్టీకి సంబంధం లేకున్నా పార్లమెంట్ ఎన్నికల్లో డబ్బులు ఉన్నాయంటూ కాంగ్రెస్ టికెట్ తెచ్చుకొని పోటీ చేసినా వెలిచాల రాజేందర్‌రావును ప్రజలు ఓడించారని గుర్తుచేశారు. పార్టీ కోసం పని చేస్తున్న తమకు కాకుండా ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన ఆకుల నర్సయ్యకు మార్కెట్ కమిటీ చైర్మన్ ఇచ్చారని అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో పార్టీలో చేరిన ఆకుల నర్సయ్య ఇటీవల కార్పొరేటర్ ఎన్నికల్లో మేయర్ పదవి కోసం రూ.3 కోట్లు తీసుకున్నారని, ఇప్పుడు మార్కెట్ కమిటీ చైర్మన్ కోసం కూడా రూ.50 లక్షలు తీసుకున్నారని ఆరోపించారు. పార్టీ కార్యకర్తలు ఏ రోజు కూడా రాజేందర్‌రావును నాయకుడిగా గుర్తించలేదని, డబ్బులతోనే రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. ఆరు నెలల క్రితం పార్టీలోకి వచ్చిన వారి వద్ద డబ్బులు తీసుకొని నామినేటెడ్ పదవులు ఇచ్చారని విమర్శించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి కలిసి సీఎం పైరవీ ద్వారా మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇచ్చే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇద్దరు మంత్రులు, జిల్లా నాయకత్వం ప్రతిపాదించినా తమకు పదవులు ఇవ్వలేదంటే డబ్బుతోనే పదవులొచ్చాయని భావిస్తున్నామని పేర్కొన్నారు. ఇన్‌చార్జిగా చెప్పుకొంటున్న రాజేందర్‌రావును తొలగించాలని డిమాండ్ చేశారు.

కొడంగల్‌కే సాగునీరు

సభలో తేల్చిచెప్పిన రేవంత్

- ఇదే జిల్లాలోని వికారాబాద్, తాండూర్, పరిగి నియోజకవర్గాలకు మొండిచెయ్యి
- పాలమూరు ప్రాజెక్టుపై వివక్ష



కొడంగల్‌లోని ఆలయ భూమిపూజలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి

వికారాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): నిధుల మంజూరులో వివక్ష చూపుతున్న సీఎం రేవంత్‌రెడ్డి.. సాగునీటి విషయంలోనూ అదే వ్యత్యాసం చూపుతున్న విషయం తేటతెల్లమైంది. కేవలం సొంత నియోజకవర్గమైన కొడంగల్‌కే ప్రాధాన్యమిస్తున్నారని తేలిపోయింది. ఇదే జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తున్నది. మొదటి నుంచి కేసులేసి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును అడగడుగునా అడ్డుకున్న కాంగ్రెస్ నాయకులు.. అధికారంలోకి వచ్చాక కూడా తుది దశకు చేరిన ఆ ప్రాజెక్టు పనులను పూర్తి చేయకుండా పక్కనబెట్టి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజలకు అన్యాయం చేస్తున్నారు. శుక్రవారం కొడంగల్ పట్టణంలో నిర్వహించిన బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకాన్ని త్వరలో పూర్తిచేసి కొడంగల్ నియోజకవర్గానికి సాగు నీరందిస్తామని చెప్పారు. దీంతో జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాలకు సాగు నీరు ఇక రాదని సీఎం తేల్చేశారు. ముఖ్యమంత్రి ప్రసంగిస్తుండగా పక్కనే ఉన్న పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు సీఎం వ్యాఖ్యలపై కిమ్మనకపోవడం గమనార్హం. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను పూర్తి చేయకుండా గోదావరి జలాలను తీసుకొస్తామని కాలయాపన చేస్తూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజలను మరోసారి మోసం చేయాలని చూస్తున్నారనే ప్రచారమూ జరుగుతున్నది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లోని సుమారు 5 లక్షల ఎకరాలకు సాగునీరందించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం వేల కోట్ల నిధులు ఖర్చు చేసి దాదాపు 90% వరకు పనులు పూర్తి చేసింది. 29 నెలల కిందట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మిగిలిన 10 శాతం పనులను కావాలనే పక్కన పెట్టడంతో రైతులు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. కేవలం కొడంగల్ నియోజకవర్గంతోపాటు సీఎం సొంత జిల్లాపై ప్రేమతో కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల ప్రాజెక్టుకే ప్రాధాన్యమిస్తున్నారు. ఏడాదిలో సాగునీరొచ్చి.. తమ ప్రాంతం పచ్చబడుతుంది, బతుకులు మారుతాయని ఆశించిన వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాల ప్రజల బతుకులు ప్రశ్నార్థకంగా మారాయి. కాంగ్రెస్ అధికారం చేపట్టాక పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనుల కోసం నయాపైసా ఖర్చు చేయకపోవడంతో ఆ ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకున్నాయి.

అన్ని ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో నైపుణ్య శిక్షణాభివృద్ధి కోర్సులతో మైనారిటీ డిగ్రీ కాలేజీలు ఏర్పాటుచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏఐ శిక్షణకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు.

90 శాతం పూర్తయిన పనులు

ఉమ్మడి మహబూబ్‌నగర్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలకు సాగునీరందించే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే 90 శాతం వరకు పూర్తయ్యాయి. గత అసెంబ్లీ ఎన్నికలకు మూడు నెలల ముందు నార్లాపూర్ రిజర్వాయర్ లిఫ్ట్-1 వద్ద వెట్‌రన్‌ను అప్పటి సీఎం కేసీఆర్ ప్రారంభించారు. బీడుబారిన ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలకు సాగునీరందించి ప్రజల దశాబ్దాలనాటి కలను నెరవేర్చేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపట్టి రూ.27 వేల కోట్లను ఖర్చుచేసింది. ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి కాగా, కేవలం సాగునీరందించేందుకు కాల్వల పనులు మాత్రమే చేయాల్సి ఉన్నది. ఇందుకు అవసరమైన నిధులనూ అప్పటి ప్రభుత్వం విడుదల చేసింది. ఏడాదిలో సాగునీరొస్తుందని ఆశతో ఎదురుచూసిన జిల్లా రైతాంగానికి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక తీవ్ర నిరాశే మిగిలింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ఉద్దండాపూర్ రిజర్వాయర్ ద్వారా సాగు, తాగు నీరందించేలా ప్లాన్ చేశారు. 'పాలమూరు-రంగారెడ్డి' పూర్తయితే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని సుమారు 9 లక్షల ఎకరాలకు సాగునీరందడంతోపాటు 2 వేల హాబిటేషన్ల వరకు తాగునీరందించేలా ప్రణాళికలు రూపొందించారు. గత ప్రభుత్వం కాల్వల ద్వారా కృష్ణా జలాలతో జిల్లాలోని దాదాపు 1,000 చెరువుల వరకు నీటిని నింపేందుకూ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది.

పంచాయతీరాజ్‌లో ప్రమోషన్ల జాతర!

50 మంది ఎంపీడీవోలకు ఉద్యోగోన్నతులు • రాష్ట్రవ్యాప్తంగా డిప్యూటీ సీఈవోలుగా పోస్టింగ్‌లు • ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిశోర్ ఉత్తర్వులు

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో భారీగా ప్రమోషన్లు, బదిలీలు జరిగాయి. కొంతకాలంగా వేచి చూస్తున్న మండల పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు(ఎంపీడీవోలు), జిల్లా పంచాయతీ అధికారుల(డీపీవో)కు అడహక్ ప్రాతిపదికన డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లుగా(డిప్యూటీ సీఈవో) ప్రభుత్వం ఉద్యోగోన్నతులు కల్పించింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 50 మంది ఎంపీడీవోలు/డీపీవోలకు డిప్యూటీ సీఈవోలుగా ప్రమోషన్ కల్పిస్తూ ప్రభుత్వం జీవో 268 విడుదల చేసింది. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.దానకిశోర్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రమోషన్ పొందిన అధికారులను వివిధ జిల్లాల జిల్లా ప్రజా పరిషత్‌లకు, ఇతర అనుబంధ విభాగాలకు కేటాయించారు. 12 మంది ఎంపీడీవోలను జిల్లా ప్రజా పరిషత్‌లు (జెడ్పీపీ)లకు డిప్యూటీ సీఈవోలుగా ఉద్యోగోన్నతి కల్పించారు. అదనపు డీఆర్ డీవోలుగా డీఆర్‌డీఏ విభాగాలకు కేటాయించారు. ప్రమోషన్ పొందిన పలువురు అధికారులను మెప్మా, సెర్ప్, జీహెచ్ఎంసీ, విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్‌మెంట్, సైనిక సంక్షేమశాఖ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగాలకు డిప్యుటేషన్‌పై పంపారు. ఉద్యోగోన్నతులతో పాటు మరికొందరు అధికారులను బదిలీ చేశారు. ప్రమోషన్, బదిలీ పొందిన అధికారులు వెంటనే తమ ప్రస్తుత బాధ్యతల నుంచి రిలీవ్ అయి, కొత్త స్థానాల్లో రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ప్రక్రియపై తదుపరి చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ కమిషనర్‌కు సూచించింది. ఉద్యోగోన్నతి పొందిన అధికారులకు 2020 సంవత్సరంలో సవరించిన వేతన శ్రేణి ప్రకారం రూ.62,110-రూ.1,40,470 స్కేలు వర్తిస్తుంది. తెలంగాణ స్టేట్ అండ్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్, 1996లోని రూల్ 10(ఏ) ప్రకారం ఈ ప్రమోషన్లను తాత్కాలికంగా కల్పించారు.

డిప్యూటీ సీఈవోలుగా 12 మంది

ఈ అనురాధ (మహబూబాబాద్), పీ శ్రీనివాసరావు (ఖమ్మం), ఏ సంజీవరావు (పెద్దపల్లి), కే మహాలక్ష్మి (సూర్యాపేట), బీ అప్పారావు (భద్రాద్రి కొత్తగూడెం), ఆర్ అలివేలు మంగమ్మ (నల్లగొండ), బీ సంధ్య (సిద్దిపేట), జే సునీత (మంచిర్యాల), వెంకటయ్య (జనగామ) సీహెచ్ శ్రీనివాస్ (యాదాద్రి భువనగిరి), ప్రవీణ్‌కుమార్‌రెడ్డి (రంగారెడ్డి), కృష్ణ ప్రసాద్ (ములుగు) జిల్లాలకు డిప్యూటీ సీఈవోలుగా నియమితులయ్యారు. నారాయణపేట డీఆర్‌డీవోగా పనిచేస్తున్న మొగులప్పను కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా పరిషత్ సీఈవోగా బదిలీ చేశారు. కామారెడ్డి డీఆర్‌డీవోగా పనిచేస్తున్న ఎం.సురేందర్ ను అదే జిల్లాకు డిప్యూటీ సీఈవోగా నియమించారు. డీపీవో వీ జగదీశ్వర్ తనకు లభించిన డిప్యూటీ సీఈవో ప్రమోషన్‌పై ప్రస్తుతం చేరడానికి ఆసక్తి లేదని తెలుపడంతో ఆయనను మినహాయించారు.



జనగామలో మున్సిపల్ చెత్త సేకరణ వాహనంలో విద్యార్థులను తరలిస్తున్న అధికారులు

మున్సిపల్ చెత్త వాహనంలో విద్యార్థుల తరలింపు

- జనగణన అవగాహన ర్యాలీలో అధికారుల తీరు
- జనగామలో మండిపడుతున్న ప్రజాసంఘాలు

జనగామ టౌన్, మే 8 : జనగామ జిల్లా కేంద్రంలో శుక్రవారం అధికార యంత్రాంగం నిర్వహించిన జనగణన– 2027 అవగాహన ర్యాలీ వివాదాస్పదమైంది. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా నేతృత్వంలో నిర్వహించిన ఈ ర్యాలీ ముగిసిన తర్వాత విద్యార్థులను మున్సిపాలిటీకి సంబంధించిన స్వచ్ఛ తెలంగాణ తడి చెత్త సేకరణ వాహనంలో తరలించారు. దీనిపై ప్రజా సంఘాల నాయకులు, తల్లిదండ్రులు అధికారులు తీరుపై మండిపడ్డారు. భావి భారత పౌరులకు జిల్లా అధికార యంత్రాంగం ఇచ్చే గుర్తింపు ఇదేనా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. సంజయ్‌నగర్ మినీ స్టేడియంలో సమ్మర్ క్యాంప్‌లో ఉంటున్న విద్యార్థులను ర్యాలీ అనంతరం వారి పీఈటీ అభ్యర్థన మేరకు హరితహారం ఆటోలో తరలించినట్టు పేర్కొన్నారు.



ఇరోస్ ఏఐ విద్యతో భాగస్వామ్య ఒప్పందం చేసుకుంటున్న మల్లారెడ్డి వర్సిటీ చైర్మన్ భద్రారెడ్డి

మల్లారెడ్డి యూనివర్సిటీలో సరికొత్త కోర్సులు

- 'ఇరోస్ ఏఐ విద్య'తో కలిసి ఫ్యూచర్ ప్రోగ్రామ్స్

మేడ్చల్, మే8 (నమస్తే తెలంగాణ) : డిజిటల్ నైపుణ్యాలతో విద్యార్థులను నిపుణులుగా తీర్చిదిద్దేందుకు మల్లారెడ్డి విశ్వవిద్యాలయం కీలక నిర్ణయం తీసుకున్నది. ప్రముఖ సంస్థ 'ఇరోస్ ఏఐ విద్య'తో కలిసి క్రియేటివ్ మీడియా ఏఐ ఫిల్మ్ మేకింగ్, యానిమేషన్ వీఎఫ్ఎక్స్ గేమింగ్ వంటి రంగాల్లో సరికొత్త ఇండస్ట్రీ ఓరియెంటెడ్ కోర్సులను ప్రారంభించింది. ఈ సందర్భంగా వర్సిటీ చైర్మన్ భద్రారెడ్డి మాట్లాడుతూ.. చదువు, పరిశ్రమ అవసరాలకు మధ్య దూరాన్ని తగ్గించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ భాగస్వామ్యం ద్వారా విద్యార్థులు నిపుణుల పర్యవేక్షణలో రియల్ టైమ్ ప్రాజెక్టులు, అడ్వాన్స్‌డ్ స్టూడియోల్లో శిక్షణ పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రీతిరెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో పెనుమార్పులు వస్తున్నాయని, ముఖ్యంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వచ్చిన తర్వాత సినిమా మేకింగ్, యానిమేషన్ పద్ధతులు పూర్తిగా మారిపోయాయని తెలిపారు. కార్యక్రమంలో ఇరోస్ సీఈవో ప్రశాంత్ పండిత్, చాన్స్‌లర్ సుధారమణ, వైస్ చాన్స్‌లర్ అనిల్‌కౌల్ పాల్గొన్నారు.

పీవీ తెచ్చిన ఇంటర్ విద్యకు మంగళం

మొదటిపేజీ తరువాయి...

జారీ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నది. 1968లో అప్పటి విద్యాశాఖ మంత్రి పీవీ నరసింహారావు నేతృత్వంలో ఇంటర్ బోర్డుకు అడుగులు పడ్డాయి. పీవీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన సమయంలోనే ఇంటర్మీడియట్ విద్య ప్రారంభమైంది. అప్పటి వరకు 11వ తరగతి హెచ్ఎస్‌సీగా, 12వ తరగతి పీయూసీ(ప్రీ యూనివర్సిటీ కోర్సు)గా కొనసాగేవి. దానిని సంస్కరించిన పీవీ ఇంటర్మీడియట్ విద్య పేరుతో కొత్త రూపాన్ని ఇచ్చారు. 1970 అక్టోబర్ 25న ఇంటర్మీడియట్‌గా మారుస్తూ అప్పటి ప్రభుత్వ నిర్ణయం తీసుకున్నది. 1969–70 విద్యా సంవత్సరం ప్రారంభంలోనే 120 పాఠశాలలు, డిగ్రీ కళాశాలల్లో ఇంటర్ కోర్సులను ప్రారంభించారు. 1971లో ఇంటర్ బోర్డును ఏర్పాటు చేశారు. ఐదు దశాబ్దాలకు పైగా ఇంటర్ బోర్డు విద్యార్థులకు సేవలందిస్తున్నది. ఎన్నో విజయాలను సొంతం చేసుకున్నది. కాంగ్రెస్ సర్కార్ తెచ్చిన సంస్కరణకు.. మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ సర్కారే మంగళం పాడేందుకు ప్రయత్నిస్తున్నది. తమకు బద్ధ వ్యతిరేకి అయిన బీజేపీ పార్టీ తెచ్చిన ఎన్ఈపీ పాలసీని అనుసరించి ఇంటర్ బోర్డును రద్దు చేయడానికి వేగంగా పావులు కదుపుతుండటం విశేషం.

ఇంటర్‌కే డిమాండ్ ఎక్కువ

సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ స్కూళ్లంటే మన దగ్గర యమక్రేజ్. ఈ స్కూళ్లల్లో సీట్ల కోసం సిఫార్సులు సర్వసాధారణం. అయితే ఇది కేవలం పదో తరగతి వరకే. ప్లస్ టు లెవల్‌కు వచ్చేసరికి విద్యార్థుల ఆలోచనలు మారుతున్నాయి. 10వ తరగతి వరకు సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ స్కూళ్లల్లో చదివిన విద్యార్థులు.. ప్లస్ 2కి మాత్రం ఇంటర్‌బోర్డు అనుబంధ గుర్తింపు పొందిన కాలేజీల్లో చేరుతున్నారు. ఏటా 35–40 వేలకు పైగా విద్యార్థులు సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ స్కూళ్లకు గుడ్‌బై చెప్పి.. ఇంటర్‌బోర్డు గుర్తింపు పొందిన జూనియర్ కాలేజీల్లో ప్రవేశాలు పొందుతున్నారు. ఉదాహరణకు భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్‌లో పదో తరగతి వరకు 275 మంది విద్యార్థులు చదువగా, 11వ తరగతిలో 40, 12వ తరగతిలో కేవలం 28 మంది మాత్రమే ఉన్నారు. మిగిలిన వాళ్లంతా ఇంటర్ విద్యకే జై కొట్టారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లోనూ ఏటా ఇదే జరుగుతున్నది. ఇంటర్ బోర్డు సిలబస్ అనేక పరీక్షలకు ఉపయోగపడుతుండడం, ప్రతిభావంతులైన వారు, గణితంలో మంచి స్కోర్ చేయగలిగిన వారు సైతం ఇంటర్ బోర్డు బాట పడుతున్నారు. సీబీఎస్ఈలో గణితం ఒక పేపర్‌కు 100 మార్కులకు పరీక్ష నిర్వహిస్తుండగా, మన దగ్గర రెండు పేపర్లకు గాను 150 మార్కులకు పరీక్ష నిర్వహిస్తున్నారు. ఇది కూడా మరో కారణంగా నిపుణులు అంచనా వేస్తున్నారు.



పది పాసైనవారు, ఇంటర్ అడ్మిషన్ల వివరాలిలా..

సంవత్సరం	పది పాసైన వారు	ఇంటర్‌లో చేరినవారు
2022	4,92,073	4,82,675
2023	4,76,573	4,78,723
2024	4,91,285	4,88,520
2025	4,95,210	4,89,124

డ్రాపౌట్ అనేది సాకు మాత్రమే..

ఇంటర్ బోర్డును పాఠశాల విద్యలో విలీనం చేయడం ద్వారా డ్రాపౌట్లను తగ్గించవచ్చని ప్రభుత్వ వర్గాలు వాదిస్తున్నాయి. అయితే ఇది పూర్తిగా అవాస్తవమని ఇంటర్ అధ్యాపక సంఘాలంటున్నాయి. పదో తరగతి పాసయ్యే వారి వివరాలు, ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్లు దాదాపు దగ్గరగానే ఉంటున్నాయి. పదో తరగతి పూర్తయిన తర్వాత విద్యార్థులు పాలిటెక్నిక్, బాసర ట్రిపుల్ ఐటీ, ఐటీఐ వంటి కోర్సుల్లో చేరుతుంటారు. అయినా ఇంటర్ అడ్మిషన్లు దరిదాపుల్లోనే ఉంటున్నాయని అధ్యాపక సంఘాల నేతలు చెబుతున్నారు. అలాంటప్పుడు డ్రాపౌట్లు ఎక్కడివని ప్రశ్నిస్తున్నారు. బోర్డు విలీనానికి డ్రాపౌట్‌ను సాకుగా చూపించడం తగదని అభిప్రాయపడుతున్నారు.

గతంలోనూ విలీనానికి ప్రయత్నం

గతంలోనూ ఇంటర్ విద్యను పాఠశాల విద్యాశాఖలో విలీనం చేసేందుకు అనేక ప్రయత్నాలు జరిగాయి. అవన్నీ విఫలమయ్యాయి. 1994 జనవరి 5న ప్రభుత్వం జీవో 82 జారీ చేసి ఇంటర్ బోర్డును విలీనం చేసింది. అధ్యాపకులు, ఉపాధ్యాయుల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఆ తర్వాత ఫిబ్రవరి 4న జీవోను రద్దు చేసింది. 2009లోనూ విలీన ప్రయత్నాలు జరిగాయి. ప్రభుత్వం మంత్రులతో బృందాన్ని నియమించింది. ఈ బృందం అందరి నుంచి అభిప్రాయాలు సేకరించింది. అత్యధికులు విలీనాన్ని వ్యతిరేకించారు. మళ్లీ తాజాగా కాంగ్రెస్ సర్కార్ విలీన అంశాన్ని తెరపైకి తెచ్చింది.

అభ్యంతరాల వెల్లువ

- ఇంటర్ బోర్డును రద్దు చేయడం కొఠారి కమిషన్ సిఫార్సులకు విరుద్ధం.
- స్కూళ్లల్లో స్కూల్ అసిస్టెంట్ ఫిజిక్స్, స్కూల్ అసిస్టెంట్ బయాలజీ టీచర్లుంటారు. ఇదే ఇంటర్‌కు వచ్చేసరికి ఫిజిక్స్ ఒక్కటే ఫిజిక్స్, కెమిస్ట్రీగా విడిపోతుంది. బయాలజీ సబ్జెక్టు జువాలజీ, బోటనీగా విడిపోతుంది. ఫిజిక్స్, బయాలజీ టీచర్లు ఇంటర్ సబ్జెక్టులను ఎలా బోధించగలరు.
- కెమిస్ట్రీలో ఇనార్గానిక్ కెమిస్ట్రీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఫిజికల్ కెమిస్ట్రీ వంటి సబ్జెక్టులుంటాయి. ఇంత లోతైన సబ్జెక్టులను టీచర్లు బోధించగలరా?
- జేఈఈ, నీట్ వంటి జాతీయ స్థాయి పరీక్షల శిక్షణపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుంది. మళ్లీ లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకునే రోజులొస్తాయి. కోచింగ్ సెంటర్ల హవా పెరుగుతుంది.
- తమిళనాడు, కేరళ, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఇంటర్ అడ్మిషన్ ఒక దగ్గర ఉంటే.. విద్యార్థి మరో కోచింగ్ సెంటర్‌లో క్లాసులు వింటున్నారు. ఇంటర్‌బోర్డును రద్దు చేస్తే మన దగ్గర సైతం ఇదే జరుగనుంది.

పాలమూరు బిడ్డకు అమెరికాలో రూ.2 కోట్ల ప్యాకేజీ



మూసాపేట(అడ్డాకుల), మే 8 : పాలమూరు జిల్లా యువకుడు అభిలాశ్‌రెడ్డికి రూ.2 కోట్ల వార్షిక వేతనంతో ఉద్యోగం వరించింది. అమెరికాలోని 'సిస్కో' కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఆయన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఎంపికయ్యారు. అడ్డాకుల మండలం రాచాల గ్రామానికి చెందిన టీచర్ యుగంధర్‌రెడ్డి, శోభారాణి దంపతుల పెద్ద కుమారుడు అభిలాశ్ పాలమూరులో ప్రాథమిక విద్య, హైదరాబాద్‌లో ఇంటర్ చదివి జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌లో మంచి ర్యాంకు సాధించారు. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో ఎంఎస్‌లో చేరి 'సిస్కో' కంపెనీ క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఎంపికయ్యారు.

సర్కార్ బడి విద్యార్థి ప్రాజెక్ట్‌కు పేటెంట్

- అరుదైన ఘనత సాధించిన విద్యార్థిని మమత



హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ) : కుమ్రంభీం ఆసిఫాబాద్ విద్యార్థిని మమత అరుదైన గుర్తింపు పొందింది. ఆమె రూపొందించిన ప్రాజెక్ట్‌కు కేంద్ర ప్రభుత్వం పేటెంట్ హక్కులు జారీచేసింది. ఈ మేరకు భారత ప్రభుత్వ పేటెంట్స్, డిజైన్స్, అండ్ ట్రేడ్‌మార్క్స్ కార్యాలయం పేటెంట్ రిజిస్ట్రేషన్‌ను జారీచేసింది. జిల్లాలోని సిర్పూర్(టీ) మండలం అందవెల్లి గ్రామ పరిధిలోని భూపాలపట్నం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న అల్లా మమత.. రద్దీ ప్రదేశాల్లో పార్కింగ్ నిర్వహణ (పార్కింగ్ మేనేజ్‌మెంట్ ఇన్ క్రౌడెడ్ ప్లేసెస్) ప్రాజెక్ట్‌ను రూపొందించింది. స్కూళ్లు, దవాఖానలు, షాపింగ్‌మాల్స్‌లో పార్కింగ్ స్థలం ఖాళీగా ఉందో లేదో తెలుసుకునే సాంకేతికను రూపొందించి పేటెంట్ హక్కులను సొంతం చేసుకున్నది.

5,001 స్కూళ్లలో సింగిల్ టీచర్

- 2,245 స్కూళ్లలో జీరో ఎన్‌రోల్‌మెంట్
- రాష్ట్రంలో దిగజారుతున్న బడుల పరిస్థితి
- నీతి ఆయోగ్ నివేదికలో విస్తుపోయే వాస్తవాలు

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సర్కార్ బడులు కుదేలవుతున్నాయి. తాజాగా నీతి ఆయోగ్ గణాంకాలు ఇందుకు అద్దం పడుతున్నాయి. తెలంగాణలో 5,001 సర్కార్ బడులు సింగిల్ టీచర్‌తో నడుస్తున్నట్లు నివేదిక వెల్లడించింది. 'స్కూల్ ఎడ్యుకేషన్ సిస్టం ఇన్ ఇండియా' పేరుతో నీతి ఆయోగ్ ఈ రిపోర్ట్ రిలీజ్ చేసింది. రాష్ట్రంలో 24 వేలకు పైగా సర్కార్ బడులుండగా, 20 శాతం స్కూళ్లను సింగిల్ టీచర్లతో నెట్టుకొస్తున్న తీరు ప్రభుత్వ విద్య దుస్థితిని కండ్లకు కడుతున్నది. దేశవ్యాప్తంగా ఏకోపాధ్యాయ పాఠశాలలు అధికంగా ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ పదో స్థానంలో ఉన్నది. తమిళనాడు, గుజరాత్, బీహార్‌తో పోల్చితే తెలంగాణలోనే అత్యధికంగా ఏకోపాధ్యాయ పాఠశాలలున్నాయి. ప్రాథమిక విద్య ఉన్నత చదువులకు పునాదిగా భావిస్తున్న ఈ రోజుల్లో 5 వేల స్కూళ్లు సింగిల్ టీచర్లతో నడుస్తుండటం ఆందోళనకరం. ఈ బడుల్లో ఒకటి నుంచి ఐదు తరగతులుండగా ఒకటి, రెండు తరగతుల్లో మూడు సబ్జెక్టులు, మూడు నుంచి ఐదు తరగతులకు నాలుగు సబ్జెక్టుల చొప్పున ఉంటాయి. రోజుకు బోధించాల్సిన మొత్తం సబ్జెక్టులు 18. విద్యార్థులెందరున్నా అన్ని తరగతులకు పాఠాలు చెప్పాల్సిందే. అన్ని సబ్జెక్టుల సిలబస్‌ను పూర్తి చేయాల్సిందే. ఒక్క టీచరే మొత్తం తరగతులకు అన్ని సబ్జెక్టులను బోధించలేకపోతున్నారు. ఈ పరిస్థితులతో రాష్ట్రంలోని విద్యార్థులు న్యాస్ సర్వేలో వెనుకబడుతున్నారని విద్యారంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్లల్లో సెకండ్..

సర్కార్ బడుల్లో పరిస్థితులు అధ్వానంగా ఉండడంతో విద్యార్థుల సంఖ్య సైతం ఏటేటా తగ్గిపోతున్నది. దేశవ్యాప్తంగా 7,993 జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్లు ఉన్నాయి. అంటే విద్యా సంవత్సరంలో ఈ పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా చేరలేదు. ఈ విషయంలో 3,812 స్కూళ్లతో పశ్చిమ బెంగాల్ అగ్రస్థానంలో ఉండగా తెలంగాణ 2,245 జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్లతో రెండోస్థానంలో ఉన్నది. ఈ స్కూళ్లల్లో 1,016 మంది టీచర్లు పని చేస్తున్నారు. రాష్ట్రాల వారీగా తీసుకుంటే కర్ణాటకలో 270, మధ్యప్రదేశ్ 463, తమిళనాడు 311, రాజస్థాన్‌లో 215 చొప్పున జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్లు ఉన్నాయి.

మొక్కు'బడి' చదువులే!

దేశవ్యాప్తంగా సర్కార్ బడుల పరిస్థితి దిగజారుతున్నది. వేల ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, తాగునీటి సరఫరా తదితర సౌకర్యాలు కరువయ్యాయి. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం దేశంలో లక్షకు పైగా పాఠశాలల్లో కేవలం ఒక్క ఉపాధ్యాయుడే ఉన్నారు. కొన్ని రాష్ట్రాల్లో విద్యార్థి–ఉపాధ్యాయ నిష్పత్తి కూడా చాలా ఎక్కువగా ఉంది. అలాగే ఉపాధ్యాయుల నైపుణ్యం తక్కువగా ఉండడం ఆందోళన కలిగించే అంశంగా పేర్కొంది. గత పదేండ్లలో కరెంట్ సౌకర్యం 55 శాతం నుంచి 91.9 శాతానికి పెరిగినా, ఇంకా 1.19 లక్షల పాఠశాలల్లో కరెంట్ సదుపాయం లేదు. 98,592 స్కూళ్లలో బాలికలకు ఉపయోగపడే మరుగుదొడ్లు లేవని నివేదిక తెలిపింది. 61,540 పాఠశాలల్లో ఉపయోగించగల మరుగుదొడ్లు ఏవీ లేవు.

ఉపాధ్యాయుల నైపుణ్యమే ప్రధాన సమస్య

దేశంలో 1,04,125 పాఠశాలల్లో ఒక్క ఉపాధ్యాయుడు మాత్రమే ఉన్నారని నివేదిక పేర్కొంది. జార్ఖండ్ రాష్ట్రంలోని ప్రభుత్వ సెకండరీ పాఠశాలల్లో విద్యార్థి–ఉపాధ్యాయ నిష్పత్తి 47:1గా ఉంది. అలాగే ప్రభుత్వ సెకండరీ పాఠశాలల్లో కేవలం 51.7 % పాఠశాలల్లో మాత్రమే సైన్స్ ప్రయోగశాలలు ఉన్నాయి. ఉపాధ్యాయుల సామర్థ్యం కూడా ఆందోళనకరంగా ఉంది. గణిత పరీక్షల్లో కేవలం 2% మంది మాత్రమే 70%కు పైగా స్కోర్ చేయగా, సగటు మార్కులు 46% మాత్రమే వచ్చాయి. దేశవ్యాప్తంగా సెకండరీ పాఠశాలల డ్రాపౌట్ రేట్ 11.5% ఉంది. పశ్చిమ బెంగాల్, అరుణాచల్‌ప్రదేశ్, కర్ణాటక, అస్సాం రాష్ట్రాల్లో ఈ రేటు జాతీయ సగటుతో పోలిస్తే ఎక్కువగా ఉంది. బీహార్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో డ్రాపౌట్ శాతం గణనీయంగా పెరిగింది. భారత్ తన జీడీపీలో కేవలం 4.6% మాత్రమే విద్యపై ఖర్చు చేస్తున్నది. ఇది ఇతర దేశాలతో పోలిస్తే తక్కువ. యూఎస్, యూకే 5.9%, జర్మనీ, ఫ్రాన్స్ 5.4% చొప్పున విద్యపై ఖర్చు చేస్తున్నాయి.

ఆన్‌లైన్‌లో ఎప్‌సెట్ కటాఫ్ ర్యాంకులు

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ) : టీజీ ఎప్‌సెట్ –25 కటాఫ్ ర్యాంకుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచినట్టు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన వెల్లడించారు. మొదటి, రెండో, తుది విడుత కటాఫ్ ర్యాంకులను https://tgeapcet.nic.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు తెలిపారు. కాలేజీ, బ్రాంచి, క్యాటగిరీ, జెండర్ వారీగా ర్యాంకులను పొందుపరిచినట్టు చెప్పారు. ఎప్‌సెట్ ఇంజినీరింగ్ విభాగం పరీక్షలు శని, ఆది, సోమవారాల్లో నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండో సెషన్ పరీక్షలు జరుగుతాయి. ఆలస్యంగా వచ్చే విద్యార్థులను అనుమతించబోమని ఎప్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ కే విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

కేసీఆర్ పాలనలో విద్యాప్రగతి అద్భుతం

- ఇందుకు నీతి ఆయోగ్ తాజా నివేదికే సాక్ష్యం
- ప్రాథమిక పాఠశాల స్థాయిలో జీరో డ్రాపౌట్స్
- బీఆర్ఎస్‌పై అసత్య ప్రచారాలు చేసేవారికి ఈ నివేదిక చెంపపెట్టు
- బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ పాలనలో విద్యారంగం గొప్ప ప్రగతి సాధించిందనడానికి నీతి ఆయోగ్ వెల్లడించిన గణాంకాలే సాక్ష్యమని మాజీ మంత్రిహరీశ్‌రావు స్పష్టం చేశారు. రాజకీయాల కోసం కేసీఆర్‌పై అసత్య ప్రచారాలు చేసేవారికి ఈ నివేదిక చెంపపెట్టుగా అభివర్ణించారు. నీతి ఆయోగ్ స్కూల్ ఎడ్యుకేషన్ సిస్టమ్ ఇన్ ఇండియా (2014–15 నుంచి 2024–25) నివేదికపై హరీశ్‌రావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయిలో జీరో డ్రాపౌట్స్ నమోదు కావడాన్ని నీతి ఆయోగ్ ప్రశంసించిందని, ఇది బీఆర్ఎస్ చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు. 'కేసీఆర్ హయాంలో విద్యావ్యవస్థ నిర్లక్ష్యానికి గురైందని కాంగ్రెస్, బీజేపీ, కొంతమంది స్వయం ప్రకటిత మేధావులు ఆరోపణల పచ్చి అబద్ధాలని నీతి ఆయోగ్ నివేదికతో తేటతెల్లమైంది' అని చెప్పారు.

నీతి ఆయోగ్ నివేదికలోని ముఖ్యాంశాలు

- ప్రాథమిక స్థాయిలో జాతీయ సగటును మించి విద్యార్థుల నమోదు ఉన్నది. 2014–15లో 105.64 శాతంగా ఉన్న గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో, 2024–25 నాటికి 114 శాతానికి చేరింది. సెకండరీ స్థాయిలో బాలికల నమోదు రేటు 101.5 శాతానికి పెరుగడం ఒక రికార్డు
- రాష్ట్రంలోని 95.1 శాతం పాఠశాలలకు విద్యుత్ సౌకర్యం ఉన్నది. గతంలో ఇది 92.6 శాతం మాత్రమే. రాష్ట్రంలోని 86 శాతం పాఠశాలల్లో కంప్యూటర్ సౌకర్యం ఉన్నది. పదేండ్ల క్రితం ఇది కేవలం 37.9 శాతంగా మాత్రమే ఉండేది. బాలుర మరుగుదొడ్ల సౌకర్యం 57 నుంచి 86.7 శాతానికి, బాలికల మరుగుదొడ్ల సౌకర్యం 70.7 నుంచి 92.9 శాతానికి మెరుగుపడింది.
- జాతీయ సగటున ప్రతి 26 మంది విద్యార్థులకూ ఒక టీచర్ ఉండగా, తెలంగాణలో ప్రతి 22 మంది విద్యార్థులకూ ఒక ఉపాధ్యాయుడు అందుబాటులో ఉన్నారు. భాషా సామర్థ్యం, గణిత సామర్థ్యం, విద్యుత్తు సౌకర్యం, కంప్యూటర్ విద్య అంశాల్లో జాతీయ సగటుతో పోలిస్తే తెలంగాణ గణనీయంగా ముందంజలో ఉన్నది.

కష్టాల్లో ఉన్నాం.. ఖర్చులొద్దు

వ్యయ నియంత్రణ దిశగా ఎయిర్ ఇండియా

ఇప్పటికైతే తొలగింపుల్లేవ్.. జీతాల పెంపూ లేదు

ఉద్యోగులతో యాజమాన్యం



న్యూఢిల్లీ, మే 8: దేశీయ విమానయాన రంగ సంస్థ, టాటా గ్రూప్‌నకు చెందిన ఎయిర్ ఇండియా.. వ్యయ నియంత్రణ దిశగా అడుగులేస్తున్నది. ఈ క్రమంలోనే 'సంస్థ కఠిన పరిస్థితులను ఎదుర్కొంటున్నది. అనవసరపు ఖర్చుల జోలికి వెళ్లవద్దు' అని శుక్రవారం ఉద్యోగులకు యాజమాన్యం సూచించింది. అలాగే ఇప్పటికైతే ఉద్యోగాల తొలగింపులేమీ ఉండబోవని భరోసా ఇచ్చిన కంపెనీ.. కనీసం మూడు నెలలపాటైనా వార్షిక వేతనాల పెంపును వాయిదా వేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసినట్టు సమాచారం. ఎయిర్ ఇండియా సీఈవో, ఎండీ క్యాంప్‌బెల్ విల్సన్, సీఎఫ్‌వో సంజయ్ శర్మ, చీఫ్ హెచ్‌ఆర్ ఆఫీసర్ రవీంద్ర కుమార్ జీపీ.. టౌన్‌హాల్‌లో ఉద్యోగులనుద్దేశించి మాట్లాడారు. వీరంతా కూడా ఉద్యోగులకు దుబారాపై దృష్టి పెట్టండని నొక్కి చెప్పినట్టు తెలుస్తున్నది.

ఇదీ సంగతి..

అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియాలో తీవ్ర సంక్షోభం నెలకొన్న విషయం తెలిసిందే. ఏవైపు మార్కెట్‌లో విజృంభించిన ముడి చమురు ధరలు.. విమానయాన ఇంధనాన్ని 2.5-3 రెట్లు ఖరీదెక్కించాయి. మరోవైపు అమెరికాకు అండగా ఉంటున్నాయని పొరుగు దేశాలపై ఇరాన్ దాడులు చేస్తుండటంతో.. యూఏఈ, ఖతార్, కువైట్, సౌదీ, బహ్రెయిన్ తదితర గల్ఫ్ దేశాల్లో గగనతల ఆంక్షలు వచ్చిపడ్డాయి. ఈ ప్రభావం భారతీయ విమానయాన రంగంపై స్పష్టంగా పడుతున్నది. పెరిగిన నిర్వహణ ఖర్చులు, తగ్గిన ఆదాయం ఎయిర్‌లైన్స్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఎయిర్ ఇండియా తాజా నిర్ణయాలే ఇందుకు నిదర్శనం. నష్టాల నుంచి గట్టెక్కడానికే ఈ వ్యయ నియంత్రణ చర్యలు అన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కాగా, గురువారం జరిగిన కంపెనీ బోర్డు సమావేశంలో తాత్కాలిక సెలవులు (ఈ సెలవులకుగాను ఉద్యోగులకు కంపెనీలు జీతాలు చెల్లించవు) సహా వ్యయ నియంత్రణకున్న అన్ని అవకాశాలపై చర్చ జరిగింది. ఈ క్రమంలోనే ఉద్యోగులతో కంపెనీ ఉన్నతవర్గాలు పైవిధంగా చెప్పుకొచ్చాయి.

మున్ముందు కష్టాలే..

పొరుగున ఉన్న పాకిస్థాన్‌తో సరిహద్దు గొడవల దృష్ట్యా ఆ దేశ గగనతలాన్ని చాలాకాలం నుంచి వినియోగించుకోలేకపోతున్న భారతీయ విమానయాన సంస్థలకు.. గత 2 నెలలకుపైగా మెజారిటీ గల్ఫ్ దేశాలకూ స్వేచ్ఛగా వెళ్లలేని దుస్థితి తలెత్తింది. పశ్చిమాసియా సంక్షోభం.. మూలిగే నక్క మీద తాటి పండు పడ్డ చందంగా తయారైంది మరి. నిజానికి దేశీయ విమానయాన పరిశ్రమకు గల్ఫ్ దేశాలు వచ్చిపోయేవారి నుంచి పెద్ద ఎత్తున ఆదాయం వస్తుంది. అయితే అక్కడి ఉద్రిక్తతలు ఈ బిజినెస్‌ను గండికొట్టాయి. ఇక డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఆల్ టైమ్ కనిష్ఠ స్థాయిలకు దిగజారుతుండటం కూడా విమానయాన సంస్థల కష్టాలను పెంచేస్తున్నది. ఆయా సిబ్బందికి, విదేశీ ఎయిర్‌పోర్టుల్లో వినియోగించుకుంటున్న సేవలకుగాను చెల్లింపులు డాలర్లలోనే ఉంటాయి మరి. మొత్తానికి ఎయిర్ ఇండియా నిర్ణయాల నేపథ్యంలో ఇతర దేశీయ విమానయాన సంస్థలూ ఇదే దిశగా పయనించేందుకు ఆస్కారం ఉన్నది. ఇప్పటికే ఆయా కంపెనీల ఆర్థిక ఫలితాలు నిరుత్సాహకరంగా వస్తున్నది చూస్తూనే ఉన్నాం. గత కొద్ది రోజులుగా దేశీయ స్టాక్ మార్కెట్లలోనూ తీవ్ర ఒడిదుడుకులకు షేర్లు లోనవుతున్నాయి. దీంతో భారతీయ విమానయాన పరిశ్రమ మున్ముందు కష్టాలమయమేనన్న అంచనాలు వినిపిస్తున్నాయి.

అనవసరపు ఖర్చుల జోలికి పోకండి. వీలైనంతగా పొదుపును పాటించండి. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆర్థికపరంగా ఎంత ఆదా? చేయగలిగితే అంతగా కలిసొచ్చినట్టే.

-క్యాంప్‌బెల్ విల్సన్, ఎయిర్ ఇండియా సీఈవో

అంతర్జాతీయ ప్రతికూల పరిణామాలతో గత ఆర్థిక సంవత్సరం (2025-26) కంపెనీ ఆదాయం మందగించింది. అందుకే ఈ కఠిన సమయాల్లో ఖర్చులపై గట్టి నిఘా పెట్టాల్సిన అవసరం ఉన్నది.

-సంజయ్ శర్మ, ఎయిర్ ఇండియా సీఎఫ్‌వో


గత ఆర్థిక సంవత్సరానికైతే వేరియబుల్ పే ఉంటుంది. ముందుగా అనుకున్న ప్రమోషన్లూ వస్తాయి. అయితే కనీసం మూడు నెలలైనా వార్షిక ఇంక్రిమెంట్లు వాయిదా పడుతాయి. ముందస్తు తొలగింపులకు వెళ్లట్లేదు.

-రవీంద్ర కుమార్, ఎయిర్ ఇండియా చీఫ్ హెచ్‌ఆర్

తగ్గనున్న సర్వీసులు

గగనతల ఆంక్షలున్న, నష్టాలు వస్తున్న మార్గాల్లో విమాన సర్వీసులను తగ్గించే లేదా నిలిపివేసే యోచనలో ఎయిర్ ఇండియా ఉన్నది. ఈ మేరకు సంస్థ సీఈవో క్యాంప్‌బెల్ విల్సన్ సంకేతాలిచ్చారు. ఈ జూన్-జూలైలో విమానాల సంఖ్య తగ్గవచ్చు. ప్రస్తుతం ఎయిర్ ఇండియా దాదాపు 190 విమానాలను నడుపుతున్నది. వారానికి సుమారు 8వేల సర్వీసులు నడుస్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరం ఇంచుమించుగా 62 మిలియన్ల ప్రయాణికులను తీసుకెళ్లింది.

- ఎయిర్ ఇండియాలో దాదాపు 24,000 ఉద్యోగులు.
- 2022 జనవరిలో కేంద్ర ప్రభుత్వం నుంచి సంస్థను కొనుగోలు చేసిన టాటా గ్రూప్.
- 2022-2025 మధ్య కంపెనీ ఆదాయంలో వార్షిక చక్ర వృద్ధిరేటు (సీఏజీఆర్) 40 శాతం.
- గత ఆర్థిక సంవత్సరం కంపెనీకి రూ.22,000 కోట్లకుపైగా నష్టం వాటిల్లినట్టు అంచనా.
- ఎయిర్ ఇండియాను బాగా కుంగదీసిన అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదం దుర్ఘటన.



బీవోబీ లాభం 5,616 కోట్లు

న్యూఢిల్లీ, మే 8: బ్యాంకింగ్ దిగ్గజాల్లో ఒకటైన బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) అంచనాలకుమించి రాణించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికిగాను బీవోబీ రూ.5,616 కోట్ల నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.5,048 కోట్ల లాభంతో పోలిస్తే 11 శాతం వృద్ధి నమోదైంది. ఏడాది క్రితం రూ.35,852 కోట్లుగా ఉన్న బ్యాంక్ ఆదాయం గత త్రైమాసికానికిగాను రూ.36,609 కోట్లకు ఎగబాకింది. దీంట్లో వడ్డీల మీద వచ్చే ఆదాయం రూ.32,642 కోట్లుగా ఉన్నట్టు బీఎస్‌ఈకి సమాచారం అందించింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 2.26 శాతం నుంచి 1.89 శాతానికి దిగిరాగా, నికర ఎన్‌పీఏ కూడా 0.58 శాతం నుంచి 0.45 శాతానికి తగ్గాయని పేర్కొంది. బ్యాంక్ ప్రొవిజన్ కవరేజ్ రేషియో స్వల్పంగా పెరిగి 93.94 శాతానికి చేరుకోగా, క్యాపిటల్ అడెక్వసీ రేషియో 17.19 శాతం నుంచి 15.82 శాతానికి తగ్గింది. గడిచిన ఆర్థిక సంవత్సరం మొత్తానికి రూ.1,42,750 కోట్ల ఆదాయంపై రూ.20,021 కోట్ల లాభాన్ని గడించింది. మరోవైపు, 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకూ రూ.8.5 డివిడెండ్(425 శాతం)ను బోర్డు ప్రతిపాదించింది. అలాగే టైర్-1, టైర్-2 బాండ్లను జారీ చేయడం ద్వారా రూ.6 వేల కోట్ల నిధుల సేకరణకు బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

ఏరోస్పేస్‌లో తెలంగాణ అగ్రగామి!

2030 నాటికి సాధ్యమేనన్న మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్.. ప్రపంచంలోనే అత్యంత తక్కువ ఖర్చు ఏరోస్పేస్ గమ్యస్థానంగా ఎదిగిందని, రక్షణ రంగ పరిశోధనా సంస్థలు, అత్యాధునిక తయారీ యూనిట్లకు పేరుగాంచిందని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. సాంకేతిక యుద్ధాలు, డ్రోన్ వ్యవస్థలు నేడు జాతీయ భద్రతలో కీలక శక్తులుగా మారాయని నేషనల్ సెక్యూరిటీ అడ్వయిజరీ బోర్డు సభ్యుడు, డీఆర్‌డీవో మాజీ చైర్మన్ డాక్టర్ జీ సతీష్ రెడ్డి అభిప్రాయపడ్డారు. శుక్రవారం తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, తెలంగాణ పరిశ్రమలు, వాణిజ్య శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఎంఎస్‌ఎంఈ స్పార్క్ 3.0-ఏరోస్పేస్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ సదస్సు జరిగింది. ఇందులో 400లకుపైగా రక్షణ రంగ నిపుణులు, పరిశ్రమల ప్రతినిధులు, స్టార్టప్ వ్యవస్థాపకులు, పెట్టుబడిదారులు, ఎంఎస్‌ఎంఈ ప్రతినిధులు పాల్గొని దేశంలో అభివృద్ధి చెందుతున్న ఏరోస్పేస్, డిఫెన్స్, తయారీ రంగాల్లోగల అవకాశాలపై చర్చించారు. ఈ సందర్భంగానే సదస్సుకు హాజరైన మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. భారత వైమానిక దళంలో ఫైటర్ పైలెట్‌గా, రాష్ట్రపతికి ఏడీసీగా పనిచేసిన అనుభవాలను వివరించారు. ఈ క్రమంలోనే ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తున్నదని చెప్పారు. 2030 నాటికి ఈ రంగాలలో అగ్రగామి కేంద్రంగా తెలంగాణ ఎదుగుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 1,500 ఎంఎస్‌ఎంఈలు, ఏరోస్పేస్, డిఫెన్స్ వ్యవస్థలో భాగస్వాములుగా ఉన్నాయని తెలిపారు. సతీష్ రెడ్డి మాట్లాడుతూ.. ఆపరేషన్ సింధూర్ ద్వారా స్వదేశీ రక్షణ వ్యవస్థలు, ఆయుధాలు, సాంకేతిక శక్తిని ప్రపంచానికి భారత్ చాటిచెప్పిందన్నారు. డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ డాక్టర్ చంద్రిక కౌశిక్ మాట్లాడుతూ.. ఆపరేషన్ సింధూర్ పూర్తి స్వదేశీ సాంకేతికతతో విజయవంతంగా నిర్వహించిన ఆపరేషన్ అని తేల్చిచెప్పారు.

బంధన్ బ్యాంక్ విస్తరణ



హైదరాబాద్, మే 8: తెలంగాణలో తన వ్యాపారాన్ని మరింత విస్తరించడానికి ఒకేసారి మూడు శాఖలను ప్రారంభించింది బంధన్ బ్యాంక్. వీటిలో హైదరాబాద్‌లో రెండు శాఖలను ఆరంభించిన సంస్థ..మరొకటి మిర్యాలగూడలో నెలకొల్పింది. దీంతో తెలంగాణలో శాఖల సంఖ్య 162కి చేరుకున్నాయి. తమిళనాడులో ఐదు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో చెరో రెండు చొప్పున ప్రారంభించినట్లు బంధన్ బ్యాంక్ ఎండీ, సీఈవో పార్థ ప్రతీమ్ సేన్‌గుప్తా తెలిపారు. వ్యూహాత్మక వ్యాపార విస్తరణలో ఈ కొత్త శాఖలను ప్రారంభించినట్టు, తద్వారా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడానికి వీలు పడనున్నదన్నారు.

ఎస్బీఐ లాభం 19,684 కోట్లు

క్యూ4లో 6 శాతం పెరిగిన ప్రాఫిట్ • రూ.17.35 డివిడెండ్ ప్రకటించిన బ్యాంక్

ముంబై, మే 8: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) ప్రోత్సాహకర ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికపు ఏకీకృత నికర లాభంలో 6 శాతం వృద్ధి నమోదు చేసుకున్నది. జనవరి- మార్చి మధ్యకాలానికిగాను బ్యాంక్ రూ.19,684 కోట్ల లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదేకాలానికిగాను బ్యాంక్ రూ.18,643 కోట్లుగా నమోదైంది. సమీక్షకాలంలో బ్యాంక్ ఆదాయం రూ.1,43,876 కోట్ల నుంచి రూ.1,40,412 కోట్లకు పడిపోయినట్లు వెల్లడించింది.

కుప్పకూలిన బ్యాంక్ షేరు

నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించడంతో ఎస్బీఐ బ్యాంక్ షేరు కుప్పకూలింది. స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి బ్యాంక్ షేరు 6.62 శాతం వరకు నష్టపోయి రూ.1,019.55 వద్ద స్థిరపడింది. అటు ఎన్‌ఎస్‌ఈలోనూ 6.65 శాతం దిగొచ్చి రూ.1,019.30 వద్ద నిలిచింది. దీంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ రూ.66,691.20 కోట్లు కరిగిపోయి రూ.9,41,107.62 కోట్లకు జారుకున్నది.

- బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 1.49 శాతానికి దిగొచ్చాయి. అంతక్రితం ఏడాది ఇది 1.82 శాతంగా ఉన్నది.
- నికర ఎన్‌పీఏ కూడా 0.47 శాతం నుంచి 0.39 శాతానికి పడిపోయాయి.
- ఏకీకృత విషయానికి వస్తే రూ.1,81,079 కోట్ల ఆదాయంపై రూ.19,643 కోట్ల నికర లాభాన్ని గడించింది.
- రూపాయి ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకూ రూ.17.35 డివిడెండ్‌ను బోర్డు ప్రకటించింది.

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నప్పటికీ రుణాల్లో వృద్ధి 13-15 శాతంగా నమోదైంది. అయితే ఈ యుద్ధం మరో ఆరు నెలల కొనసాగితే దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపనున్నది. వృద్ధి, డిపాజిట్ల మధ్య వ్యత్యాసం పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తున్నది.

- సీఎస్ శెట్టి, ఎస్బీఐ చైర్మన్

బీవోఐ ఆకర్షణీయం

న్యూఢిల్లీ, మే 8: బ్యాంక్ ఆఫ్ ఇండియా(బీవోఐ) ఆకర్షణీయమైన ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికిగాను రూ.3,016 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.2.626 కోట్ల లాభంతో పోలిస్తే 15 శాతం వృద్ధి కనబరిచింది. సమీక్షకాలంలో బ్యాంక్ ఆదాయం రూ.21,751 కోట్ల నుంచి రూ.22,685 కోట్లకు పెరిగినట్టు వెల్లడించింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 3.27 శాతం నుంచి 1.98 శాతానికి దిగిరాగా, నికర ఎన్‌పీఏ కూడా 0.82 శాతం నుంచి 0.56 శాతానికి దిగొచ్చింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.79,820 కోట్ల ఆదాయంపై రూ.10,527 కోట్ల నికర లాభాన్ని గడించింది. మరోవైపు, రూ.10 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.4.65 డివిడెండ్‌ను బ్యాంక్ ప్రతిపాదించింది.

నష్టాల్లోనే స్టాక్ మార్కెట్లు

ముంబై, మే 8: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోరోజూ నష్టాలకే పరిమితమయ్యాయి. పశ్చిమాసియాలో భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతల నడుమ బీఎస్‌ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 516.33 పాయింట్లు లేదా 0.66 శాతం పడిపోయి 77,328.19 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఈ సూచీ నిఫ్టీ కూడా 150.50 పాయింట్లు లేదా 0.62 శాతం కోల్పోయి 24,176.15 వద్ద నిలిచింది. ముడి చమురు సరఫరాపై నెలకొన్న ఆందోళనలతోనే మదుపర్లు అమ్మకాల ఒత్తిడికి లోనైనట్టు విశ్లేషకులు చెప్తున్నారు.

యాక్షన్ సీక్వెన్స్ కోసం రిహార్సల్స్



ప్రభాస్ కథానాయకుడిగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్పిరిట్'. ఇప్పటికే ఈ సినిమా తాలూకు ఓ షెడ్యూల్ పూర్తయింది. గతంలో విడుదల చేసిన ఆడియో గ్లింప్స్‌కి అద్భుత స్పందన రావడంతో సినిమాపై మరింతగా అంచనాలు పెరిగాయి. తాజాగా ఈ సినిమాలోని కీలకమైన యాక్షన్ ఘట్టాల కోసం హీరో ప్రభాస్ స్పెషల్ రిహార్సల్స్ చేయబోతున్నారట. కాప్ స్టోరీగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో హై ఇంటెన్సిటీ యాక్షన్ సీక్వెన్స్ ఉంటాయని, అవే హైలైట్‌గా నిలుస్తాయని చెబుతున్నారు. దాంతో ఈ పోరాట ఘట్టాల్లో పర్‌ఫెక్షన్ కోసం ప్రభాస్ రిహార్సల్స్ చేస్తున్నారని తెలిసింది. ఈ సినిమాలో ప్రభాస్ చాలా వరకు బరువు తగ్గి కనిపిస్తారని, తొలిసారి పోలీస్ అధికారి పాత్రలో నటిస్తుండటంతో ఫిట్‌నెస్‌పై ఆయన ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, ప్రభాస్ మేకోవర్ అందరినీ సర్‌ప్రైజ్ చేస్తుందని అంటున్నారు. టీ సీరిస్, భద్రకాళి ఫిల్మ్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. వచ్చే ఏడాది మార్చి 5న ప్రేక్షకుల ముందుకురానుంది.


చిత్రం



అభిమానుల కోసం స్పెషల్ అప్‌డేట్?

అగ్ర నటుడు ఎన్టీఆర్ కథానాయకుడిగా త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఓ భారీ పానిండియా పౌరాణిక చిత్రం తెరకెక్కనున్న విషయం తెలిసిందే. సితార ఎంటర్‌టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మించనున్న ఈ చిత్రానికి 'గాడ్ ఆఫ్ వార్' అనే టైటిల్ ప్రచారంలో ఉన్నది. షణ్ముఖపురాణంలోని ఓ కీలక ఘట్టం ఆధారంగా ఈ సినిమాను త్రివిక్రమ్ తెరకెక్కించనున్నట్టు తెలిసింది. ఈ సినిమాలో కుమారస్వామిగా ఎన్టీఆర్ కనిపిస్తారు. ఇదిలావుంటే.. ఈ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్‌ని త్రివిక్రమ్ ఇప్పటికే పూర్తి చేశారట. మే 20న ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుంచి ఓ స్పెషల్ అప్‌డేట్ రానుందనే వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. ఓ అనౌన్స్‌మెంట్ వీడియోను కూడా విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారట. కథ, కాన్సెప్ట్ గురించి ఈ వీడియోలో హింట్ ఇవ్వనున్నారట. హై విజువల్ ఎఫెక్ట్స్‌తో పవర్‌ఫుల్ బ్యాక్‌డ్రాప్‌తో ఈ వీడియోను డిజైన్ చేస్తున్నట్టు తెలిసింది. ప్రస్తుతం ప్రశాంత్‌నీల్ సినిమాతో ఎన్టీఆర్ బిజీగా ఉన్నారు. ఆ ప్రాజెక్ట్ పూర్తయ్యాక, తారక్ ఈ సినిమాపై దృష్టి పెట్టనున్నారు. నిజంగా తారక్ అభిమానుల్లో జోష్‌ని నింపే వార్త ఇది.

ద్విపాత్రాభినయంలో రామ్ ఔర్ శ్యామ్?



బాలీవుడ్ సూపర్‌స్టార్ అక్షయ్‌కుమార్ కథానాయకుడిగా టాలీవుడ్ అగ్ర నిర్మాత దిల్‌రాజు బాలీవుడ్‌లో నిర్మిస్తున్న ప్రతిష్టాత్మక యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్‌కు 'రామ్ ఔర్ శ్యామ్' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. 'రామ్ ఔర్ శ్యామ్' అనేది 1967లో లెజెండ్రీ యాక్టర్ దిలీప్‌కుమార్ నటించిన క్లాసిక్. అదే పేరును ఈ సినిమాకు పెట్టడం విశేషం. ఇదిలావుంటే.. ఈ సినిమా టాలీవుడ్ బ్లాక్‌బస్టర్ 'సంక్రాంతికి వస్తున్నాం'కి రీమేక్ అని గతంలో వార్తలొచ్చాయి. తాజాగా అందుతున్న సమచారం ప్రకారం 'సంక్రాంతికి వస్తున్నాం'లోని థీమ్ మాత్రమే తీసుకొని హీరో పాత్రను డ్యూయెల్‌రోల్‌గా క్రియేట్ చేసి దర్శకుడు అనీస్ బజ్మీ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారట. విద్యాబాలన్ ఇందులో కథానాయిక. వచ్చే ఏడాది మార్చి 17న సినిమా విడుదల కానున్నట్టు సమాచారం. వెల్కమ్, సింగ్ ఈజ్ కింగ్ వంటి బ్లాక్‌బస్టర్స్ తర్వాత అనీస్ బజ్మీ డైరెక్షన్‌లో అక్షయ్‌కుమార్ నటిస్తున్న సినిమా ఇదే. దాంతో ఈ సినిమాపై అంచనాలు దేశవ్యాప్తంగా భారీగా ఉన్నాయి.

రావు బహదూర్ ఆగమనం అప్పుడే..



వెర్సటైల్ యాక్టర్ సత్యదేవ్ కథానాయకుడిగా రూపొందుతున్న సైకలాజికల్ డ్రామా 'రావు బహదూర్'. వెంకటేశ్ మహా దర్శకుడు. చింతా గోపాలకృష్ణరెడ్డి, అనురాగ్‌రెడ్డి, శరత్‌చంద్ర నిర్మాతలు. సూపర్‌స్టార్ మహేశ్‌బాబు, నమ్రత శిరోద్కర్, జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్ సమర్పణలో రూపొందుతున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్నది. జూలై 3న సినిమాను థియేటర్లలో విడుదల చేయనున్నట్టు శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో వయసు పైబడిన రాయల్ లుక్‌లో సత్యదేవ్ కనిపించారు. సైకలాజికల్ డ్రామాకు తగ్గట్టుగా ఓ ఇంటెన్స్ వాతావరణం ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నది. దీపా థామస్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో వికాస్ ముప్పాల, బాలా పరాశర్, ఆనంద్ భారతి, ప్రణయ్ వాక, మాస్టర్ కిరణ్ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: కార్తీక్ పర్మార్, సంగీతం: స్మరణ్‌సాయి, నిర్మాణం: ఏ ప్లస్ ఎస్ మూవీస్, శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్.

నిజ జీవిత ఘటనల రాయవలస



కార్తిక్ జయంతి హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'రాయవలస'. రాధిక జయంతి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని గోపీకృష్ణ జే నిర్మిస్తున్నారు. శుక్రవారం టీజర్‌ను లాంచ్ చేశారు. ఈ కార్యక్రమానికి యువహీరో ఆకాష్ జగన్నాథ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. భావోద్వేగాలు కలబోసిన యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇదని, ఈ సినిమా ద్వారా తన కుమారుడిని హీరోగా ఇంట్రడ్యూస్ చేస్తున్నానని దర్శకురాలు రాధిక జయంతి చెప్పారు. నిజ జీవిత ఘటనల ఆధారంగా తయారు చేసుకున్న కథాంశమిదని, తప్పకుండా అందరికి కనెక్ట్ అవుతుందని హీరో కార్తీక్ అన్నారు. గతంలో షార్ట్స్ ఫిలిమ్స్, వెబ్‌సిరీస్‌లు తీసిన తమ సంస్థ ఈ సినిమా ద్వారా ఇండస్ట్రీలోకి అడుగుపెడుతున్నదని నిర్మాత గోపీకృష్ణ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: అర్జున్ బాలా, కథ, సంభాషణలు: రాఖీ ఏ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: రాధిక జయంతి.

అనుకున్నదొకటి జరిగిందొకటి!



నటి సమంతకు కథానాయికగా ఎంత క్రేజ్ ఉందో, ఫ్యాషన్ ప్రపంచంలో కూడా అంత క్రేజుంది. తాజాగా 'ది నోడ్' అనే మ్యాగజైన్ కవర్ పేజీ కోసం సమంత ఫొటో షూట్ చేసింది. ప్రస్తుతం ఆ ఫొటోలు సోషల్ మీడియాలో సంచలనంగా మారాయి. సమంతలోని సరికొత్త ఎనర్జీని ఆవిష్కరించేలా ఈ ఫొటోలున్నాయి. వీటిలో ఆమె ధరించిన అవుట్‌ఫిట్స్, సామ్ మేకోవర్ డిఫరెంట్‌గా ఉందని అంటున్నారు. ఇదిలావుంటే.. ఈ ఫొటోలను తన ఇన్‌స్టాలో షేర్ చేస్తూ, తన కెరీర్ తొలినాళ్ల ముచ్చట్లను సమంత పంచుకున్నది. 'నాది ఓ ఊహించని సినిమా ప్రయాణం. అమ్మనాన్నకు మేం ముగ్గురం పిల్లలం. నేను చిన్నదాన్ని. అసలు నటిని కావాలనే ఆలోచనే నాకప్పట్లో లేదు. కాలేజ్ తర్వాత వచ్చిన చిన్న గ్యాప్‌లో సరదాగా మోడలింగ్ వైపు వెళ్లాను. ఈ క్రమంలోనే ఓ సినిమా ఆడిషన్‌కి వెళ్లి హీరోయిన్‌గా సెలక్టయిపోయాను. ఓ ఏడాది పాటు సినిమాలు చేసి, మళ్లీ కాలేజ్ కెళ్లి చదువుకుందాం అనుకున్నా. కానీ ఈ గ్లామర్ ప్రపంచం నన్నొదలల్లేదు' అంటూ రాసుకొచ్చింది సమంత.

స్వయంవర ఘట్టాల్లో రామాయణ





భారతీయ పౌరాణిక ఇతిహాసం రామాయణంలో సీతా స్వయంవర ఘట్టం అత్యంత విశిష్టమైనది. పరమశివుడి దివ్యాయుధం అయిన శివధనస్సుని విరిచి శ్రీరాముడు సీతాదేవిని సహధర్మచారిణిగా స్వీకరిస్తాడు. తాజాగా ప్రతిష్టాత్మక 'రామాయణ' చిత్రంలో భాగంగా సీతాస్వయంవర ఘట్టాలను తెరకెక్కిస్తున్నారు. రణబీర్‌కపూర్ రాముడిగా, సీత పాత్రలో సాయిపల్లవి నటిస్తున్న ఈ చిత్రానికి నితేష్ తివారి దర్శకత్వం వహిస్తున్నారు. కన్నడ అగ్ర నటుడు యశ్ రావణుడి పాత్రను పోషిస్తున్నారు. దాదాపు 4000కోట్ల భారీ వ్యయంతో రెండు భాగాలుగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ ఏడాది దీపావళికి తొలి భాగం విడుదలకానుంది. ప్రస్తుతం ముంబయి శివారు ప్రాంతంలోని ఫిల్మ్‌సిటీలో సీతా స్వయంవర ఘట్టాల కోసం మిథిలా నగర వైభవాన్ని పునఃసృష్టిస్తూ భారీ సెట్‌ను తీర్చిదిద్దారు. ప్రస్తుతం రావణ పాత్రధారి యశ్‌పై కీలక ఘట్టాలను చిత్రీకరిస్తున్నారు. సీతా స్వయంవరంలో పాల్గొన్న రావణుడు విల్లుని మోయలేక గర్వభంగం చెందే సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు. ఇందులో యశ్ అభినయం పతాకస్థాయిలో ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ తాజా షూటింగ్‌లో యశ్, సాయిపల్లవి పాల్గొంటున్నారు.



దాదాసాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'సంతాన ప్రాప్తిరస్తు' చిత్రానికిగాను హీరో విక్రాంత్ 'సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్స్- జ్యూరీ స్పెషల్' అవార్డును అందుకున్నారు. కెరీర్ ఆరంభంలోనే ప్రతిష్టాత్మక అవార్డు దక్కడంపై హీరో విక్రాంత్ ఆనందం వ్యక్తం చేశారు. 'సంతానప్రాప్తిరస్తు' చిత్రాన్ని మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ పతాకాలపై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించారు. గత ఏడాది నవంబర్‌లో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది.

అనకాపల్లి లబ్బరు బొమ్మ




విక్రమ్ సహిదేవ్, సంధ్య విశిష్ట జంటగా నటిస్తున్న రా అండ్ రస్టిక్ థ్రిల్లర్ 'అనకాపల్లి'. ఖగేష్ తమ్మినేని దర్శకుడు. కండ్రేగుల నాయుడుతో కలిసి ప్రముఖ దర్శకుడు త్రినాథరావు నక్కిన ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. త్వరలో సినిమా విడుదల కానున్నది. తాజాగా ఈ సినిమా నుంచి 'లబ్బరు బొమ్మ' అంటూ సాగే ఓ మాస్ గీతాన్ని మేకర్స్ విడుదల చేశారు. రాంబాబు గోశాల రాసిన ఈ పాటను దేవ్‌జాండ్ స్వరపరచగా, శ్రీకృష్ణ, సాహితీ చాగంటి కలిసి ఆలపించారు. తారక్ పొన్నప్ప, నందినీరాయ్‌లపై ఈ పాటను చిత్రీకరించారు. మాస్ ఆడియన్స్‌కి నచ్చేలా ఈ పాటను దర్శకుడు ఖగేష్ తమ్మినేని తెరకెక్కించారు. ఈ చిత్రానికి కథ, కథనం: నక్కిన త్రినాథరావు, కెమెరా: మాయా.వి, నిర్మాణం: భవ్యశ్రీ మూవీ మేకర్స్, నక్కిన నెరేటివ్స్.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, H.Nos. 9-87/3, 9-87/1, Adj to Jenvi Conventions, Tumkunta, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

అస్తిత్వంపై దాడి చేస్తరా?

వరంగల్‌లో చారిత్రక కట్టడం కూల్చివేతపై సర్వత్రా విమర్శలు

- ప్రభుత్వ వితండవాదంపై ఆగ్రహం
- మండిపడుతున్న నేతలు, మేధావులు
- తక్షణమే పునరుద్ధరించాలి: కేటీఆర్



అశోక్‌నగర్‌లోని కాకతీయుల కట్టడం(ఫైల్)

వరంగల్, మే 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): వరంగల్‌లో చారిత్రక, వారసత్వ కట్టడం కూల్చివేతపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గంలోని ఖానాపూర్ మండలం అశోక్‌నగర్‌లో 800 ఏండ్ల నాటి కాకతీయుల కట్టడాన్ని ప్రభుత్వం ఇష్టారీతిన కూల్చివేసింది. ప్రభుత్వ తీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. తెలంగాణ అస్థిత్వంపైనే దాడికి దిగడం దారుణమని, ఇలా చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వం తక్షణమే కూల్చివేసిన నిర్మాణాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కూల్చివేతపై ఈ నెల 6వ తేదీన 'కాతీయ కట్టడంపై బుల్డోజర్, తెలంగాణ ఘనచరిత్రకు సమాధి' అనే శీర్షికతో నమస్తే తెలంగాణ ప్రత్యేక కథనాన్ని ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ కథనం పెనుసంచలనం రేపింది. చరిత్ర పరిశోధకులు, వారసత్వ నిర్మాణ పరిరక్షకులు సర్కారుతీరుపై తీవ్ర అభ్యంతరాన్ని, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. మరోవైపు ప్రముఖ న్యాయవాది రామారావు ఇమ్మనేని నేషనల్ మాన్యుమెంట్స్ అథారిటీకి సర్కార్ కూల్చివేతపై ఫిర్యాదు చేశారు. దీంతో నేషనల్ మాన్యుమెంట్స్ అథారిటీ సమగ్ర విచారణ చేసి నివేదిక ఇవ్వాలని వరంగల్ జిల్లా కలెక్టర్, రాష్ట్ర పురావస్తుశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీని ఆదేశించిన విషయం తెలిసిందే.

సర్కార్ వితండవాదన

అశోక్‌నగర్‌లోని కాకతీయ కట్టడం కూల్చివేతపై సర్కార్ వితండవాదానికి దిగింది. అసలు అక్కడ కట్టడమే లేదన్నట్టుగా, కూల్చివేతలో నిజమేలేదని ప్రకటించింది. అదే సమయంలో ఈనెల 6వ తేదీన నర్సంపేట రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, పురావస్తు శాఖ అధికారులు, ఖానాపూర్ తహసీల్దార్, తెలంగాణ విద్యా, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీజీఈడబ్ల్యూఐడీసీ) ప్రతినిధులతో కలిసి సంయుక్తంగా తనిఖీ చేసినట్టు పేర్కొన్నది. అయితే, కూల్చివేతపై వస్తున్న ఆరోపణల్లో నిజంలేదని అసలు విషయాన్ని దాచివేసే ప్రయత్నం చేస్తున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అదే సమయంలో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ కోసం కేటాయించిన 30 ఎకరాల భూమిలో దట్టమైన పొదలు, చెట్లు ఉన్నాయని, వాటిని తొలగించి చదును చేస్తుండగా ఒక పాత శిథిల కట్టడం అవశేషాలు బయట పడ్డాయని అధికారులు తెలిపారు. ఇక వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద, స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితో కూల్చివేతల శిథిలాలను స్వయంగా పరిశీలించారు. చరిత్రకారులు, స్థపతులు, పురావస్తు శాఖ అధికారులతో సంప్రదించి ఆ నిర్మాణాన్ని అదే ప్రాంతంలో పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అసలు అక్కడ ఎటువంటి కట్టడమే లేనప్పుడు ఎట్లా పునరుద్ధరిస్తామని హామీ ఎట్లా ఇచ్చారు? అని అధికారుల తీరుపై స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

ఇంత నిర్లక్ష్యమా?

ఈ పాలకులకు కొత్త చరిత్రను నిర్మించటం తెలియకపోగా ఉన్న చరిత్రను కాపాడుకునే స్పృహలేకపోవటం దారుణమని తెలంగాణ అస్తిత్వ వేదిక చైర్మన్ వీ ప్రకాశ్ ఆరోపించారు. తెలంగాణ అంతటా అడుగడుగునా చారిత్రక సంపద ఉందనే విషయాన్ని నిజాం గుర్తించి వాటిని పరిరక్షించాడని పేర్కొన్నారు. వరంగల్‌లోని కాకతీయుల కట్టడాన్ని నిర్లక్ష్యంగా కూల్చివేయడమే కాకుండా సాకులు వెతుకుతున్నదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన తప్పును తెలుసుకొని కూల్చివేసిన ఆలయాన్ని, చారిత్రక సంపదను పరిరక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

–వీ ప్రకాశ్,
చైర్మన్, తెలంగాణ అస్తిత్వవేదిక

తక్షణమే పునరుద్ధరించాలి
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

తెలంగాణ చరిత్ర, సంస్కృతి, అస్తిత్వం మీద ఏమాత్రం అవగాహన లేని మూర్ఖుల పాలన రాష్ట్రంలో కొనసాగుతున్నదని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కాకతీయులు నిర్మించిన పురాతన శివాలయాన్ని రాష్ట్ర సర్కార్ ధ్వంసం చేసి కుప్పపోయడం దారుణమని ఆవేదన వ్యక్తంచేశారు. వేల ఇండ్లను కర్కశంగా కూల్చి, లక్షల వృక్షాలను నరికిన రేవంత్ ప్రభుత్వం ఇప్పుడు చారిత్రక సంపదను కూడా వదలడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే విధ్వంసాన్ని ఆపి కూల్చివేసిన శివాలయాన్ని, కాకతీయ కట్టడాన్ని పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు.

11 నుంచి బీసీ గురుకులంలో సీట్ల భర్తీ

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ) : మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల విద్యాసంస్థల్లో 6, 7, 8, 9 తరగతుల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ ఈ నెల 11 నుంచి ప్రారంభం కానున్నది. ఈ మేరకు గురుకుల సొసైటీ సెక్రటరీ సైదులు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. బీసీ గురుకులంలో మొత్తం 10,138 బ్యాక్‌లాగ్ సీట్లు అందుబాటులో ఉండగా, వాటీ భర్తీ కోసం ప్రవేశ పరీక్ష నిర్వహించి ఫలితాలు వెల్లడించారు. మెరిట్ విద్యార్థుల జాబితాను https://mjptbcwreis.telangana.gov.in వెబ్‌సైట్‌లో పెట్టారు. ఎంపికైన విద్యార్థులు నిర్దేశిత గురుకులంలో 11 నుంచి అడ్మిషన్లు పొందాలని సొసైటీ సెక్రటరీ సూచించారు.

ఆన్‌లైన్‌లోనే టీచర్ల మెడికల్ బిల్లుల స్వీకరణ

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ) : టీచర్లు, పెన్షనర్ల మెడికల్ బిల్లులను ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నట్టు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు. ఐఎస్ఎంఎస్ పోర్టల్ ద్వారా బిల్లులను ప్రాసెస్ చేస్తామని, వివరాల కోసం https://schooledu.telangana.gov.in/SCHOOLEDUCATION వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

50వేల వేతనమివ్వాలి

గవర్నమెంట్ డిగ్రీ గెస్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ డిమాండ్

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టో హామీ మేరకు గెస్ట్ లెక్చరర్లకు నెలకు రూ.50వేల వేతనాన్ని అమలు చేయాలని గవర్నమెంట్ డిగ్రీ గెస్ట్ లెక్చరర్స్ అసోసియేషన్(జీడీజీఎల్ఏ) డిమాండ్ చేసింది. డిగ్రీ గెస్ట్ లెక్చరర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నాంపల్లిలోని కళాశాల విద్యాశాఖ కమిషనరేట్ ఎదుట గెస్ట్ లెక్చరర్లు నిరసన తెలిపారు. ప్రస్తుతం ఏడాదికి 7 నెలల వేతనం మాత్రమే తీసుకుంటున్నామని, 12 నెలల కన్సాలిడేటెడ్ పే కింద వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పనిచేస్తున్న వారినే రెన్యూవల్ చేయాలని కోరారు.



భూపాలపల్లిలో బీఆర్ఎస్ నేత గండ్ర జ్యోతిని అరెస్టు చేసి ఈడ్చుకెళ్తున్న పోలీసులు

భూపాలపల్లిలో పోలీస్ జులుం

- మాజీ జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతిని ఈడ్చుకెళ్లిన పోలీసులు
- ఆగ్రహించిన బీఆర్ఎస్ శ్రేణులు.. ధర్నా, రాస్తారోకో

జయశంకర్ భూపాలపల్లి, మే 8(నమస్తే తెలంగాణ) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో వేంకటేశ్వర స్వామి సాక్షిగా పోలీసులు మహిళలపై జులుం ప్రదర్శించారు. ఆలయంలో ఉన్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ జిల్లా మాజీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతితోపాటు మరి కొందరు మహిళా కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి ఈడ్చుకుంటూ తీసుకెళ్లారు. వివరాల్లోకి వెళ్తే.. బీఆర్ఎస్ హయాంలో అప్పటి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి దంపతులు ప్రజల సహకారంతో భూపాలపల్లిలో వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించారు. దేవాదాయ శాఖ అధికారులు ఆలయానికి ట్రస్టు ఏర్పాటు చేసి ప్రమాణ స్వీకారానికి శుక్రవారం ముహూర్తం నిర్ణయించడం వివాదానికి దారి తీసింది. బీఆర్ఎస్ శ్రేణులు, భక్తులు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, గండ్ర జ్యోతి దంపతులు ఆలయానికి చేరుకున్నారు. ఆలయం కేసు కోర్టులో ఉండగా ట్రస్టు ఎలా ఏర్పాటు చేస్తారని, అధికార పార్టీ నేతల తీరుపై మండిపడిన గండ్ర వెంకటరమణారెడ్డి అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోగా గండ్ర జ్యోతి మహిళా కార్యకర్తలతో అక్కడే ఉన్నారు. ఎవరూ లేని సమయం చూసిన పోలీసులు గండ్ర జ్యోతితో పాటు మహిళా కార్యకర్తలను బలవంతంగా స్టేషన్‌కు ఈడ్చుకెళ్లారు. పోలీస్ స్టేషన్‌లో గండ్ర జ్యోతి స్పృహ తప్పి పడిపోగా జిల్లా కేంద్రంలోని దవాఖానకు తరలించారు. దీంతో పోలీసుల వైఖరిని నిరసిస్తూ భూపాలపల్లిలోని ప్రధాన రహదారిపై మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి బైఠాయించారు.

క్రిశాంక్‌కు నిర్మల్ కోర్టులో బెయిల్ మంజూరు



నిర్మల్ అర్బన్, మే 8 : రాష్ట్ర ఖనిజాభివృద్ధి శాఖ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మన్నె క్రిశాంక్‌కు శుక్రవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని కోర్టు జడ్జి బెయిల్ మంజూరు చేశారు. కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా నేత రాజేంద్రకుమార్ ఇంటికి వెళ్లి గొడవ చేశారన్న ఆరోపణలపై కాకర్లపల్లి పోలీసులు అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. 2024లో ముథోల్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన పాత కేసులో పోలీసులు పీటీ వారెంట్ జారీ చేశారు. దీంతో పాటు పలు స్టేషన్లలో కేసులు నమోదు కాగా పీటీ వారెంట్‌లో భాగంగా శుక్రవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని కోర్టుకు ఆయనను పోలీసులు తీసుకువచ్చారు. సీనియర్ సివిల్ కోర్టు జడ్జి విచారించి బెయిల్ మంజూరు చేశారు. నిర్మల్ నుంచి ఆయనను సంగారెడ్డి జైలుకు పోలీసులు తీసుకెళ్లారు.

మార్కెట్లో మరో మిర్చి వ్యాపారి టోకరా!

రూ.6కోట్లకు ఐపీ పెట్టినట్టు ప్రచారం

కాశీబుగ్గ, మే 8 : వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో మరో మిర్చి వ్యాపారి రూ.6 కోట్లు ఐపీ పెట్టినట్టు ప్రచారం జరుగుతున్నది. ఇటీవల లాడె తిరుపతి అనే మిర్చి వ్యాపారి అడ్తిదారులకు రూ.3కోట్ల వరకు ఎగనామం పెట్టిన విషయం తెలిసిందే. నెల రోజులు గడవకముందే మరో వ్యాపారి రూ.6కోట్లకు టోకరా పెట్టాడు. దీంతో అడ్తిదారుల గుండెల్లో బాంబు పేలినట్లుయింది. వెంటనే చాంబర్ అధ్యక్షుడు.. బాధిత అడ్తి వ్యాపారుల బాకీల వివరాలను సేకరిస్తున్నట్టు తెలిసింది. సంబంధిత మిర్చి వ్యాపారి పది రోజుల నుంచి అందుబాటులో లేడని తెలిసింది.

ఐడీపీఎల్ భూములపై కఠిన చర్యలొద్దు: హైకోర్టు

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): పారిశ్రామిక అవసరాల నిమిత్తం ఐడీపీఎల్‌కు కేటాయించిన భూముల స్వాధీన వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోరాదని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు జస్టిస్ ఈవీ వేణుగోపాల్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్ ధర్మాసనం శుక్రవారం మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ పిటిషన్‌పై జూన్ 22న విచారణ జరగనున్నందున ఐడీపీఎల్ దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌లో ఈ ఆదేశాలు జారీ చేస్తున్నట్టు ప్రకటించింది. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్‌లో ఐడీపీఎల్‌కు చెందిన 891.38 ఏకరాలను స్వాధీనం చేసుకుని టీజీఐఐసీకి అప్పగించాలంటూ 2008 జనవరి 27న కలెక్టర్ జారీచేసిన ఉత్తర్వులను వాపస్ తీసుకోవాలని అదే ఏడాది ఫిబ్రవరి 6న బీఐఎస్ఆర్ (బోర్డ్ ఆఫ్ ఇండస్ట్రియల్ అండ్ ఫైనాన్షియల్ రీకన్‌స్ట్రక్షన్) ఉత్తర్వులు ఇచ్చింది. వాటి అమలును నిలిపివేస్తూ ఇటీవల హైకోర్టు సింగిల్ జడ్జి ఆదేశాలిచ్చారు. ఆ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఐడీపీఎల్ శుక్రవారం హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. దీంతో ఐడీపీఎల్ భూముల వివాదాన్ని సింగిల్ జడ్జి వద్ద తేల్చుకోవాలని, అప్పటి వరకు భూమి విషయంలో ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోరాదని ద్విసభ్య ధర్మాసనం ఆదేశించింది.

వడ్లు మళ్లించిన మిల్లర్లపై దర్యాప్తు జరగాల్సిందే

ప్రస్తుత దశలో జోక్యం చేసుకోలేం • కేసుల కొట్టివేతకు హైకోర్టు నిరాకరణ

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): మిల్లింగ్ కోసం పంపిన వడ్లను మళ్లించారన్న ఆరోపణలపై దర్యాప్తు దశలో తాము జోక్యం చేసుకోబోమని హైకోర్టు స్పష్టం చేసింది. ఆ మిల్లర్లపై దర్యాప్తు జరగాల్సిందేనని తేల్చిచెప్పింది. 2022-23లో మిల్లింగ్ నిమిత్త ప్రభుత్వం సరఫరా చేసిన వడ్లను 360 మిల్లుల యజమానులు తమ స్వప్రయోజనాల కోసం దారి మళ్లించారని, ఆ ధాన్యం నిల్వలకు సమానమైన బియ్యాన్ని పౌరసరఫరాల కార్పొరేషన్‌కు అందజేయలేదని, రూ.3,960 కోట్ల బకాయిలను ప్రభుత్వానికి చెల్లించలేదని నమోదైన క్రిమినల్ కేసుల కొట్టివేతకు నిరాకరించింది. వడ్ల మళ్లింపు ఆరోపణలపై మిల్లర్లు దాఖలు చేసిన 58 పిటిషన్లను కొట్టివేస్తూ జస్టిస్ జే శ్రీనివాస్‌రావు ఇటీవల 107 పేజీల తీర్పు వెలువరించారు.

బెడ్ల సరఫరాలో అవకతవకలపై విచారణ జరపాల్సిందే

పాఠశాల విద్యాశాఖకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని 252 కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలకు 45,360 బంకర్ బెడ్లు, పరుపులు, దిండ్ల సరఫరాలో అవినీతి, అక్రమాలు జరిగాయంటూ బీఆర్ఎస్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విజిలెన్స్ శాఖకు రాసిన లేఖపై విచారణ జరపాలని, అవకతవకలకు బాధ్యులైనవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖకు ఉత్తర్వులు జారీ చేసింది. రూ.15 నుంచి రూ.17 వేలకు లభ్యమయ్యే ఒక్కో బెడ్‌ను కాంట్రాక్టర్ రూ.33 వేలకు సరఫరా చేస్తున్నారని, దీని వల్ల ప్రభుత్వ ఖజానాపై రూ.100 కోట్ల వరకు భారం పడుతుందని వివరించారు. దీంతో ఈ అభియోగంపై విచారణ జరపాల్సిందేనని జస్టిస్ నగేశ్ భీమపాక తీర్పు చెప్పారు.

30 వేలు లంచం తీసుకుంటూ.. చిక్కిన పోస్టల్ ఇన్‌స్పెక్టర్

పరారీలో సూపరింటెండెంట్

వనపర్తి టౌన్, మే 8 : తోటి ఉద్యోగుల నుంచి రూ. 30 లంచం తీసుకుంటూ వనపర్తి పోస్టల్ ఇన్‌స్పెక్టర్ గోపినాథ్ సీబీఐకి చిక్కాడు. 40 మంది ఉద్యోగులకు సంబంధించి ఓటీ విధులకు చెల్లించాల్సిన డబ్బులు ఇవ్వకుండా పోస్టల్ ఇన్‌స్పెక్టర్ గోపినాథ్ ఇబ్బందులకు గురి చేయడంతో చిరు ఉద్యోగులు సంబంధిత సీబీఐ, పోస్టల్ డిపార్ట్‌మెంట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో వనపర్తి పోస్టల్ ఇన్‌స్పెక్టర్ గోపినాథ్ ఓ ఉద్యోగి నుంచి రూ.30 వేలు లంచం తీసుకుంటుండగా గురువారం సాయంత్రం సీబీఐ అధికారులు పట్టుకునే ప్రయత్నం చేశారు. ఈ పరిణామాలను పసిగట్టిన పోస్టల్ ఇన్‌స్పెక్టర్ గోపినాథ్ తాను తీసుకున్న డబ్బులను ట్రెజరర్‌కు ఇచ్చి కార్యాలయం గోడదూకి ఆటోలో పరారయ్యాడు. ఫోన్ సిగ్నల్ ద్వారా గోపినాథ్ కొత్తకోట మదనాపురం రోడ్డు వద్ద నిలిచి ఉన్నట్టు గుర్తించిన సీబీఐ అధికారులు అక్కడికి వెళ్లి అదుపులోకి తీసుకుని వనపర్తి పోస్టల్ కార్యాలయానికి తీసుకువచ్చారు. రాత్రి అంతా విచారణ జరిపి శుక్రవారం ఉదయం రిమాండ్‌కు తరలించారు. పోస్టల్ సూపరింటెండెంట్ పరారీలో ఉన్నట్టు గుర్తించారు.

11న దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలు

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని భవిత సెంటర్లలో చదువుతున్న ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు(దివ్యాంగులు) ఉపకరణాలు పంపిణీ చేయనున్నట్టు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు. 11న ఉమ్మడి జిల్లా కేంద్రాలు, 23లోగా మిగిలిన జిల్లాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి ఉపకరణాలు అందజేస్తామని వివరించారు.



రవీంద్రభారతి చౌరస్తా మీదుగా సీఎం రేవంత్ కాన్వాయ్ వెళ్తుండగా ట్రాఫిక్‌ను నిలిపివేసిన పోలీసులు

సీఎం- ట్రాఫిక్.. సీన్ రిపీట్!

- సీఎం కాన్వాయ్ వస్తున్నదని వాహనాలను నిలిపిన పోలీసులు
- రవీంద్రభారతి వద్ద ట్రాఫిక్‌జామ్
- మిట్టమధ్యాహ్నం ఎండ వేడిమికి రోడ్డుపై వాహనదారులు విలవిల
- ట్రాఫిక్ ఆపొద్దన్న హామీ ఒక్కరోజు స్టంటేనా? అని పలువురి పెదవి విరుపు

ఖైరతాబాద్, మే 8: 'నా కాన్వాయ్ కోసం ట్రాఫిక్‌ను ఆపొద్దు' అన్న సీఎం రేవంత్‌రెడ్డి మాట మళ్లీ తుస్సుమన్నది. సీఎం కాన్వాయ్ వస్తున్నదని శుక్రవారం హైదరాబాద్ నగర నడిబొడ్డున ఉన్న రవీంద్రభారతి వద్ద పోలీసులు ఎక్కడి వాహనాలను అక్కడే నిలిపేశారు. దీంతో నడి ఎండలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యమంత్రి అయిన తొలినాళ్లలో కూడా రేవంత్‌రెడ్డి ఇదే హామీ ఇచ్చారు. ఇటీవల సీఎం కాన్వాయ్ శంషాబాద్ వెళ్తుండగా, చాలాసేపు వాహనాలు నిలిపేశారని పలువురు వాహనదారులు పోలీసులపై అసహనం వ్యక్తంచేశారు. ఈ విషయం తెలిసి తన కాన్వాయ్ వెళ్తుంటే ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలిగించొద్దని ఆ మరునాడే సీఎం పోలీస్ శాఖను ఆదేశించారు. ఆ తర్వాత శంషాబాద్ నుంచి జూబ్లీహిల్స్‌లో ఉన్న తన నివాసానికి వెళ్తున్నప్పుడు ట్రాఫిక్‌ను నిలిపివేయకుండానే సీఎం కాన్వాయ్ వెళ్లింది. ఈ విషయంపై వివిధ సామాజిక ప్రసార మాధ్యమాల్లో పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్నారు. సీన్ కట్ చేస్తే శుక్రవారం మధ్యాహ్నం రవీంద్రభారతి చౌరస్తా మీదుగా సీఎం కాన్వాయ్ వస్తున్నదని పెద్ద ఎత్తున పోలీసులు అక్కడికి చేరుకున్నారు. నలువైపులా ఎక్కడి వాహనాలను అక్కడే నిలిపివేశారు. దీంతో కోఠి, లక్డీకాపూల్, ట్యాంక్‌బండ్ వైపునకు వెళ్లే వాహనదారులు ఎండవేడిమికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రభుత్వం కేవలం మాటలకేనని, చేతల్లో ఏమీ ఉండదంటూ ఈ సందర్భంగా పలువురు వాహనదారులు అసహనం వ్యక్తంచేశారు.

రాష్ట్రంలో రాక్షస పాలన

- ప్రశ్నించిన ప్రతిపక్షాలపై దాడులు, కేసులు
- హామీలు అమలు కోరితే బెదిరింపులు
- అక్కసుతోనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమ కేసు: బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి



హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాక్షస పాలన కొనసాగిస్తున్నదని బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి దుయ్యబట్టారు. ప్రశ్నించిన ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై దాడులకు దిగడం, కేసులు బనాయించడం రివాజుగా మారిందని మండిపడ్డారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. రెండున్నరేండ్ల పాలనలో అన్నదాతలు అరిగోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. షాపుల్లో ఉండాల్సిన యూరియా యాప్‌ల్లోకి తెచ్చిన ఘనత రేవంత్ సర్కార్‌కే దక్కిందని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌కు ఢిల్లీకి మూటలు మోయడం మీద ఉన్న శ్రద్ధ, కొనుగోలు కేంద్రాల్లోని వడ్ల మూటలను కొనుగోలు చేయడంపై లేదని దెప్పిపొడిచారు. రైతుల కష్టాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కేటీఆర్‌పై ప్రభుత్వం అక్రమ కేసు పెట్టడం దుర్మార్గమని ఖండించారు. తెలంగాణ మాండలికంలో ఎక్కడ సచ్చిండని రాహుల్‌ను ఉద్దేశించి సంబోధించిన కేటీఆర్‌పై కేసు పెట్టిన రేవంత్‌రెడ్డి.. వడ్లకుప్పలపై రైతులు ప్రాణాలు కోల్పోతున్నారు.. మరి నీపై ఎన్ని కేసులు పెట్టాలి? అని ప్రశ్నించారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ సావు కోరిన రేవంత్‌రెడ్డిని ఉరితీసినా తప్పులేదని స్పష్టం చేశారు.

మానవ సేవయే జీవిత పరమార్థం

- తలసేమియా చిన్నారుల ధైర్యం స్ఫూర్తిదాయకం
- రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా



హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ) : ఇతరులకు సేవ చేయడమే మానవ జీవితానికి నిజమైన అర్థం అని గవర్నర్ శివప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. మానవ సేవే జీవిత పరమార్థంగా భావించాలని ఆయన పేర్కొన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ బ్రాంచ్ ఆధ్వర్యంలో శుక్రవారం లోక్‌భవన్ సంస్కృతి హాల్‌లో ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం, ప్రపంచ తలసేమియా దినోత్సవం నిర్వహించారు. రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యూనెంట్ చిత్రపటానికి గవర్నర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి, దాతలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1920 నుంచి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మానవ సేవకు అంకితభావంతో పనిచేస్తున్నదన్నారు. తెలంగాణలో వేల మంది రక్తదానం, ఆరోగ్య శిబిరాలు తదితర కార్యక్రమాల్లో విశేష సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిషోర్, సంయుక్త కార్యదర్శి శశికిరణాచారి, రెడ్‌క్రాస్ సొసైటీ జనరల్ సెక్రటరీ, సీఈవో శ్రీరాములు పాల్గొన్నారు.

ఆ తీర్పుతో వైద్యులకు తీరని నష్టం

కోర్టు పునఃపరిశీలించి తీర్పును సవరించాలి: ప్రదీప్

ఖైరతాబాద్, మే 8 : చికిత్స పొందుతూ రోగి మరణిస్తే.. బాధ్యుడైన వైద్యుడి కుటుంబం పరిహారం చెల్లించాలని ఇటీవల అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాలని తెలంగాణ డాక్టర్స్ ఫెడరేషన్(టీజీడీఎఫ్) న్యాయ కమిటీ ప్రతినిధి డాక్టర్ ప్రదీప్ వజ్జ కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి వైద్యుడికి ఎమర్జెన్సీ కేసులనేవి సవాల్‌గా ఉంటాయని అన్నారు. చివరి క్షణం వరకు రోగిని రక్షించాలనే వైద్యులు పనిచేస్తారని, ఎప్పుడైనా రోగి చనిపోతే వైద్యుడి తప్పు ఉందని అనలేమని చెప్పారు. ఒకవేళ వైద్యుడి నిర్లక్ష్యంతో రోగి చనిపోతే పరిహారం చెల్లించాలనడంలో తప్పులేదని, కానీ చికిత్స అందించిన వైద్యుడు చనిపోతే అతని కుటుంబ సభ్యులు నష్టపరిహారం చెల్లించాలన్న తీర్పు తమను నిరుత్సాహానికి గురిచేసిందని పేర్కొన్నారు. పునఃపరిశీలన చేసి తీర్పును సవరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో తెలంగాణ డాక్టర్స్ ఫెడరేషన్ హెడ్ కిరణ్ కుమార్, ఉపాధ్యక్షుడు చేతన్‌రెడ్డి, సురేశ్‌రాజు పాల్గొన్నారు.

అధ్వానంగా ఉద్యానవన శాఖ

కార్యాలయం దాటరు.. పర్యవేక్షణ చేయరు

- రెండున్నరేండ్లుగా పట్టించుకోని అధికారులు
- నిరుపయోగంగా మారిన లక్షల విలువైన పాలీ హౌస్‌లు
- డైరెక్టరేట్ కార్యాలయం పక్కనే మూతపడ్డ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్
- అధికారుల నిర్లక్ష్య ధోరణిపై మండిపడుతున్న ఉద్యాన ప్రేమికులు

హైదరాబాద్, మే 8 (నమస్తేతెలంగాణ) : రాష్ట్రంలో ఉద్యానవన శాఖ అధికారుల తీరు అధ్వానంగా తయారైంది. అధికారులు కేవలం కార్యాలయానికే పరిమితమై పర్యవేక్షణ మరిచారనే విమర్శలు పెరుగుతున్నాయి. ప్రభుత్వం నుంచి ఉద్యాన రైతులకు ప్రోత్సాహకాలు తగ్గాయని, రాష్ట్రంలో ఉద్యానసాగు వెలవెలబోతున్నదని గణాంకాలు చెబుతున్నా అధికారులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. ఓవైపు నిధుల లేమితో ఉద్యానశాఖ కునారిల్లుతుండగా.. రాష్ట్రస్థాయిలో అధికారులు మాత్రం రూ.లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన వనరులను వృథాగా వదిలేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బీఆర్ఎస్ హయాంలో పెరిగిన సాగు

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నగరాలు, పట్టణాల్లో కూరగాయలు, పూల సాగును ప్రోత్సహించేందుకు అత్యాధునిక పద్ధతిలో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ –సీఈవో 'కేంద్రాలు ఏర్పాటు చేసింది. వీటిలో కూరగాయలు, పూల మొక్కలు పెంచి వాటిని నగర ప్రజలకు సీజన్‌లవారీగా సరఫరా చేసేది. దీనివల్ల పట్టణాలు, నగరాల్లో పెద్దఎత్తున మిద్దె తోటల సాగు పెరిగింది. మరోవైపు ఈ కేంద్రాలు మొక్కలు, కూరగాయలు, పూలను విక్రయించడం ద్వారా ఉద్యానశాఖకు ఆదాయం సమకూరేది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అధికారులు నిర్వహణను గాలికొదిలేశారు.

20వేల మీటర్ల విస్తీర్ణంలో పాలీ హౌస్‌లు

బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యానవన రైతులను ప్రోత్సహించేందుకు జీడిమెట్ల, పబ్లిక్ గార్డెన్స్ వద్ద 20 మీటర్ల విస్తీర్ణంతో రెండు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. మీటర్‌కు రూ.1,000ల వ్యయంతో పాలీహౌస్‌లు ఏర్పాటు చేసింది. దాదాపు ఒక్కో పాలీహౌస్ ఏర్పాటుకు రూ.5 నుంచి రూ.10 లక్షలు ఖర్చు చేశారు. జీడిమెట్లలో ఏర్పాటు చేసిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో విదేశీ రకం పూలు, కూరగాయల సాగుపై రైతులకు శిక్షణ ఇవ్వడంతోపాటు సిద్దిపేట, సంగారెడ్డి, మేడ్చల్, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల రైతులకు వివిధ రకాలైన కూరగాయలు, పూల నారును రైతులకు సబ్సిడీపై సరఫరా చేసేది. దీని ద్వారా సీఈవోలకు ఆదాయం సమకూరేది. ఫలితంగా పదుల సంఖ్యలో కూలీలకు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉపాధి కలిగేది. ప్రస్తుతం ఆ ఉపాధి మొత్తం పోయిందని కూలీలు ఆందోళన చెందుతున్నారు.

నిరుపయోగంగా 'ఎక్సలెన్స్' కేంద్రం...

ఉద్యానవన శాఖ ఉన్నతాధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం.. పబ్లిక్‌గార్డెన్స్ పరిసరాల్లోని 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' కేంద్రం. సుమారు 10 వేల మీటర్ల విస్తీర్ణంలో అప్పటి ప్రభుత్వం అక్కడ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ కేంద్రంలో అప్పట్లో విధులు నిర్వహించిన అధికారులు ప్రయోగాత్మకంగా హైబ్రిడ్ రకం వంగడాలతో ప్రయోగాలు చేసి సత్ఫలితాలు సాధించారు. ముఖ్యంగా ఆగ్రోస్ ఆవరణలో అర్బన్ ఫార్మింగ్ విభాగం అధికారులు ప్రయోగాత్మకంగా మిద్దె తోటల పెంపకం పథకాన్ని రూపొందించి అమలు చేశారు. దాదాపు నెలలో 3 వేలకుపైగా యూనిట్లు ఏర్పాటు చేశారు. కానీ రెండున్నరేండ్లుగా అధికారులు ఒక్క కొత్త పథకాన్ని కూడా రూపొందించకపోయారు. అంతే కాకుండా పబ్లిక్ గార్డెన్‌లో శాసనమండలి, అసెంబ్లీ మధ్యలో ఏర్పాటు చేసిన పాలీహౌస్‌లో దేశంలోనే మొదటిసారిగా అంటుకట్టు పద్ధతిలో వంకాయ, టమాటాను సాగు చేసి చూపించారు.డెకరేషన్ మొక్కలను పెంచి నగర ప్రజలకు విస్తృతంగా పంపిణీ చేసిన పరిస్థితులను గుర్తుచేసుకుంటూ ప్రస్తుత అధికారుల తీరుపై ప్రకృతి ప్రేమికులు మండిపడుతున్నారు. ఉద్యానశాఖ డైరెక్టర్, అర్బన్ ఫార్మింగ్‌ను పర్యవేక్షించే ఉన్నతాధికారుల కార్యాలయంతోపాటు రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడిగా వ్యవహరిస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి కార్యాలయం పరిసరాల్లోనే ఉంది. ఇలాంటి చోటే అధికారులు బాధ్యతారహితంగా ఉంటే.. రాష్ట్రంలో ఉద్యాన సాగు విస్తరణ ఎలా సాధ్యమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు తిరిగే ప్రదేశంలో విలువైన పాలీ హౌస్‌ల నిర్వహణను పట్టించుకోకుండా ఉండటంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



భారత అమ్మాయిల కొత్త చరిత్ర

21 ఏళ్ల తర్వాత ఏఎఫ్‌సీ ఆసియా కప్ క్వార్టర్స్ బెర్తు సొంతం

సుజౌ (చైనా): ఏఎఫ్‌సీ అండర్-17 మహిళల ఆసియా కప్‌లో భారత ఫుట్‌బాల్ జట్టు చరిత్ర సృష్టించింది. 21 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఈ మెగా టోర్నీలో క్వార్టర్ ఫైనల్ చేరుకుంది. శుక్రవారం జరిగిన గ్రూప్-బి చివరి మ్యాచ్‌లో భారత్ 4-0 తేడాతో లెబనాన్‌ను చిత్తు చేసింది. 2005 తర్వాత ఈ టోర్నీలో మన జట్టు తొలి విజయంతో పాటు నాకౌట్ బెర్తు సొంతం చేసుకుంది.ఆట ప్రారంభమైన 6వ నిమిషంలోనే అద్భుతమైన గోల్‌తో జట్టు విజయానికి బాటలు వేసిన ప్రీతికా బర్మన్ 85వ నిమిషంలో రెండో గోల్ కొట్టింది. అల్వా దేవి (36వ ని), జోయా (72వ ని) చెరో గోల్‌తో జట్టుకు ఘన విజయం అందించారు. గ్రూప్-బిలో భారత్ మూడు పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. ఫిలిప్పీన్స్, చైనీస్ తైపీ మధ్య జరిగిన చివరి గ్రూప్ మ్యాచ్ ఒక్క గోల్ లేకుండా డ్రా అవ్వడంతో భారత్ మార్గం సుగమం అయింది. గోల్ డిఫరెన్స్‌లో మెరుగ్గా ఉన్న భారత అమ్మాయిలు (-1).. ఫిలిప్పీన్స్‌ను వెనక్కునెట్టి నాకౌట్ చేరుకున్నారు. సోమవారం జరిగే క్వార్టర్స్‌లో గ్రూప్-ఎ టాపర్ చైనాతో పోటీపడతారు. ఇందులో గెలిచి సెమీస్ చేరితే ఫిఫా అండర్-17 మహిళల ప్రపంచకప్‌నకు భారత్ అర్హత సాధిస్తుంది.

ఐపీఎల్‌లో హనీ ట్రాప్ ముప్పు!

హోటల్ గదుల్లోకి ఇతరులకు నో ఎంట్రీ

10 ఫ్రాంచైజీలకు బీసీసీఐ కఠిన మార్గదర్శకాలు

న్యూఢిల్లీ: ఐపీఎల్ ఆటగాళ్లను లక్ష్యంగా చేసుకుని హనీ ట్రాప్ ముప్పు పొంచి ఉందంటూ బీసీసీఐ సంచలన హెచ్చరికలు జారీ చేసింది. ప్రస్తుత సీజన్‌లో కొందరు ఆటగాళ్లు, సహాయక సిబ్బంది, టీమ్ అధికారులు ప్రోటోకాల్ నిబంధనలు ఉల్లంఘించినట్టు బోర్డు యాంటీ కరప్షన్ యూనిట్ (ఏసీయూ) గుర్తించింది. ఈ నేపథ్యంలో 10 ఫ్రాంచైజీల సీఈఓలకు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా కఠినమైన మార్గదర్శకాల (ఎస్ఓపీ)ను జారీ చేశారు. 'చాలా సందర్భాల్లో ఆటగాళ్లు టీమ్ మేనేజర్లకు సమాచారం ఇవ్వకుండా అపరిచితులను తమ హోటల్ గదుల్లోకి అనుమతిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఇలాంటి పద్ధతులు ఆటగాళ్లను ఉచ్చులోకి (హనీ ట్రాప్) లాగేందుకు దారి తీసే ప్రమాదం ఉంది. ప్లేయర్లను టార్గెట్ చేయడం ద్వారా వ్యక్తిగత, వృత్తిపరమైన రహస్యాలను సేకరించే అవకాశం ఉంది'అని ఫ్రాంచైజీలకు రాసిన 7పేజీల లేఖలో సైకియా పేర్కొన్నారు. ఇకపై గెస్టులు ఎవరైనా ఆటగాళ్ల గదికి వెళ్లాలంటే టీమ్ మేనేజర్ నుంచి రాతపూర్వక అనుమతి తీసుకోవడం తప్పనిసరి చేసిన బోర్డు అనధికారిక వ్యక్తులను గదుల్లోకి ఆహ్వానించడాన్ని తక్షణమే నిషేధిస్తున్నట్టు తెలిపింది.నిబంధనల అతిక్రమణ వల్ల కేవలం భద్రతా పరమైన సమస్యలే కాకుండా, లైంగిక వేధింపుల వంటి చట్టపరమైన ఆరోపణలు వచ్చే అవకాశం కూడా ఉందని బీసీసీఐ పేర్కొంది. ఆటగాళ్లు, సిబ్బంది నిర్ణీత సమయం దాటిన తర్వాత హోటల్ నుంచి బయటకు వెళ్లకూడదని, ఒక వేళ అత్యవసరంగా వెళ్లాల్సి వస్తే సెక్యూరిటీ లైజన్ ఆఫీసర్ లేదా టీమ్ ఇంటిగ్రిటీ ఆఫీసర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించింది. హనీ ట్రాప్స్ వంటి ముప్పులను అరికట్టేందుకు బీసీసీఐ లేదా ఐపీఎల్ ఆపరేషన్స్ టీమ్ ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు చేస్తుందని సైకియా పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలితే భారీ జరిమానాతోపాటు లీగ్ నుంచి బహిష్కరిస్తామని హెచ్చరించారు.



ఓనర్లకూ ఆంక్షలు.. వేపింగ్‌పై నిషేధం

మ్యాచ్ జరుగుతున్న సమయంలో కొందరు ఫ్రాంచైజీ యజమానులు డగౌట్, డ్రెస్సింగ్ రూమ్, మైదానంలోకి వెళ్లి ఆటగాళ్లను కలవడం, ఆలింగనం చేసుకోవడం వంటి చర్యలను బీసీసీఐ తప్పుపట్టింది. 'ఇలాంటి ప్రవర్తన వల్ల మ్యాచ్ ఏకాగ్రత దెబ్బ తినడమే కాకుండా ప్రోటోకాల్ ఉల్లంఘన కిందకు వస్తుంది' అని పేర్కొంది. మ్యాచ్ సమయంలో ఓనర్లు క్రికెటర్లను కలవడాన్ని నిషేధించింది. అధికారిక మార్గాల ద్వారానే ఆటగాళ్లతో కమ్యూనికేట్ చేయాలని సూచించింది. ఇక, రాజస్థాన్ కెప్టెన్ పరాగ్ డ్రెస్సింగ్ రూమ్‌లో వేపింగ్ (ఈ-సిగరెట్) చేస్తూ కనిపించడం వివాదానికి దారితీసింది. దాంతో ఐపీఎల్ వేదికలు, హోటళ్లు, ప్రాక్టీస్ సెంటర్లలో ఈ-సిగరెట్ల వాడకంపై నిషేధం విధించిన బోర్డు వేపింగ్ చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోనుంది.



ఫిన్ అలెన్ (100 నాటౌట్)

ఢిల్లీపై ఫిన్ పిడుగు

అలెన్ మెరుపు సెంచరీ • కోల్‌కతాకు నాలుగో విజయం • డీసీకి ఏడో ఓటమి

ఢిల్లీ: ఐపీఎల్-19లో ఆలస్యం గాగెలుపు బాట పట్టిన కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) వరుసగా నాలుగో విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది. శుక్రవారం అరుణ్‌జైట్లీ స్టేడియంలో జరిగిన స్వల్ప స్కోర్ల మ్యాచ్‌లో నైట్‌రైడర్స్.. 8 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను చిత్తుచేసి ప్లేఆఫ్స్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. ఓపెనర్ ఫిన్ అలెన్ (47 బంతుల్లో 100 నాటౌట్, 5 ఫోర్లు, 10 సిక్స్‌లు) విధ్వంసకర ఆటతీరుతో రెచ్చిపోయి తన ఐపీఎల్ కెరీర్‌లో తొలి శతకంతో విజృంభించిన వేళ.. క్యాపిటల్స్ నిర్దేశించిన 148 పరుగుల ఛేదనను కేకేఆర్ 14.2 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి దంచేసింది. కామెరూన్ గ్రీన్ (33 నాటౌట్) అతడికి అండగా నిలిచాడు. పతుమ్ నిశాంక (29 బంతుల్లో 50, 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), అశుతోష్ శర్మ (28 బంతుల్లో 39, 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఆదుకోవడంతో క్యాపిటల్స్ నిర్ణీత ఓవర్లలో 142/8 చేయగల్గింది. కేకేఆర్ బౌలర్లలో కార్తీక్ త్యాగి (2/25), అనుకుల్ రాయ్ (2/31), సునీల్ నరైన్ (1/17) ప్రత్యర్థిని కట్టడి చేశారు. కాగా ఈ విజయంతో కోల్‌కతా పాయింట్ల పట్టికలో ఏడో స్థానానికి చేరగా ఆడిన 11 మ్యాచ్‌ల్లో ఏడింట ఓడిన ఢిల్లీ ఎనిమిదో ప్లేస్‌కు పడిపోయింది. అలెన్‌కే 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

అలెన్ వీరబాదుడు

స్వల్ప ఛేదనలో ఓపెనర్ రహానే (13)తో పాటు రఘువంశీ (1) వికెట్లను వెంటవెంటనే కోల్పోయినా అలెన్ వీరబాదుడుతో కేకేఆర్ విజయం తేలికైంది. ఇన్నింగ్స్‌ను నెమ్మదిగానే ప్రారంభించిన అతడు.. కుదురుకున్నాక ఆకాశమే హద్దుగా చెలరేగాడు. విప్రాజ్, కుల్‌దీప్ ఓవర్లలో రెండేసి బౌండరీలు, సిక్స్‌లు బాదాడు. 42 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద అతడిచ్చిన క్యాచ్‌ను స్టబ్స్ జారవిడిచాడు. ఆ అవకాశాన్ని కివీస్ ఓపెనర్ చక్కగా వినియోగించుకున్నాడు. ఇన్నింగ్స్ సగానికి కోల్‌కతా 75/2 పరుగులే చేసినా ఆ తర్వాత అలెన్ విధ్వంసం మొదలైంది. స్టార్క్ 11వ ఓవర్లో సిక్స్‌తో హాఫ్ సెంచరీ పూర్తిచేసిన అలెన్.. గ్రీన్ అండతో చెలరేగిపోయాడు. విప్రాజ్ ఓవర్లో హ్యాట్రిక్ సిక్సర్లతో విరుచుకుపడిన అతడు.. కుల్‌దీప్ 14వ ఓవర్లోనూ రెండుసార్లు బంతిని స్టాండ్స్‌లోకి పంపించి శతకానికి చేరువయ్యాడు. ముకేశ్ విసిరిన 14వ ఓవర్ రెండో బంతిని సిక్స్‌గా మలిచి 47 బంతుల్లోనే ఐపీఎల్‌లో మొదటి సెంచరీని అందుకోవడమే గాక మ్యాచ్‌నూ ముగించాడు. గ్రీన్, అలెన్ జోడీ మూడో వికెట్‌కు 64 బంతుల్లోనే 116 పరుగులు జోడించింది.

ఆరంభం అదిరినా..

నిశాంక, రాహుల్ (14 బంతుల్లో 23, 4 ఫోర్లు) ధాటిగా ఆడటంతో ఇన్నింగ్స్‌ను ఢిల్లీ మెరుగ్గానే ఆరంభించినా నిలకడలేమి, పేలవ బ్యాటింగ్‌తో మరోసారి ఖంగుతింది. పవర్ ప్లే ముగిశాక గాడి తప్పి 3 ఓవర్ల వ్యవధిలోనే నాలుగు కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడి తక్కువ స్కోరుకే పరిమితమైంది. బౌండరీతో నిశాంక తన ఇన్నింగ్స్‌కు శ్రీకారం చుట్టగా చకచకా ఫోర్లు బాదిన రాహుల్‌ను కార్తీక్ 5వ ఓవర్లో ఆఖరి బంతికి ఔట్ చేసి క్యాపిటల్స్‌కు తొలి షాకిచ్చాడు. పవర్ ప్లే ముగిసేసరికి 55/1తో నిలిచిన ఢిల్లీ 8వ ఓవర్లో నితీశ్ రాణా (8) వికెట్‌నూ కోల్పోయింది. మూడో స్థానంలో వచ్చిన రిజ్వీ (3).. నరైన్ బౌలింగ్‌లో పావెల్ చేతికి చిక్కాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా చూడచక్కని షాట్లతో అలరించిన నిశాంక.. 29 బంతుల్లో అర్ధ శతకం పూర్తిచేశాడు. కానీ రెండో స్పెల్‌లో బౌలింగ్‌కు వచ్చిన అనుకుల్.. ఒకే ఓవర్లో ఆతిథ్య జట్టుకు డబుల్ స్ట్రోకులిచ్చాడు. మొదట నిశాంకను ఊరించే డెలివరీతో బోల్తా కొట్టించి ఐదో బంతికి ప్రమాదకర స్టబ్స్ (2)ను క్లీన్‌బౌల్డ్ చేయడంతో ఢిల్లీ ఐదో వికెట్‌ను కోల్పోయింది. 7.5 ఓవర్లకు 74/2తో ఉన్న డీసీ.. 20 బంతుల వ్యవధిలో మిడిలార్డర్ పెవిలియన్‌కు క్యూ కట్టింది. ఈ దశలో కెప్టెన్ అక్షర్ (11)తో కలిసి అశుతోష్ ఢిల్లీని ఆదుకునే యత్నం చేశాడు. అక్షర్ 22 బంతుల్లో 11 పరుగులే చేసినా అశుతోశ్ క్రీజులో కుదురుకున్నాక వరుణ్ 17వ ఓవర్లో 6, 4, 4 దంచాడు. ఆ తర్వాత వైభవ్ బౌలింగ్‌లోనూ సిక్స్, ఫోర్‌తో క్యాపిటల్స్‌కు చెప్పుకోదగ్గ స్కోరును అందించాడు.

సంక్షిప్త స్కోర్లు

ఢిల్లీ: 20 ఓవర్లకు 142/8 (నిశాంక 50, అశుతోష్ 39, త్యాగి 2/25, అనుకుల్ 2/31)

కోల్‌కతా: 14.2 ఓవర్లకు 147/2 (అలెన్ 100*, గ్రీన్ 33*, అక్షర్ 1/27)

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
హైదరాబాద్	11	7	4	0	14	0.73
పంజాబ్	10	6	3	1	13	0.87
బెంగళూరు	10	6	4	0	12	1.24
రాజస్థాన్	10	6	4	0	12	0.51
గుజరాత్	10	6	4	0	12	-0.14
చెన్నై	10	5	5	0	10	0.15
కోల్‌కతా	10	4	5	1	9	-0.16
ఢిల్లీ	11	4	7	0	8	-1.15
ముంబై	10	3	7	0	6	-0.64
లక్నో	10	3	7	0	6	-0.94

నోట్: ఆ:ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, పా: పాయింట్లు, ర.రే: రన్‌రేట్, ఫ.తే:ఫలితం తేలనివి

షకీరా.. ఈసారి దయ్ దయ్

• ఫిఫా వరల్డ్ కప్ సాంగ్ టీజర్ విడుదల

న్యూయార్క్: ఫుట్‌బాల్ ప్రపంచకప్ వస్తుందనగానే మైదానంలో ఆటగాళ్ల విన్యాసాలతో పాటు కొలంబియా పాప్ సింగర్ షకీరా పాటలు గుర్తొస్తాయి. 2010లో వాకా వాకా పాటతో ప్రపంచాన్ని ఉర్రూతలూగించిన షకీరా 16 ఏళ్ల తర్వాత మరోసారి ఫిఫా వరల్డ్ కప్ అధికారిక పాటతో అభిమానులను అలరించనుంది. అమెరికా, మెక్సికో, కెనడా వేదికలుగా జూన్ 11 నుంచి జరిగే మెగా టోర్నీ కోసం ఆమె రూపొందించిన అధికారిక గీతం 'దయ్ దయ్' టీజర్ శుక్రవారం విడుదలైంది. ఈ పాట కోసం నైజీరియన్ స్టార్ బర్నా బాయ్‌తో షకీరా జతకట్టింది. బ్రెజిల్‌లోని ప్రసిద్ధ మారకానా స్టేడియంలో చిత్రీకరించిన ఈ టీజర్‌లో షకీరా తనదైన శైలి స్టెప్పులతో ఆకట్టుకుంది. ఈ పాట పూర్తి వెర్షన్ ఈనెల 14న విడుదల కానుంది. గతంలో 2006, 2010, 2014 ప్రపంచకప్ టోర్నీల్లో తన ప్రదర్శనలతో మెప్పించిన షకీరా ఈసారి 'దయ్ దయ్' పాటతో రికార్డులు సృష్టించేందుకు సిద్ధమైంది. దయ్ అనేది ఇటాలియన్ పదం. దీనికి ప్రయత్నించు, ముందుకు సాగు అనే అర్థం వస్తుంది.



సెమీస్‌కు సిమ్రన్‌జీత్

షాంఘై: ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-2లో యువ ఆర్చర్లు సిమ్రన్‌జీత్ కౌర్, సాహిల్ జాదవ్ పతక రేసులోకి వచ్చారు. శుక్రవారం జరిగిన మహిళల రికర్వ్ వ్యక్తిగత విభాగం క్వార్టర్స్‌లో సిమ్రన్‌జీత్.. 6-0తో చైనీస్ తైపీకి చెందిన ఫాంగ్ యు ఝును చిత్తుగా ఓడించి సెమీస్ చేరింది. ఆదివారం జరిగే సెమీస్‌లో ప్రపంచ నంబర్ వన్ ర్యాంకర్ చెయాంగ్ (కొరియా)తో తలపడనుంది. భారత్ భారీ ఆశలు పెట్టుకున్న కాంపౌండ్ విభాగంలో టాప్ ఆర్చర్లంతా విఫలమైనప్పటికీ సాహిల్ జాదవ్ మాత్రం సత్తాచాటాడు. క్వార్టర్స్‌లో సాహిల్.. ఆస్ట్రియాకు చెందిన నికో వీనర్‌ను షూటాఫ్‌లో ఓడించి సెమీస్‌కు అర్హత సాధించాడు. ఇద్దరు 147 పాయింట్లు స్కోరు చేయగా షూటాఫ్‌లో సాహిల్ 10-9తో ప్రత్యర్థిని ఓడించి పతక రేసులో నిలిచాడు.

వినేశ్‌ను అడ్డుకునేందుకు కాదు..

• డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు సంజయ్

న్యూఢిల్లీ: రాబోయే ఆసియా క్రీడల్లో పాల్గొనకుండా స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌ను అడ్డుకోవడానికి సెలక్షన్ ట్రయల్స్ నిబంధనలను మార్చారన్న ఆరోపణలను భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు సంజయ్ సింగ్ ఖండించారు. ఆసియా క్రీడల ట్రయల్స్‌కు అర్హత సాధించాలంటే 2025 సీనియర్ నేషనల్స్, 2026 ఫెడరేషన్ కప్ లేదా అండర్-20 నేషనల్స్‌లో పతకాలు సాధించాలనే నిబంధనను ఫిబ్రవరిలోనే స్పోర్ట్స్ అథారిటీ, క్రీడా మంత్రిత్వ శాఖకు తెలియజేశామని వివరించారు. ప్రస్తుతం వినేశ్ పాల్గొనాలనుకుంటున్న నేషనల్ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నమెంట్ ఫలితాలను ఆసియా క్రీడల ఎంపికకు ప్రాతిపదికగా తీసుకోబోమని డబ్ల్యూఎఫ్ఐ స్పష్టం చేసింది. దీనికి తోడు ఈ నెల 30, 31న జరిగే ఆసియా క్రీడల ట్రయల్స్ విషయంలో మరిన్ని కఠిన ఆంక్షలు విధించింది. వియత్నాంలో జరిగే అండర్-23 ఆసియా చాంపియన్‌షిప్‌కు ఎంపికై, మధ్యలో తప్పుకునే రెజ్లర్లను ట్రయల్స్‌కు అనుమతించబోమని హెచ్చరించింది.

నజ్ముల్ శతకం

ఢాకా: స్వదేశంలో పాకిస్థాన్‌తో రెండు టెస్టు సిరీస్‌లో భాగంగా శుక్రవారం నుంచి మొదలైన తొలిటెస్టులో మొదటి రోజే బంగ్లాదేశ్ పటిష్టస్థితిలో నిలిచింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు వచ్చిన బంగ్లా.. తొలి రోజు ఆట ముగిసే సమయానికి 4 వికెట్ల నష్టానికి 301 పరుగులు చేసింది. కెప్టెన్ నజ్ముల్ హుస్సేన్ శాంటో (101) శతకంతో కదం తొక్కగా మోమినుల్ హక్ (91) తృటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. ముష్ఫికర్ రహీమ్ (48 బ్యాటింగ్), లిటన్ దాస్ (8 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

చిక్కిన డ్రగ్స్‌ మాఫియా డాన్‌


సిటీబ్యూరో: డ్రగ్‌ మాఫియా డాన్‌ షేక్‌ ఫైసల్‌ను ఎట్టకేలకు ఎక్సైజ్‌ ఎస్టీఎఫ్‌ పోలీసులు అరెస్టు చేశారు. అతడితో పాటు మరో ముగ్గురు నిందితులను సైతం అరెస్టు చేసి వారి నుంచి 4.62 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్‌ ఎస్టీఎఫ్‌ టీం-బీ ఈఎస్‌ కె. ప్రదీప్‌రావు కథనం ప్రకారం..అంబర్‌పేటలో డ్రగ్స్‌ విక్రయాలు జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్‌ఐ సంధ్య ఆధ్వర్యంలో శుక్రవారం తెల్లవారుజామున ట్రూబ్‌నగర్‌ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. ఓ కారులో ఉన్న నలుగురి వద్ద 4.62 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ లభించింది. కారులో ఉన్న వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, కొంత కాలంగా డ్రగ్స్‌ సరఫరాలో కీలక పాత్ర పోషిస్తూ పోలీసులకు దొరకకుండా, మోస్ట్‌ వాంటెడ్‌గా ఉన్న డ్రగ్స్‌ మాఫియా డాన్‌ షేక్‌ ఫైసల్‌గా గుర్తించారు. కాగా, నిందితులు బెంగళూరులో గ్రాము రూ.1500 చొప్పున కొనుగోలు చేసి, నగరంలో గ్రాము ఎండీఎంఏను రూ. 8వేల నుంచి రూ.10వేలకు విక్రయిస్తున్నారని, ప్రస్తుతం బెంగళూరు నుంచి సుమారు 20 గ్రాముల ఎండీఎంఏ తీసుకొచ్చి నగరంలో విక్రయాలు నిర్వహిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. డ్రగ్స్‌ సరఫరా కేసులో ఇటీవలే ఫైసల్‌ భార్య మస్రత్‌ను మల్కాజిగిరి ఎస్‌వోటీ పోలీసులు అరెస్టు చేశారు.

ఉచితంగా హెల్మెట్ల పంపిణీ



సిటీబ్యూరో, మే 8 (నమస్తే తెలంగాణ) : రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థులను ప్రధానంగా ఎంచుకుని భద్రతా చర్యలపై అవగాహన కల్పించడానికి ఆర్టీఏ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా రవాణా శాఖ శుక్రవారం ఆర్టీఏ ఆధ్వర్యంలో పలువురు వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. ఇప్పటికే నాచారంలోని ఢిల్లీ పబ్లిక్‌ స్కూల్‌లో మొదటి ట్రాఫిక్‌ ట్రెయినింగ్‌ పార్క్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. సిగ్నల్స్‌ నుంచి రోడ్డు భద్రత వరకు అన్నీ జాగ్రత్తలు తీసుకునేల అవగాహన కల్పిస్తున్నారు. వీటితో పాటు పాఠశాల విద్యార్థులు, ఇంటర్‌, డిగ్రీ, యూనివర్సిటీ విద్యార్థులతో రోడ్డు భద్రత క్లబ్‌లు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 59 క్లబ్‌లు ఏర్పాటు చేసినట్టు ఆర్టీఏ అధికారులు తెలిపారు.

- మాజీ ఐపీఎస్‌ భార్య హత్యతో సిటీలో కలకలం
- చిలకలగూడలో దారుణ హత్యకు గురైన యువకుడు
- వరుస సంఘటనలతో ఉలిక్కిపడుతున్న భాగ్యనగరం
- కాంగ్రెస్‌ పాలనలో శాంతిభద్రతలు ప్రశ్నార్థకం



రోజుకో హత్య పూటకో దోపిడీ!

నగరంలో కొన్నిరోజులుగా వరుసగా జరుగుతున్న హత్యలు, నేరాలు కలకలం రేపుతున్నాయి. గడిచిన నెలరోజుల్లో నాలుగు కమిషనరేట్ల పరిధిలో సుమారు 20కిపైగా హత్యలు జరగడం పరిస్థితులకు అద్దంపడుతోంది. గత సంవత్సరంలో హైదరాబాద్‌లోని ట్రై కమిషనరేట్ల పరిధిలో నెలకు 13 నుంచి 15 వరకు హత్యలు జరగగా ఈసారి ఆ శాతం 20కి చేరడం గమనార్హం. ఇలా మహానగరంలో నిత్యం ఏదో ఒకచోట హత్యలు, దోపిడీలతో పంజా విసురుతున్న అంతర్‌ రాష్ట్ర ముఠాలు, రౌడీషీటర్ల గ్యాంగ్‌వార్‌లు, రెచ్చిపోతున్న సెల్‌ఫోన్‌, చైన్‌ స్నాచర్లు, అంతకంతకూ పెరిగిపోతున్న గంజాయి మూకల అరాచకాలు నగరంలో శాంతిభద్రతలను ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి.

- సిటీబ్యూరో, మే 8 (నమస్తే తెలంగాణ)

హైదరాబాద్‌లో వ్యవస్థీకృత నేరాలు పెరుగుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పరిస్థితి నేడు తిరిగి పునారవృతమవుతున్నాయి. వ్యవస్థీకృత నేరాలను ఉక్కుపాదంతో నాటి బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం అణిచివేసింది. దీంతో హైదరాబాద్‌లో దొంగతనాలు, దోపిడీలు, స్నాచింగ్‌లు, దృష్టి మళ్లించి దొంగతనాల వంటి నేరాలను పూర్తిస్థాయిలో కట్టడి చేశారు. తిరిగి కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అంతర్‌రాష్ట్ర ముఠాలు బెంబేలెత్తిస్తున్నాయి. బీఆర్‌ఎస్‌ పాలనలో హైదరాబాద్‌ పోలీసుల దెబ్బకు ఈవైపే కన్నెత్తి చూడని అంతర్‌రాష్ట్ర ముఠాలు ఇప్పుడు వరుసగా ఏదోఒక ఘటనకు పాల్పడుతూనే ఉన్నాయి.

మహిళలకు భద్రతేదీ?

ఒక సర్వే ప్రకారం హైదరాబాద్‌లో మహిళలపై లైంగిక వేధింపులు, లైంగికదాడులు ఇతర నేరాలకు సంబంధించి దేశంలోని ప్రధాన నగరాల్లో సర్వే చేస్తే 30 శాతం నేరాలు జరుగుతున్నట్లు వెల్లడైంది. ఇదిలా ఉంటే మహిళలు ఇంటి ముందు కూడా కనీసం ఒంటరిగా కొద్దిసేపు కూర్చోలేని దుస్థితి నెలకొంది. పగలు తేడా లేకుండా స్నాచింగ్‌ ముఠాలు హైదరాబాద్‌లో పెట్రేగిపోతున్నాయి. గంజాయి బ్యాచ్‌లు ఒంటరిగా కన్పించే

మిగతా IVవ పేజీలో

భయం.. భయంగా!

మహానగరంలో అతివలకు రక్షణ కరువు



అచేతనంగా మారిన షీటీమ్స్‌ వ్యవస్థ

ఫిర్యాదులపై తక్షణ చర్యలు శూన్యం

ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని గాలికొదిలేసిన కాంగ్రెస్‌

బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం మహిళల రక్షణ కోసం దేశంలో ఎక్కడ లేని విధంగా మొదటి సారిగా షీ టీమ్స్‌ వ్యవస్థను తీసుకొచ్చి ఆకతాయిల గుండెల్లో వణుకు పుట్టించింది. పదేండ్ల బీఆర్‌ఎస్‌ పాలనలో హైదరాబాద్‌ నగరం అంతర్జాతీయ స్థాయిలో సురక్షితమైన నగరంగా గుర్తింపు పొందింది. అప్పట్లో షీ టీమ్స్‌ ఉన్నాయని మహిళలు గర్వంగా ధైర్యంగా తిరిగేవారు. తెలంగాణ రాష్ట్రంలో మహిళా భద్రతను చూసి దేశంలోని పలు రాష్ట్రాలు షీ టీమ్స్‌ను ప్రవేశపెట్టాయి. ప్రపంచ దేశాలు సైతం ప్రశంసించాయి. కాంగ్రెస్‌ ప్రభుత్వం కొలువుదీరాక మహిళలకు భద్రత, భరోసా కరువైపోయింది. నేడు షీ టీమ్స్‌ ఉన్నాయా? అనే ప్రశ్న తలెత్తున్నది. మల్కాజిగిరి సీపీ ఈ నెల 2న దిల్‌సుఖ్‌నగర్‌లో అర్ధరాత్రి నిర్వహించిన ఆపరేషన్‌తో ఇది స్పష్టమైంది. ఒక ఐపీఎస్‌ అధికారికే ఎన్నో ఛేదు అనుభవాలు ఎదురయ్యాయి. గంజాయి బ్యాచ్‌లు రోడ్లపై విచ్చల విడిగా తిరుగుతున్నాయి. పాన్‌ డబ్బాలలోనే మత్తు పదార్థాలు అమ్ముతున్నారనే విషయంపై మహిళా అధికారే ఆందోళన వ్యక్తం చేయడం హైదరాబాద్‌లో శాంతి భద్రతల డొల్లతనానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

- సిటీబ్యూరో, మే 8 (నమస్తే తెలంగాణ)

నాడు షీ టీమ్స్‌ అంటే అభయం

బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయంలో షీ టీమ్స్‌ అంటే మహిళలకు ఒక అభయంగా రక్షణగా నిలిచాయి. సింగపూర్‌ తరహాలో హైదరాబాద్‌లో మహిళల భద్రతపై బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం దృష్టి పెట్టింది. ప్రజల సహకారంతో నేనుసైతం కార్యక్రమంతో సుమారు 9 లక్షల వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రపంచంలోనే సీసీ కెమెరాలు అత్యధికంగా ఉన్న నగరంగా హైదరాబాద్‌ గుర్తింపు పొందింది. నేడు ఆ సీసీ కెమెరాలు సగానికి సగం పనిచేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి. కాంగ్రెస్‌ పాలనలో షీ టీమ్స్‌ ఉనికి లేకుండా పోతున్నాయి. నాలుగు పోలీస్‌ కమిషనరేట్ల పరిధిలో షీ టీమ్స్‌కు ప్రతి రోజు 100కుపై ఫిర్యాదులు అందుతున్నాయి. వచ్చిన ఫిర్యాదులపై తక్షణ స్పందన కరువైంది.

ఆగమ్య గోచరంగా మహిళా భద్రత

మహిళలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో మఫ్టీలో షీ టీమ్స్‌ నిఘా పెట్టిన రోజులు పూర్తిగా మారిపోయాయి. నేడు షీ టీమ్స్‌ అంటే భయం లేదు.. షీ టీమ్స్‌ ఉనికి కన్పించడం లేదు. సోషల్‌మీడియాలో మహిళలను వేధించే ముఠాలు, మైనర్లను ట్రాప్‌ చేస్తూ బ్లాక్‌మెయిల్‌ చేస్తున్న ఘటనలు నేడు సభ్య సమాజం తలదించుకునేలా చేస్తున్నాయంటూ మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్‌ పాలనలో శాంతి భద్రతలు, మహిళల భద్రత అంతా గాలికొదిలేశారనే ఆరోపణలు వస్తున్నాయి.





స్వీయ జనగణన కార్యక్రమంలో భాగంగా జూబ్లీహిల్స్‌లోని భరణి లే అవుట్‌లో నివాసముంటున్న డీజీపీ సీవీ ఆనంద్‌ నివాసానికి వెళ్లిన జీహెచ్‌ఎంసీ అధికారులు ఆయన కుటుంబ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు. -బంజారాహిల్స్‌, మే 8

శంషాబాద్‌ తహసీల్‌లో ఏసీబీ తనిఖీలు


ఒక్కసారిగా ఉలిక్కిపడ్డ అధికారులు..సిబ్బంది

శంషాబాద్‌ రూరల్‌, మే 8 : శంషాబాద్‌ తహసీల్దార్‌ కార్యాలయంలో శుక్రవారం ఏసీబీ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. దీంతో కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది ఒక్కసారిగా ఉలికిపడ్డారు. ఏసీబీ అధికారులు కార్యాలయంలోకి రాగానే అధికారుల ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. తహసీల్దార్‌ డ్రైవర్‌ ఏసీబీ అధికారులకు పట్టుపడకుండా పారిపోయి తిరిగి సాయంత్రం కార్యాలయానికి వచ్చిన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. దీంతో పాటు తహసీల్దార్‌ కారును సైతం తనిఖీలు చేశారు. అనంతరం ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్‌ మీడియాతో మాట్లాడారు. కొంతమంది నుంచి ఫిర్యాదులు రావడంతో పాటు రిజిస్ట్రేషన్‌లలో అవకతవకలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అందులో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు చేస్తున్నామని వివరించారు. రెండు కీలక విషయాలపై తనిఖీలు చేపడుతున్నట్లు చెప్పారు. జరిగిన అవకతవకలపై అధికారులు, సిబ్బంది పాత్ర ఎంత అనే అంశాలను విచారణ చేస్తున్నట్లు చెప్పారు.



ఆడపిల్ల అని తెలిస్తే.. అబార్షనే

ఏఐ యుగంలోనూ ఆడపిల్లకు తప్పని వివక్ష



పిండం దశలోనే ఊపిరి తీస్తున్న వైనం

ప్రైవేటు స్కానింగ్‌ సెంటర్లు, దవాఖానలపై కొరవడిన పర్యవేక్షణ

సిటీబ్యూరో, మే 8 (నమస్తే తెలంగాణ): ఏఐ యుగంలోనూ ఆడపిల్లకు వివక్ష తప్పడం లేదు. కారణాలేమైనా నేటికీ చాలా మంది దంపతులు ఆడపిల్ల అంటే అబార్షన్‌ అంటున్నారు. అందుకోసం కొన్ని ప్రైవేటు స్కానింగ్‌ సెంటర్లు, దవాఖానలను ఆశ్రయిస్తున్నారు. ప్రైవేటు దవాఖానలు లేదా స్కానింగ్‌ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకుని, పుట్టబోయే బిడ్డ ఆడపిల్ల అని తెలిస్తే వెంటనే అబార్షన్‌ చేయించుకుంటున్నట్లు సమాచారం. ఇలాంటి దంపతులను ఆసరాగా చేసుకుని హైదరాబాద్‌తో పాటు నగర శివార్లలోని రంగారెడ్డి, మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లాల పరిధిలో ఉన్న పలు ప్రైవేటు దవాఖానలు, స్కానింగ్‌ సెంటర్ల నిర్వాహకులు పెద్ద ఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు. గుట్టుచప్పుడు కాకుండా లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, నిబంధనలకు విరుద్ధంగా అబార్షన్‌లు చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సరైన పర్యవేక్షణ లేకపోవడం, నెలవారీ ఒప్పందాలతో కొన్ని ప్రైవేటు దవాఖానలు, స్కానింగ్‌ సెంటర్లు, డయాగ్నోస్టిక్‌ సెంటర్ల నిర్వాహకులు ఆడిందే ఆట, పాడిందే పాటగా మారింది. ఏవైన ఫిర్యాదులు

మిగతా IIవ పేజీలోక

ఆర్‌ఎంపీలు మధ్యవర్తులుగా..

రంగారెడ్డి, మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లా పరిధిలో కొందరు ఆర్‌ఎంపీలు ఈ లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్లు చేయించడంలో మధ్యవర్తిత్వం వహిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. చాలా మంది ఆర్‌ఎంపీలు ఆయా దవాఖానలు, స్కానింగ్‌ సెంటర్లు, డయాగ్నోస్టిక్‌ సెంటర్ల నిర్వాహకులతో కుమ్మక్కై లింగ నిర్ధారణ పరీక్షలు చేయించడం, ఆడబిడ్డ అని నిర్ధారణ జరిగితే గుట్టుచప్పుడు కాకుండా అబార్షన్‌లు చేయించడంలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరికొన్ని కార్పొరేట్‌ తరహా ఉన్న పెద్ద దవాఖానల్లో అక్కడ పనిచేసే కొందరు వైద్యులు, సిబ్బందే ఈ పాపం మూటగట్టుకుంటున్నట్లు సమాచారం.

దిల్‌సుఖ్‌నగర్‌పై ప్రత్యేక నిఘా

హాస్టళ్ల నిర్వాహకులతో కో ఆర్డినేషన్‌.. విచ్చలవిడిగా తిరిగితే అరదండాలే

అర్ధరాత్రి రోడ్లపై కనిపిస్తే డ్రగ్స్‌ టెస్టులు.. మల్కాజ్‌గిరి సీపీ సుమతి ప్రత్యేక దృష్టి



దిల్‌సుఖ్‌నగర్‌లో హాస్టళ్ల నిర్వాహకులతో సమావేశంలో 'సే నో టూ డ్రగ్స్‌' ప్లకార్డులను ప్రదర్శిస్తున్న మల్కాజ్‌గిరి పోలీస్‌ కమిషనర్‌ సుమతి, ఎల్బీనగర్‌ డీసీపీ అనూరాధ

IVలో

రాత్రి అయితే రాకపోకలు బంద్‌

బస్సుల కొరతతో ఇబ్బందులు

సిటీబ్యూరో, మే 8 (నమస్తే తెలంగాణ) : నగరంలో సాయంత్రం 7 దాటిందంటే.. బస్సుల రాకపోకలు తగ్గుతున్నాయి. సమయ పాలన లేకుండా నడుస్తున్నాయని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రూట్లల్లో బస్సులు వస్తాయో రావో కూడా తెలియడం లేదని వాపోతున్నారు. రాత్రి సమయాల్లో బస్సుల రాకపోకలు తగ్గుతుండటంతో గమ్య స్థానాలకు ప్రయివేట్‌ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని చెబుతున్నారు. మరోవైపు బస్సుల సమాచారం సూచీ బోర్డులో ఒకలా.. రాకపోకలు మరోలా ఉంటుండంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహాలక్ష్మి ఉచిత బస్సు పథకంతో సిటీ బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో 95 శాతానికి పెరిగింది. గ్రేటర్‌ జోన్‌ పరిధిలో ఆర్టీసీ నడుపుతున్న సిటీ బస్సుల్లో రోజు 24 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రయాణికుల రద్దీ రెట్టింపైనా అధికారులు అందుకు తగిన విధంగా బస్సుల ఏర్పాటు చర్యలు తీసుకోకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సెలవు రోజుల్లో కూడా బస్సుల రాకపోకలను పరిమితం చేస్తున్నారు. రద్దీ ఉన్నప్పటికీ బస్సులను కేటాయించడం లేదు. గమ్యం యాప్‌ నిర్వహణ సరిగా ఉంటే బస్సుల సమాచారం తెలుసుకుని బస్సుల్లోనే ప్రయాణికులు ప్రయాణించే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులకు సైతం ప్రయాణికులు ఫిర్యాదులు చేస్తున్నారు.



పర్యావరణ విధ్వంసం అభివృద్ధి పేరిట కేబీఆర్‌ పార్కు వద్ద వృక్షాలను తొలగించవద్దని వివిధ రూపాల్లో పర్యావరణ ప్రేమికులు నిరసనలు తెలుపుతున్నా చెట్ల తొలగింపు ప్రక్రియ కొనసాగుతున్నది.

ముప్పుతిప్పలు పెడుతూ!

ఆటోమెటిక్‌ మీటర్‌ రీడర్ల పేరిట దోపిడీ

ఆటోమేటెడ్‌ మీటర్‌ రీడర్ల పేరిట వినియోగదారుడు దోపిడీకి గురవుతున్నాడు. వినియోగదారులకు నల్లా కనెక్షన్లు, బిల్లుల రూపంలో చుక్కలు చూపిస్తున్నారు. ముఖ్యంగా బల్క్‌ కనెక్షన్‌ తీసుకున్న వారిని ముప్పతిప్పలు పెడుతున్నారు. రూ. లక్షల్లో బిల్లులు వసూళ్లు చేస్తూ వినియోగదారుడితో ఆటలాడుకుంటున్నారు. జలమండలి అధికారులు, ఆటోమేటెడ్‌ మీటర్‌ రీడర్లను సరఫరా చేసే ఏజెన్సీలు కుమ్మక్కై వినియోదారుల సొమ్మును దోచుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

-సిటీబ్యూరో, మే 8 (నమస్తే తెలంగాణ)




జలమండలి అధికారులు వినియోగదారుడికి తెలియకుండానే నల్లా కనెక్షన్‌తో పాటు ఆటోమేటెడ్‌ మీటర్‌ రీడర్ల చార్జీలు కూడా వసూలు చేస్తున్నారు. కానీ జలమండలి లైసెన్స్‌ పొందిన ఏజెన్సీ నిర్వాహకులు మాత్రం వినియోగదారుడు అడగకపోతే ఆ మీటర్లను బిగించడం లేదు. కనెక్షన్‌ ఇచ్చిన కాంట్రాక్టర్‌ మీటర్‌ ఉంటేనే కనెక్షన్‌ పూర్తి చేస్తానని తేల్చి చెబుతుండటంతో తప్పని పరిస్థితుల్లో మెకానికల్‌ మీటర్‌ రీడర్లను బిగించుకుంటున్నారు. అటు ఆటోమేటెడ్‌ మీటర్‌ రీడర్లకు వేలాది

మిగతా IIవ పేజీలో

మధు పార్క్‌ నివాసితులతో భేటీ

సిటీ బ్యూరో, మే 8 (నమస్తే తెలంగాణ): మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులో ఇండ్లను కోల్పోతున్న మధు పార్క్‌ రిడ్జ్‌ అపార్ట్‌మెంట్‌ నివాసితులు క్యాబినెట్‌ సబ్‌ కమిటీని కలిశారు. ఈమేరకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలోని కమిటీని శుక్రవారం మధు పార్క్‌ బీ బ్లాక్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు కలిసి తమ వినతులను సమర్పించారు. ఈసందర్భంగా డిప్యూటీ సీఎం వారి సందేహాలను నివృత్తి చేశారు. బాధితులకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని, మూసీ ప్రాజెక్టులో భాగం కావాలని వారిని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్‌ ప్రెసిడెంట్‌ శ్రీనివాస్‌రెడ్డి, సెక్రెటరీ శేఖర్‌, సభ్యులు సత్యనారాయణ, గౌతమ్‌ రాయ్‌, రేణుధల్‌, నబీ సాహెబ్‌, సాహిల్‌ ఖాన్‌ తదితరులు పాల్గొన్నారు.





ఆడపిల్ల అని తెలిస్తే

అబార్షనే

(మొదటిపేజీ తరువాయి)

అందినప్పుడుగాని, ఆరోపణలు వచ్చినప్పుడు మాత్రమే జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు మొక్కుబడి తనిఖీలు చేస్తున్నట్లు తెలుస్తోంది. నిబంధనల ప్రకారం ప్రసవాలు జరిగే ప్రతి ప్రసూతి దవాఖానతో పాటు అల్ట్రాసౌండ్ స్కానింగ్ వంటి వైద్య పరీక్షలు జరిపే ప్రతి స్కానింగ్ సెంటర్, డయాగ్నోస్టిక్ సెంటర్లపై వైద్య, ఆరోగ్యశాఖ అధికారుల సూక్ష్మ పర్యవేక్షణ ఉండాలి. దవాఖానల్లో జరిగే ప్రతి ప్రసవంతో పాటు అక్కడ నమోదు చేసుకునే గర్భిణిల వివరాలను జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులకు సంబంధిత దవాఖాన నిర్వాహకులు సమర్పించాలి. అంతే కాకుండా స్కానింగ్ జరిపే స్కానింగ్ సెంటర్స్, డయాగ్నోస్టిక్ సెంటర్ లేదా దవాఖానలో సైతం స్కానింగ్ కోసం సిఫారసు చేసిన వైద్యుల వివరాలతో పాటు రోగి వివరాలను సైతం ఆయా కేంద్రాల నిర్వాహకులు రికార్డుల్లో పొందుపర్చడంతో పాటు సంబంధిత అధికారులకు సమర్పించాల్సి ఉంటుంది. కానీ ముఖ్యంగా రంగారెడ్డి జిల్లా పరిధిలోని పలు ప్రైవేటు దవాఖానలు, డయాగ్నోస్టిక్ సెంటర్లలో ఈ నియమాలు పాటించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు

నగరంతో పాటు రంగారెడ్డి పరిధిలోని రాజేంద్రనగర్, సరూర్‌నగర్, శంషాబాద్, షాద్‌నగర్, శేరిలింగంపల్లి, హయత్‌నగర్, గండిపేట, చేవెళ్ల, ఆమన్‌గల్ మండలాలు, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని ఉప్పల్, అల్వాల్, బాచుపల్లి, బాలానగర్, దుండిగల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, బాలానగర్ మండలాల పరిధిలో ఉన్న పలు ప్రైవేటు దవాఖానలు, స్కానింగ్ సెంటర్లలో యధేచ్ఛగా లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు పర్యవేక్షణాలోపం, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖకు చెందిన కొందరు సిబ్బందితో ఉన్న ప్రత్యేక ఒప్పందాలతో నిర్వాహకులు గుట్టుగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ దంపతుల నుంచి పెద్ద ఎత్తున వసూలు చేస్తున్నట్లు సమాచారం.

ఫుట్‌పాత్‌లపై దుకాణాల తొలగింపు



మేడ్చల్, మే 8 : మేడ్చల్ జీహెచ్‌ఎంసీ సర్కిల్ పరిధిలోని గుండ్ల పోచంపల్లిలో శుక్రవారం అధికారులు పుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన చిరు వ్యాపారాలను తొలగించారు. నారాయణ చెరువు ఎదుట పుట్‌పాత్ పై దాదాపు 20మంది చిరు వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా అధికారులు పుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసుకున్న చిరు వ్యాపారాల దుకాణాలను యంత్రాల సహాయంతో తొలగించారు. పొట్ట చేతపట్టుకొని బతకడానికి వస్తే ఇలా చేయడం అన్యాయమని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాపారుల గోడును అధికారులు పట్టించుకోక పోవడంతో 15 మంది మహిళలు జీహెచ్ ఎంసీ కార్యాలయానికి వచ్చారు. గోడు చెప్పుకుందామని మహిళలు వస్తే డీసీ లేక పోవడంతో ఆయన రాక కోసం వేచి చూశారు. తమకు న్యాయం చేయాలని మహిళలు కోరారు. తాము ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలిగించడం లేదన్నారు. అక్కడే కూరగాయ వ్యాపారాలు చేసుకునే అవకాశం కల్పించాలన్నారు. ప్రజావాణిలో అధికారులను కలిసి తమ సమస్యను చెప్పుకున్నారు.

డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరించాలి

- ఎమ్మెల్యేలు చామకూర మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
- మేడ్చల్ కలెక్టరేట్‌లో దిశ సమావేశం





దిశ సమావేశంలో సమస్యలపై మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి

మేడ్చల్, మే8(నమస్తే తెలంగాణ): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. దిశ సమావేశంలో సమస్యలను బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు లేవనెత్తి తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అధ్యక్షతన జరిగిన దిశ సమావేశంలో ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి తోపాటు మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌లు పాల్గొని ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరారు.

డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరించాలి : మల్లారెడ్డి

జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరించాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కోరారు. డంపింగ్ యార్డ్ వల్ల ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, డంపింగ్ యార్డ్ నుంచి దుర్వాసన రాకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో ఉన్న మైనింగ్ వల్ల వచ్చే ఆదాయం అధిక మొత్తంలో మేడ్చల్ నియోజకవర్గానికి కేటాయించాలని కోరారు.

నిషేధిత జాబితాలోని భూముల రిజిస్ట్రేషన్‌లపై చర్యలు తీసుకోవాలి : మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి నియోజకవర్గంలోని అల్వాల్ మండలంలోని యూఎల్‌సీ భూములు సర్వే నెంబర్లు 582, 583, 22-ఎ నిషేధిత జాబితాలో ఉన్నప్పటికి రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని.. వాటిపై చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కోరారు. 15 ఫైనాన్స్ కింద మంజూరైన ప్రైమరీ హెల్త్ సెంటర్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మౌలాలి ఇండస్ట్రియల్ ఏరియాలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పర్యవేక్షణ పెంచాలని కోరారు. రహదారులపై అక్రమ నిర్మాణాలు జరగకుండా చూసే విధంగా నేషనల్ హైవే అథారిటి అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ శాఖల వారీగా సమీక్ష చేసి అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

ఉప్పల్ నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయని వేగవంతంగా కొనసాగించాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వివరించారు. ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ప్రధానంగా తాగునీరు, డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.

ముప్పతిప్పలు పెడుతూ!

(మొదటిపేజీ తరువాయి)

రూపాయలు చెల్లించి, మళ్లీ మెకానికల్ మీటర్ రీడర్లను ఏర్పాటు చేసుకుంటూ రెండు విధాలా నష్టపోతున్నారు. ఆటోమేటెడ్ మీటర్ రీడర్లు లేకపోవడంతో రిపేర్లు వచ్చినా పట్టించుకోవడం లేదు. దీంతో యావరేజీ బిల్లుల పేరిట లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. అధికారులు మాత్రం ఏజెన్సీలు మీటర్ రీడర్లను ఏర్పాటు చేయకున్నా టంఛన్‌గా వారికి వెళ్లాల్సిన బిల్లులను ఎప్పటికప్పుడు విడుదల చేస్తున్నారు. లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని జలమండలి అధికారులు, మీటర్ రీడర్ల ఏజెన్సీలు సంయుక్తంగా దోచుకుంటున్నారని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రూ.లక్షల్లో నష్టపోతున్న వినియోగదారులు

జలమండలి నల్లా కనెక్షన్ తీసుకున్న వినియోగదారులకు కనెక్షన్ స్థాయిని బట్టి బల్క్‌లో 40 ఎంఎం నుంచి 200 ఎంఎం పైపులైన్ లైన్ వేస్తారు. ఈబల్క్ కనెక్షన్లు తీసుకునేవారికి కనెక్షన్ ఫీజుతో పాటు ఆటోమేటెడ్ మీటర్ రీడర్ల చార్జీలు కూడా అందులోనే కలిపి వసూలు చేస్తారు. మీటర్‌కు ఐదేండ్ల వారెంటీ కూడా ఉంటుంది. ఈ ఐదేండ్ల పాటు మీటర్‌కు ఎలాంటి మరమ్మతులు వచ్చినా జలమండలిదే బాధ్యత ఉంటుంది. జలమండలి అధికారులు ఈ మీటర్ రీడర్ల సరఫరాకు కొన్ని ఏజెన్సీలను హైర్ చేసుకుని వారి ద్వారా సరఫరా చేస్తున్నారు. కానీ ఆయా ఏజెన్సీల నిర్లక్ష్యం, అలసత్వంతో మీటర్లను బిగించడం లేదు. కొన్ని చోట్ల బిగించినా.. మరమ్మతులు చేయడానికి సంప్రదిస్తే స్పందించడం లేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కనెక్షన్ తీసుకున్న వెంటనే మీటర్ బిగించాల్సి ఉంటుంది. లేదంటే క్యాన్ నెంబర్ రాదు. ఏజెన్సీలు స్పందించకపోవడం, జలమండలి అధికారులు పట్టించుకోకపోవడంతో వినియోగదారులు మెకానికల్ మీటర్లను బిగించుకుంటున్నారు. ఇలా నగరంలోని వందలాది బల్క్ కనెక్షన్‌లలో ఇదే జరుగుతున్నదని వినియోదారులు వాపోతున్నారు. మెకానికల్ మీటర్ చెడిపోయి యావరేజి పేరిట జలమండలి అధికారులు రూ.లక్షల్లో సంబంధిత అపార్ట్‌మెంట్లు, బల్క్ కనెక్షన్‌దారుల నుంచి వసూలు చేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే తామేమీ చేయలేమని క్షేత్రస్థాయి అధికారులు తేల్చి చెబుతున్నట్లు వినియోగదారులు వాపోతున్నారు. ఇదంతా ఉన్నతాధికారులకు తెలిసినా ఎలాంటి దిద్దుబా టు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. బిల్లులు, మీటర్ల పేరిట రూ.లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని జలమండలి అధికారులు కాజేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మీటర్ పనిచేయకపోవడంతో రూ. 11,04,712 బిల్లు

యాప్రాల్‌లోని జనప్రియ ఆర్కెడ్ అనే అపార్ట్‌మెంట్‌లో బల్క్ కనెక్షన్ తీసుకున్నారు. 622306650 దీని క్యాన్ నెంబర్. కనెక్షన్‌తో పాటు ఆటోమేటెడ్ మీటర్ రీడర్‌కు జలమండలి అధికారులు రూ.2,25,000 వసూలు చేశారు. జలమండలి అధికారులు లైసెన్సులు ఇచ్చిన ఏజెన్సీ మీటర్‌ను బిగించలేదు. మీటర్ లేకుంటే కనెక్షన్ ఇవ్వబోమని అధికారులు చెప్పడంతో మరో రూ.40 వేలు వెచ్చించి మెకానికల్ మీటర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. కొద్దిరోజుల తర్వాత ఆ మీటర్ మరమ్మతులకు గురయ్యింది. మరమ్మతులు చేసేందుకు ఏజెన్సీ, జలమండలి అధికారులు రాలేదు. దీంతో జలమండలి అధికారులు యావరేజి పేరిట లక్షలాది రూపాయలు బిల్లుల మోత మోగించారు. ఆ అపార్ట్‌మెంట్ వాసులకు ఏకంగా రూ.11,04,712 బిల్లు వేశారు. ఆ మొత్తాన్ని చెల్లించకుంటే కనెక్షన్ కట్ చేస్తామని చెప్తున్నారు. ఇలాంటివి నగరంలో వందలాదిగా ఉన్నాయని వినియోగదారులు వాపోతున్నారు. అధికారులు మాత్రం అవేమీ పట్టించుకోకుండా బిల్లుల మోత మోగించి, ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

- పటాన్‌చెరు డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ ఎం.చంద్రశేఖర్
- పశువుల దాణా దుకాణాలపై డ్రగ్స్ అధికారుల దాడులు
- 450 మిల్లీలీటర్ల ఆక్సిటోసిన్ స్వాధీనం

పటాన్‌చెరు టౌన్, మే 8 : పశువుల దాణా దుకాణాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని పటాన్‌చెరు డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ ఎం.చంద్రశేఖర్ అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలో రెండు పశువుల దాణా దుకాణాలపై దాడులు జరిపినట్లు శుక్రవారం తెలిపారు. పటాన్‌చెరు మండల పరిధిలోని పాటి ఎక్స్ రోడ్ వద్ద ఉన్న శ్రీ రేణుక క్యాటిల్ ఫీడ్, చైతన్య నగర్ కాలనీ ఎంజీ రోడ్ పరిధిలోని లక్ష్మీ కృష్ణ క్యాటిల్ ఫీడ్ దుకాణాలపై గురువారం దాడులు నిర్వహించినట్లు తెలిపారు. పాటి ఎక్స్ రోడ్డు వద్ద ఉన్న పశువుల దాణా దుకాణంలో 200 మిల్లీ లీటర్ల ఆక్సిటోసిన్ ఔషదం 40 సీసాలు గుర్తించినట్లు తెలిపారు. అలాగే చైతన్యనగర్ కాలనీలోని పశువుల దాణా దుకాణంలో 250 మిల్లీ లీటర్ల ఆక్సిటోసిన్ 120 సీసాలను గుర్తించినట్లు తెలిపారు. చట్ట ప్రకారం నియమాల ఉల్లంఘన కింద కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ దాడుల్లో పటాన్‌చెరు డ్రగ్స్ సహాయ సంచాలకులు రాము, పాశమైలారం డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్, సంగారెడ్డి డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ రవికిరణ్ రెడ్డి, బొల్లారం డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.



డ్రగ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న ఆక్సిటోసిన్ ఇంజెక్షన్

పోలీసులమంటూ బురిడీ

- యువకులను కిడ్నాప్ చేసిన వైనం
- ప్రేమ వ్యవహారంలో సెటిల్‌మెంట్
- రూ.33లక్షల వసూలు
- బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు

బంజారాహిల్స్,మే 8: పోలీసులం అంటూ నమ్మించి యువకులను కిడ్నాప్ చేయడంతో పాటు డబ్బులు వసూలు చేసిన ఘటనపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్‌లో నివాసం ఉంటున్న నిఖిల్ అనే యువకుడికి గచ్చిబౌలి ప్రాంతంలోని యువతితో ప్రేమాయణం ఉండేది. తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా లోబర్చుకున్నాడంటూ నిఖిల్‌పై ఐదునెలల క్రితం బాధిత యువతి ఫిర్యాదు చేయడంతో నిఖిల్ మీద కేసు నమోదయింది. కేసులో రాజీ పడేందుకు డబ్బు ఇవ్వాలంటూ యువతి కోరడంతో నిఖిల్ అంగీకరించలేదు. కాగా గత నెల 10న బంజారాహిల్స్ రోడ్ నెం 13లో నివాసం ఉంటున్న నిఖిల్ స్నేహితుడు సాయిని కొంత మంది వ్యక్తులు బలవంతంగా కారులో ఎక్కించుకుని కుషాయిగూడకు తీసుకువెళ్లారు. తాము పోలీసులమని గచ్చిబౌలిలో కేసులో నిందితుడిగా ఉన్న నిఖిల్ ఎక్కడున్నాడంటూ ప్రశ్నించారు. నిఖిల్ అనంతపూర్‌లో ఉన్నాడని చెప్పగా సాయిని తమ కారులో ఎక్కించుకున్న ఆగంతకులు అనంతపూర్‌కు వెళ్లారు. అక్కడ హోటల్‌లో ఉన్న నిఖిల్‌తో పాటు స్నేహితుడు మహేష్‌ను కారులో ఎక్కించుకుని మొయినాబాద్ సమీపంలోని ఫామ్‌హౌజ్‌లో బంధించారు. దీంతో కేసులో రాజీ పడేందుకు రూ.50లక్షలు ఇస్తానని నిఖిల్ చెప్పడంతో రూ.20లక్షల నగదును ఇచ్చారు. కొన్నిరోజుల తర్వాత తన వద్ద ఉన్న బంగారు ఆభరణాలను అమ్మేసిన నిఖిల్ రూ.13లక్షలు వారికి చెల్లించాడు. మిగిలిన డబ్బులు ఎప్పుడు ఇస్తావంటూ గత కొన్ని రోజులుగా సుధీర్‌బాబు, జాన్, ప్రసాద్‌రెడ్డి అనే వ్యక్తులు నిఖిల్‌కు ఫోన్లు చేస్తున్నారు. ఇటీవల వాకబు చేయగా తమను కిడ్నాప్ చేసిన వ్యక్తులు పోలీసులు కాదని, బాధిత యువతికి చెందిన వ్యక్తులు అని తెలుసుకున్న నిఖిల్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కులం పేరుతో పెళ్లికి నిరాకరణ

వివాహం చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన యువకుడు

బంజారాహిల్స్, మే 8 : పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా వాడుకుని కులం పేరుతో పెళ్లికి నిరాకరించిన వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయింది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్‌లో నివాసం ఉంటున్న యువతి (22)కి ఏడాది క్రితం గుడిమల్కాపూర్ ప్రాంతానికి చెందిన శివరాత్రి సాగర్(23) అనే వ్యక్తితో ఓ పెళ్లిలో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆ యువతిని శారీరకంగా లోబర్చుకున్నాడు. యువతి గర్భం దాల్చగా అబార్షన్ చేయించాడు. కాగా ఇటీవల పెళ్లి గురించి ప్రశ్నించగా ఇంట్లో పెద్దలు కులం పేరుతో అభ్యంతరం పెడుతున్నారని సాగర్ చెప్పాడు. పెళ్లి విషయం మర్చిపోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని సాగర్ కుటుంబ సభ్యులు సైతం బెదిరింపులకు గురి చేశారు. దీంతో తనను శారీరకంగా లోబర్చుకోవడంతో పాటు కులాన్ని సాకుగా చూపి పెళ్లికి నిరాకరించిన సాగర్‌తో పాటు కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలంటూ బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదుతో బీఎన్‌ఎస్ 69తో పాటు ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రేపు ఆ ప్రాంతాల్లో 'నో' ఫ్లైయింగ్ జోన్

సిటీబ్యూరో, మే 8 (నమస్తే తెలంగాణ): భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈనెల 10న హైదరాబాద్‌లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని హైటెక్ సిటీలో సింధూ హాస్పిటల్‌ను ప్రారంభించడంతో పాటు మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభలో పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆ రోజు సైబరాబాద్‌లోని మాదాపూర్ మల్కాగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని బేగంపేట్, బోయిన్‌పల్లి, మారేడ్‌పల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో నో ఫ్లైయింగ్ జోన్‌గా ప్రకటిస్తూ ఆయా పోలీస్ కమిషనరేట్ అధికారులు వేరు వేరుగా నిషేధాజ్ఞలు జారీ చేశారు. ఇందులో భాగంగా రిమోట్ కంట్రోల్‌తో నిర్వహించే డ్రోన్‌లు, పారా గ్లేడర్, మైక్రోలైట్ ఎయిర్ క్రాఫ్ట్ ఎగురవేతలపై నిషేధిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోగి ప్రాణాలు కాపాడిన మెడికవర్ వైద్యులు

మహిళ కడుపులో నుంచి 3.5 కేజీల కణితి తొలగింపు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మెడికవర్ డాక్టర్లు భవ్య, రఘురామిరెడ్డి

రామచంద్రాపురం,మే8: భరించలేని కడుపునొప్పితో బాధపడుతున్న రోగికి పరీక్షలు నిర్వహించి అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్స చేసి రోగి కడుపులో నుంచి కణితిని తొలగించామని మెడికవర్ వైద్యులు జి.భవ్య, ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. శుక్రవారం మెడికవర్ దవాఖానలో విలేకరులతో మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా బోడపట్ల గ్రామానికి చెందిన టి.సంధ్య గత రెండు వారాలుగా తీవ్రమైన కడుపునొప్పి, పొట్ట బరువుగా మారటం, క్రమంగా పొట్ట అసాధారణంగా పెరగడం వంటి సమస్యతో బాధపడుతున్నది. తీవ్రమైన కడుపునొప్పితో రోగి మెడికవర్ దవాఖానను సంప్రదించడంతో ఆమెకు పరీక్షలు నిర్వహించి ఉదర భాగమంతా ఆక్రమించిన భారీ సిస్టిక్‌మాస్‌ని గుర్తించారు. వైద్యులు అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్స చేసి రోగి కడుపులో ఫుట్‌బాల్ సైజు పరిమాణంలో ఉన్న 3.5 కేజీల కణితిని తొలగించి రోగి ప్రాణాలను కాపాడటం జరిగిందన్నారు. అనంతరం కణితిని క్యాన్సర్ నిర్ధారణ కోసం పరీక్షలకు పంపించగా పరీక్షల్లో క్యాన్సర్ లేదని తేలిందన్నారు. ప్రస్తుతం మహిళ ఆరోగ్యంగా కోలుకుంటున్నదని పేర్కొన్నారు.

గ్రేటర్ @ 36.6 డిగ్రీలు

సిటీబ్యూరో, మే 8 (నమస్తే తెలంగాణ): ద్రోణి ప్రభావంతో నగరంలో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికి చేరుకున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు గ్రేటర్‌లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 36.6డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 26.6డిగ్రీలు, గాలిలో తేమ 39శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా ద్రోణి కారణంగా రాగల 36 గంటలు గ్రేటర్‌లోని పలుచోట్ల తేలిక పాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు అధికారులు వెల్లడించారు.





చిన్నారులకు చాక్‌లెట్స్ అందజేస్తున్న లులూ యాజమాన్య నిర్వాహకులు

- లూలూ హైపర్ మార్కెట్ హైదరాబాద్‌లో

బిగ్ చాకోడేస్ ప్రారంభం

హైదరాబాద్‌లోని లూలూ మార్కెట్‌లో ఈ నెల 8నుంచి 17వరకు 10రోజుల పాటు నిర్వహించనున్న బిగ్ చాకోడేస్ ఫెస్టివల్‌ను శుక్రవారం ఆశ్రీ సొసైటీ ఎన్జీవో చిన్నారుల చేతుల మీదుగా ఆనందోత్సవాల మధ్యన ప్రారంభించారు. ఈ సందర్భంగా లూలూ యాజమాన్యం నిర్వాహకులు మాట్లాడుతూ.. ఈ ప్రారంభోత్సవంలో చిన్నారులను నిజమైన అతిథులుగా ఆహ్వానించి వారిలో స్వచ్ఛమైన ఆనందం, చిరునవ్వులు నింపడం కోసమే ప్రత్యేకంగా ఈ వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం లూలూ ఫన్‌టూరాలో థ్రిల్లింగ్ రైడ్స్, గేమ్స్‌తో చిన్నారులు ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లూలూ సంస్థ డైరెక్టర్ గంగాధరన్ (ఉత్తరప్రదేశ్, తెలంగాణ, ఢిల్లీ), మహమ్మద్ షరీఫ్ పీపీ, (రీజినల్ మేనేజర్ తెలంగాణ), విశాల్‌కుమార్ (డీజీఎం), ఎజిరసన్ (మాల్ మేనేజర్), సఫరుద్దీన్ (బయింగ్ మేనేజర్) హాజరయ్యారు. – హైదరాబాద్, సిటీబ్యూరో మే 8



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ జావెద్

రైల్లో గంజాయి

సరఫరా

నిందితుల నుంచి 17.909 కిలోల గంజాయి స్వాధీనం

మారేడ్‌పల్లి, మే 8 : ఒడిశా నుంచి గుజరాత్ కు రైల్లో అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఓ వ్యక్తితో పాటు మైనర్ బాలుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నిందితుల వద్ద నుంచి 8 లక్షల 95 వేల 450 రూపాయాల విలువ చేసే 17.909 కిలో విలువ చేసే గంజాయిని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విలేకర్ల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను రైల్వే డీఎస్పీ జావెద్, ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్‌లు వెల్లడించారు. ఒడిశా కి చెందిన దీపక్ స్వైన్ కుటుంబ సభ్యులతో కలిసి గుజరాత్ లోని సూరత్‌లో ఉంటూ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం నిందితుడు దీపక్ స్వైన్ ఓ మైనర్ బాలుడి (16) తో కలిసి తన స్వగ్రామం అయిన ఒడిశాకు వచ్చాడు. వీరిని స్థానికంగా ఉన్న రాజేష్ కుమార్ అనే వ్యక్తి సంప్రదించాడు. ఒక్కొక్క గంజాయి ప్యాకెట్‌ను తరలిస్తే రూ.7 వేల రూపాయాలు చెల్లిస్తానని ప్రలోభపెట్టాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా నిందితులు గంజాయి అక్రమ రవాణ సరఫరాకు ఒప్పుకున్నారు. అనంతరం ప్రధాన నింధితుడు రాజేష్ కుమార్ సూచన మేరకు పుల్బాని అటవీ ప్రాంతంలో గంజాయి ప్యాకెట్లు స్వీకరించి, రెండు ట్రాలీ సూట్ కేసుల్లో దాచుకొని విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి సూరత్ కు వెళ్లేందుకు రాత్రి రైలు కోసం జనరల్ వెయిటింగ్ హాల్‌లో వేచి ఉండగా అనుమానాస్పదంగా ఉన్న వారిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన నేరాన్ని అంగీకరించారు. మైనర్ బాలుడిని జువెనైల్ హోంకు తరలించగా, మరో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.